

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు



సోమవారం | 29-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 165

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి సా.4:32 తదుపరి అష్టమి; నక్షత్రం: మూల పూర్తి; వర్జ్యం: ప.12:42-2:28, తె.4:32-6:18, దుర్ముహూర్తం: ప.12:29-1:16, ప.2:51-3:39, అమృతఘడియలు: రా.11:15-1:01, రాహుకాలం: ఉ.7:30-9:00, సూర్యోదయం: 6:08, సూర్యాస్తమయం: 6:02

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయ తిలకం!

తిలక్ వర్మ వీరోచిత పోరాటం

భారత్ ఖాతాలో ఆసియాకప్

రాణించిన దూబే, సంజు, కుల్దీప్

ఇది కదా అసలు సిసలు మజా అంటే.. ఆసియాకప్ ఫైనల్లోనూ దాయాది పాకిస్థాన్ ప్రత్యర్థిగా నిలిచిన వేళ.. ముచ్చటగా మూడోసారీ టీమిండియా తిరుగులేని పంచ్ ఇస్తుంటే.. అంతకు మించిన ఆనందం భారత క్రీడాభిమానికేముంటుంది. అయితే 147 పరుగుల స్వల్ప ఛేదనలో సూర్య సేన ఓ దశలో 20/3 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ దెబ్బకు అందరికీ ఫలితంపై ఏ మూలో సందేహం. కీలక ఫైనల్లో తడబాటు తప్పదా? అనిపించింది. కానీ క్లిష్టంగా మారిన పిచ్‌పై తెలుగు తేజం తిలక్ వర్మ చూపిన తెగింపు వహ్వా అనిపించక మానదు. ఆఖరి ఓవర్ వరకు పట్టుదలగా నిలిచిన తను భారత్ ఖాతాలో తొమ్మిదో టైటిల్‌ను వేసి దేశాన్ని సంబరాల్లో ముంచాడు..


తిలక్ వర్మ (53 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 69 నాటౌట్)


కుల్దీప్ (4/30)

ఆపరేషన్ సిందూర్..

దుబాయ్: ఆసియాకప్ టీ20 టోర్నమెంట్‌లో భారత క్రికెట్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. బౌలర్లు విశేషంగా రాణించిన చోట.. బ్యాటర్లు కాస్త తడబడినా తిలక్ వర్మ (53 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 69 నాటౌట్) అజేయంగా నిలిచాడు. తద్వారా పాకిస్థాన్‌కు వరుసగా మూడో ఓటమిని రుచి చూపిస్తూ భారత్ 5 వికెట్ల తేడాతో గెలిచింది. అలాగే టోర్నీలో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి కప్‌ను గెలవడం విశేషం. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 19.1 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు సాహిబ్‌జాదా ఫర్హాన్ (38 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 57), ఫఖర్ జమాన్ (35 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 46), సయిామ్ అయూబ్ (14) మాత్రమే ఫర్వాలేదనిపించగా.. ఎనిమిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. స్పిన్నర్లు కుల్దీప్‌నకు నాలుగు.. అక్షర్, వరుణ్, పేసర్ బుమ్రాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లకు 150 పరుగులు చేసి గెలిచింది. దూబే (22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 33), శాంసన్ (21 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 24) సహకరించారు. అష్రాఫ్‌కు మూడు వికెట్లు దక్కాయి. **మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా తిలక్ నిలిచాడు. మ్యాన్ ఆఫ్ ది టోర్నీ అవార్డు అభిషేక్ వర్మ (314 పరుగులు)కు లభించింది.**

తిలక్ నిలబెట్టాడు..

పాక్ నిర్దేశించిన స్వల్ప ఛేదనలో భారత్‌కు ఆరంభంలోనే గట్టి ఝలక్‌లు తగిలినా తిలక్ వర్మ ఎదురొడ్డి నిలిచాడు. అతడికి శాంసన్, దూబే సహకరించారు. తాజా టోర్నీలో ఎదురు లేకుండా సాగిన ఓపెనర్ అభిషేక్ (5)ను కట్టడి చేయడంలో ఈసారి పాక్ బౌలర్లు సఫలమయ్యారు. రెండో ఓవర్‌లో పేసర్ అష్రాఫ్ స్లోబాల్‌ను సిక్సర్‌గా మలిచే ప్రయత్నంలో తను క్యాచ్ అవుటయ్యాడు. ఇక తర్వాతి ఓవర్‌లోనే కెప్టెన్ సూర్య (1) క్యాచ్‌ను కెప్టెన్ సల్మాన్ అద్భుతంగా పట్టేశాడు. దీనిపై రివ్యూ కోరినా ఫలితం లేకపోయింది. పేసర్ షహీన్ ఈ వికెట్ తీశాడు. ఓపెనర్ గిల్ (12) ఈ క్లిష్ట పరిస్థితిలో నిలుస్తాడని ఆశించినా అతడూ నిరాశపరిచాడు. అష్రాఫ్ ఓవర్‌లోనే మిడాఫ్‌లో రౌఫ్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో తొలి నాలుగు ఓవర్లలోనే జట్టు 3 వికెట్లు కోల్పోయింది. అప్పటికి స్కోరు 20 పరుగులే కావడం గమనార్హం. అయితే ఈ దశలో తిలక్-శాంసన్ జోడీ ఆదుకునే ప్రయత్నం చేసింది. ఆరో ఓవర్‌లో తిలక్ 4,6తో 11 రన్స్ రావడంతో పవర్‌ప్లేలో జట్టు 36/3తో నిలిచింది. కానీ పిచ్ పరిస్థితిని బట్టి వీరు రిస్కీ షాట్లకు వెళ్లకుండా, అడపాదడపా బౌండరీలతో పరుగులను రాబట్టారు. తొమ్మిదో ఓవర్‌లో శాంసన్ క్యాచ్‌ను తలత్ జారవిడిచాడు. స్పిన్నర్లు అబ్రార్, సయిామ్ ఓవర్లలో వీరు చెరో సిక్సర్‌తో ఆకట్టుకున్నారు. కానీ చక్కగా కుదురుకున్న ఈ జోడీని 13వ ఓవర్‌లో అబ్రార్ విడదీశాడు. శాంసన్ క్యాచ్‌ను ఫర్హాన్ పట్టేయడంతో నాలుగో వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. డెత్ ఓవర్లలో తిలక్-దూబే ద్వయం జోరు పెంచింది. 15వ ఓవర్‌లో అతడి 4,6.. దూబే 4తో 17 రన్స్ వచ్చాయి. తర్వాతి ఓవర్‌లోనే దూబే సిక్సర్ బాదగా తిలక్ 41 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. కానీ 17వ ఓవర్‌లో పేసర్ షహీన్ కేవలం ఆరు పరుగులే ఇచ్చి ఉత్కంఠ పెంచాడు. అయితే దూబే సిక్సర్‌తో 18వ ఓవర్‌లో 13 రన్స్ వచ్చాయి. 19వ ఓవర్‌లో దూబే అవుటైనా.. ఆఖరి ఓవర్‌లో 10 రన్స్ కావాల్సిన వేళ తిలక్ 6, రింకూ (4 నాటౌట్)తో మ్యాచ్‌ను అద్భుతంగా ముగించారు.

స్పిన్ ధాటికి విలవిల

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఇన్నింగ్స్ ఆరంభానికి, ముగింపునకు పొంతన లేకుండా సాగింది. ఓపెనర్లు ఫర్హాన్, ఫఖర్ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగి పరుగులు రాబట్టడంతో 180+ స్కోరు ఖాయమనిపించింది. తొలి పది ఓవర్ల పాటు పాక్ ఆధిపత్యమే సాగినా..స్పిన్నర్లు సరైన సమయంలో వికెట్లను పడగొట్టి భారత్‌కు రిలీఫ్‌నందించారు. కుల్దీప్ అయితే తన చివరి రెండు ఓవర్లలో ఏడు పరుగులే ఇచ్చి నాలుగు వికెట్లు తీయడం విశేషం. ఫీల్డింగ్‌లోనూ భారత్ అదుర్స్ అనిపించుకుంది. హార్దిక్ లేకపోవడంతో శివమ్ దూబే కొత్త బంతితో బౌలింగ్ ఆరంభించాడు. ఇక బుమ్రా వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో 4,6తో 13 రన్స్ రాబట్టాడు. దీంతో పవర్‌ప్లేలో పాక్ 45 రన్స్ సాధించింది. అనంతరం కుల్దీప్ రెండు వరుస ఓవర్లలో ఫర్హాన్ ఒక్కో సిక్సర్‌తో ఒత్తిడి పెంచడమే కాకుండా, 35 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే ఈసారి తను గన్ సెల్యూట్ సంబరాల జోలికి మాత్రం పోలేదు. ఇక పదో ఓవర్‌లో మరో సిక్సర్‌తో జోరు చూపిన ఫర్హాన్‌ను వరుణ్ దెబ్బతీశాడు. 'పుల్'తో భారీ షాట్‌కు ప్రయత్నించిన తను డీప్ మిడ్ వికెట్‌లో తిలక్‌కు క్యాచ్ ఇచ్చాడు. అప్పటికే తొలి వికెట్‌కు 84 పరుగులు జత చేరాయి. అయితే 13వ ఓవర్ నుంచి స్పిన్నర్ల ఉచ్చు లో చిక్కుకుని పాక్ బ్యాటర్లు విలవిల్లాడారు. కుల్దీప్, అక్షర్, వరుణ్ తమ వరుస ఓవర్లలో వికెట్లను పడగొడుతూనే పోయారు. 17వ ఓవర్‌లోనైతే కుల్దీప్ ఏకంగా ముగ్గురిని పెవిలియన్‌కు చేర్చాడు. మొత్తంగా స్పిన్నర్ల ధాటికి 33 రన్స్ వ్యవధిలో పాక్ చివరి 9 వికెట్లను కోల్పోయింది.

ఒకే ఆసియాకప్ టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కుల్దీప్ (17)

పాక్‌పై తొమ్మిది సార్లు ఛేదనకు దిగిన ప్రతీసారి భారత్ గెలవడం విశేషం.

2019, డిసెంబరు నుంచి శివమ్ దూబే ఆడిన చివరి 34 టీ20 మ్యాచ్‌ల్లోనూ భారత్ ఓడిపోలేదు.

పురుషుల టీ20 టోర్నీలను ఓటమి లేకుండా భారత్ దక్కించుకోవడం ఇది నాలుగోసారి. 2016 ఆసియాకప్, 2023 ఆసియాగేమ్స్, 2024 టీ20 వరల్డ్‌కప్ లోనూ ఇలాగే గెలిచింది.

'మైదానంలో ఆపరేషన్ సిందూర్. అదే ఫలితం.. భారత విజయం. క్రికెటర్లకు అభినందనలు'
- ప్రధాని నరేంద్ర మోదీ

ట్రోఫీ అందుకోని టీమిండియా

ఆసియాకప్ చాంపియన్‌గా నిలిచిన టీమిండియా తామనుకున్నది సాధించింది. విజేతగా నిలిస్తే పీసీబీ చీఫ్, ఏసీసీ అధ్యక్షుడు కూడా అయిన మొహిసిన్ నఖ్వీ చేతుల మీదుగా తాము ట్రోఫీ అందుకోమని ముందుగానే ప్రకటించింది. పాక్‌తో ఫైనల్ గెలిచాక కూడా సూర్య సేన ఇదే వైఖరికి కట్టుబడి ఉంది. దీంతో ట్రోఫీ బహూకరణ గంటన్నర ఆలస్యమైంది. అటు పాక్ ఆటగాళ్లు డ్రెస్సింగ్‌రూమ్‌కే పరిమితమై బయటకు వచ్చేందుకు చాలా సమయం తీసుకున్నారు. తిలక్, కుల్దీప్, అభిషేక్ తమకు వచ్చిన అవార్డులను తీసుకున్నారు. అయితే విజేత ట్రోఫీని ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు వైస్ చైర్మన్ ఖలీద్ అల్ జరూనీ చేతుల మీదుగా అందిస్తారని సమాచారం వచ్చింది. చివరకు అది కూడా జరుగలేదు. భారత జట్టు ట్రోఫీని స్వీకరించడం లేదని ఏసీసీ చెప్పినట్టు ప్రెజెంటర్ సైమన్ డౌల్ తెలిపి కార్యక్రమాన్ని ముగించాడు.

ఇద్దరు కెప్టెన్లు చెరొకరితో..



దుబాయ్: ఫైనల్ మ్యాచ్ టాస్ సమయంలో అరుదైన దృశ్యం చోటు చేసుకుంది. సహజంగా టాస్ వడ్డాక ఇరు జట్ల కెప్టెన్లు అక్కడున్న ప్రెజెంటర్‌తో తమ అభిప్రాయాలను పంచుకుంటారు. కానీ అంతర్జాతీయ క్రికెట్‌లో తొలిసారిగా టాస్ ఇంటర్వ్యూను ఇద్దరు మాజీ ఆటగాళ్లు నిర్వహించడం గమనార్హం. భారత కెప్టెన్ సూర్యకుమార్ రవిశాస్త్రితో మాట్లాడగా, పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా.. వకార్ యూనిస్‌తో సంభాషించాడు. టాస్ సమయంలో రవిశాస్త్రితో తమ కెప్టెన్ సల్మాన్ మాట్లాడడని పాక్ తెగేసి చెప్పింది. దీంతో అతడి స్థానంలో తటస్థ వ్యక్తిని నియమించాలని ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) బీసీసీఐని కోరింది. కానీ అందుకు భారత క్రికెట్ బోర్డు ససేమిరా అంది. అందుకే మధ్యేమార్గంగా శాస్త్రితో పాటు పాక్ మాజీ పేసర్ వకార్ యూనిస్‌ను కూడా టాస్ సమయంలో పంపారు.

స్కోరుబోర్డు

పాకిస్థాన్ : ఫర్హాన్ (సి) తిలక్ (బి) వరుణ్ 57, ఫఖర్ జమాన్ (సి) కుల్దీప్ (బి) వరుణ్ 46, అయూబ్ (సి) బుమ్రా (బి) కుల్దీప్ 14, మహ్మద్ హారిస్ (సి) రింకూసింగ్ (బి) అక్షర్ 0, సల్మాన్ ఆఘా (సి) శాంసన్ (బి) కుల్దీప్ 8, హుస్సేన్ తలత్ (సి) శాంసన్ (బి) అక్షర్ 1, మహ్మద్ నవాజ్ (సి) రింకూసింగ్ (బి) బుమ్రా 6, షహీన్ షా (ఎల్బీ) కుల్దీప్ 0, ఫహీమ్ అష్రఫ్ (సి) తిలక్ (బి) కుల్దీప్ 0, హారిస్ రౌఫ్ (బి) బుమ్రా 6, అబ్రార్ అహ్మద్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు : 7; మొత్తం 19.1 ఓవర్లలో 146 ఆలౌట్ ; వికెట్లపతనం :** 1-84, 2-113, 3-114, 4-126, 5-131, 6-133, 7-134, 8-134, 9-141 ; **బౌలింగ్ :** దూబే 3-0-23-0, బుమ్రా 3.1-0-25-2, వరుణ్ 4-0-30-2, అక్షర్ 4-0-26-2, కుల్దీప్ 4-0-30-4, తిలక్ వర్మ 1-0-9-0.

భారత్ : అభిషేక్ (సి) రౌఫ్ (బి) ఫహీమ్ అష్రఫ్ 5, గిల్ (సి) రౌఫ్ (బి) ఫహీమ్ అష్రఫ్ 12, సూర్యకుమార్ (సి) ఆఘా (బి) షహీన్ షా 1, తిలక్ వర్మ (నాటౌట్) 69, శాంసన్ (సి) ఫర్హాన్ (బి) అబ్రార్ 24, దూబే (సి) షహీన్ షా (బి) ఫహీమ్ అష్రఫ్ 33, రింకూసింగ్ (నాటౌట్) 4 ; **ఎక్స్‌ట్రాలు : 2 ; మొత్తం 19.4 ఓవర్లలో 150/5 ; వికెట్లపతనం :** 1-7, 2-10, 3-20, 4-77, 5-137 ; **బౌలింగ్ :** షహీన్ షా 4-0-20-1, ఫహీమ్ అష్రఫ్ 4-0-29-3, మహ్మద్ నవాజ్ 1-0-6-0, హారిస్ రౌఫ్ 3.4-0-50-0, అబ్రార్ అహ్మద్ 4-0-29-1, అయూబ్ 3-0-16-0.



శ్రీహరి రజత కాంతులు

● 16 ఏళ్ల నిరీక్షణకు తెర

● ఆసియా అక్వాటిక్స్ చాంపియన్‌షిప్స్

అహ్మదాబాద్: ఆసియా అక్వాటిక్ చాంపియన్‌షిప్స్‌లో భారత 16 ఏళ్ల పతక నిరీక్షణకు ఏస్ స్విమ్మర్ శ్రీహరి నటరాజ్ తెరదించాడు. పోటీలు ఆరంభమైన తొలి రోజే రెండు రజతాలతో సహా మూడు పతకాలతో మెరిశాడు. ఈ క్రమంలో ఓ ఈవెంట్‌లో రెండు అంతకంటే ఎక్కువ పతకాలు సాధించిన తొలి భారత స్విమ్మర్‌గానూ రికార్డులకెక్కాడు. ఆదివారం జరిగిన పురుషుల 200 మీ. ఫ్రీస్టయిల్‌లో శ్రీహరి ఒక నిమిషం 48.47 సెకన్ల టైమింగ్‌తో రజతం సొంతం చేసుకొన్నాడు. ఇక, 50 మీ. బ్యాక్ స్ట్రోక్‌లో 25.46 సెకన్ల టైమింగ్‌తో శ్రీహరి రెండో రజతం దక్కించుకొన్నాడు. 4x100లో దాస్, లిఖిత్ సెల్వరాజ్, బెనిసన్, శ్రీహరిల బృందం 3:40.87 సెకన్లలో పూర్తి చేసి కాంస్యం అందుకుంది. తెలంగాణకు చెందిన వ్రితి అగర్వాల్ మహిళల 1500 మీ. ఫ్రీస్టయిల్‌లో ఐదో స్థానంతో సరిపెట్టుకుంది.



విరాట్ పోస్ట్ వైరల్



న్యూఢిల్లీ: భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఐపీఎల్ తర్వాత బ్యాట్ పట్టలేదు. భార్య అనుష్క, పిల్లలతో కలిసి లండన్‌లో విరాట్ సేద తీరుతున్న విషయం తెలిసిందే. త్వరలో ఆస్ట్రేలియాతో జరుగబోయే వన్డే సిరీస్ కోసం అక్కడే సన్నద్ధమవుతున్నాడు. సోషల్ మీడియాలో అప్పుడప్పుడు అభిమానులను పలకరించే విరాట్ తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో అనుష్కతో కలిసి ఉన్న ఓ ఫొటోను 'చాలా కాలం తర్వాత' అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేశాడు. అంతే.. ఒక్క రోజులోనే దానికి 11 మిలియన్ల లైక్స్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేయడం విశేషం.

బీసీసీఐ కొత్త అధ్యక్షుడిగా
మిథున్ ఏకగ్రీవం

● సెలెక్షన్ కమిటీలో ఆర్‌పీ సింగ్, ఓజా

● మహిళల కమిటీలో స్రవంతి నాయుడు


మిథున్ మన్హాస్


ఓజా


స్రవంతి

ముంబై: ప్రపంచంలోనే అత్యంత ధనిక బోర్డు బీసీసీఐ 37వ అధ్యక్షుడిగా ఢిల్లీ మాజీ క్రికెటర్ మిథున్ మన్హాస్ (45) ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఆదివారం జరిగిన బోర్డు 94వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో కొత్తగా ఎన్నికైన ఆఫీసు బేరర్లను ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా రాజీవ్ శుక్లా, కార్యదర్శిగా దేవజిత్ సైకియా కొనసాగనున్నారు. కోశాధికారిగా భారత మాజీ స్పిన్నర్ రఘురామ్ భట్ బాధ్యతలు అందుకోనున్నాడు. ఐపీఎల్ చైర్మన్ పదవిని అరుణ్ ధూమల్ తిరిగి దక్కించుకున్నాడు. ఇక హైదరాబాద్‌కు చెందిన ప్రజ్ఞాన్ ఓఝా, స్రవంతి నాయుడు పురుషుల, మహిళల సెలెక్షన్ కమిటీల సభ్యులుగా ఎంపికయ్యారు.

రేసులో ఒక్కడే..

బోర్డు అధ్యక్షుడిగా మన్హాస్ ఒక్కడే నామినేషన్ వేయడంతో.. అతడి ఎన్నిక లాంఛనమే అయింది. 70 ఏళ్లు నిండిన రోజర్ బిన్నీ బోర్డు రాజ్యాంగం ప్రకారం అనర్హుడు కావడంతో.. అతడి వారసుడిగా మిథున్ బోర్డు పగ్గాలు అందుకోనున్నాడు. ఈ క్రమంలో బోర్డు చీఫ్‌గా సౌరవ్ గంగూలీ, బిన్నీ తర్వాత వరుసగా మూడో ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ కూడా మన్హాస్ కావడం విశేషం. 1997-98 నుంచి 2016-17 వరకు 20 ఏళ్లపాటు మన్హాస్ దేశవాళీ క్రికెట్ ఆడాడు. మిడిలార్డర్ బ్యాటర్, పార్ట్‌టైమ్ వికెట్ కీపర్‌గా ఢిల్లీ జట్టుకు సుదీర్ఘ కాలం సేవలందించాడు. 157 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 9,714 పరుగులు సాధించిన మన్హాస్.. 130 లిస్ట్‌-ఎ మ్యాచ్‌లు, 55 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడాడు. ఇక మౌలిక వసతుల కమిటీ సభ్యుడిగా ఆంధ్ర క్రికెట్ సంఘం కార్యదర్శి సానా సతీష్‌ను తీసుకున్నారు. ఈ కమిటీకి చైర్మన్‌గా ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ వ్యవహరించనున్నాడు.

సెలెక్షన్ కమిటీలో మార్పులు..

టీమిండియా మాజీ ఆటగాళ్లు ఆర్‌పీ సింగ్, ప్రజ్ఞాన్ ఓజాలకు సీనియర్ సెలెక్షన్ కమిటీలో చోటు దక్కింది. ఇప్పటి వరకు ఒక సభ్యుడిగా ఉన్న ఎస్. శరత్‌ను జూనియర్ సెలెక్షన్ కమిటీకి తిరిగి పంపారు. దీంతో అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీలో భారత మాజీ ఆటగాళ్లు శివ సుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్‌పీ సింగ్, ఓజా ఉన్నారు. మహిళల సెలెక్షన్ ప్యానెల్ చైర్మన్‌గా నీతూ డేవిడ్ స్థానంలో అమిత శర్మను ప్రకటించారు. కాగా 2005-2014 మధ్యకాలంలో భారత్‌కు ఆడిన హైదరాబాద్ ప్లేయర్ స్రవంతి నాయుడు కమిటీ సభ్యురాలిగా ఎంపికైంది. ఆమె ఒక టెస్టు, నాలుగు వన్డేలు, ఆరు టీ20ల్లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించింది. ఇక మహిళల ప్రీమియర్ లీగ్ కమిటీ తొలి స్వతంత్ర చైర్మన్‌గా కేరళ క్రికెట్ సంఘం అధ్యక్షుడు జయేష్ జార్జ్ ఎంపికయ్యాడు.

బీసీసీఐ ఆఫీసు బేరర్లు:
మిథున్ మన్హాస్ (అధ్యక్షుడు), రాజీవ్ శుక్లా (ఉపాధ్యక్షుడు), దేవజిత్ సైకియా (కార్యదర్శి), ప్రభ్‌జీత్ భాటియా (జాయింట్ సెక్రటరీ), రఘురామ్ భట్ (కోశాధికారి)

పురుషుల సెలెక్షన్ కమిటీ:
అజిత్ అగార్కర్ (చైర్మన్), శివ సుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్‌పీ సింగ్, ప్రజ్ఞాన్ ఓజా

మహిళల సెలెక్షన్ కమిటీ:
అమిత శర్మ (చైర్‌పర్సన్), శ్యామా డే, సులక్షణ నాయక్, జయ శర్మ, స్రవంతి నాయుడు

14 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడితే..
అదనంగా కోటి

దేశవాళీ క్రికెట్‌ను మరింతగా ప్రోత్సహించేందుకు బీసీసీఐ మరిన్ని చర్యలు తీసుకొంది. ఒక సీజన్‌లో 14 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడికి మ్యాచ్ ఫీజు కింద అదనంగా రూ. కోటి అందించనుంది. అంతేకాకుండా అండర్-19, అండర్-16 ఆటగాళ్లు ఐపీఎల్‌లో ఆడే అర్హత సాధించాలంటే.. కనీసం ఒక ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడాలనే నిబంధనను తీసుకువచ్చారు.



మనమ్మాయిలు వచ్చేశారు!

● రేపు ప్రారంభ మ్యాచ్..మహిళల వన్డే వరల్డ్ కప్

గువాహటి : వన్డే ప్రపంచ కప్ ఆరంభ మ్యాచ్‌లో తలపడేందుకు భారత, శ్రీలంక మహిళల జట్లు ఆదివారం ఇక్కడకు చేరుకున్నాయి. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న మెగా టోర్నీ ఈనెల 30న ప్రారంభం కానుంది. బెంగళూరులో వామప్ మ్యాచ్‌లు ముగించుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్ సేన సాయంత్రం విచ్చేసింది. తొలి వామప్ మ్యాచ్‌లో భారత జట్టు 153 పరుగుల తేడాతో ఐదుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. అయితే వెంటనే పుంజుకున్న హర్మన్ సేన శనివారం న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వామప్ పోటీలో నాలుగు వికెట్ల తేడాతో నెగ్గిన సంగతి తెలిసిందే. ఇక..చమరి ఆటపట్టు సారథ్యంలోని శ్రీలంక మధ్యాహ్నం ఇక్కడ అడుగుపెట్టింది. సోమవారం మధ్యాహ్నం ఆ జట్టు సాధనలో పాల్గొననుంది. భారత జట్టు సాయంత్రం సాధన చేయనుంది. మూడో ప్రపంచ కప్‌లో ఆడుతున్న ఆటపట్టు తన కెప్టెన్సీలో జట్టుకు టైటిల్ అందించాలని పట్టుదలగా ఉంది. అయితే ప్రస్తుత జట్టులోని 15 మందిలో 11 మంది క్రికెటర్లు తొలిసారి ప్రపంచ కప్ బరిలో దిగుతున్నారు.

సూర్య చరిష్మాకు టైటిల్

ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్

రాజమహేంద్రవరం అర్బన్ (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సూర్య చరిష్మా ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ మహిళల టైటిల్‌ను కైవసం చేసుకుంది. రాజమహేంద్రవరంలో ఆదివారం ముగిసిన ఈ పోటీల్లో సూర్య చరిష్మా హరియాణాకు చెందిన జియా రావత్‌పై నెగ్గింది.



ఇక పురుషుల సింగిల్స్‌లో హరియాణాకు చెందిన భరత్ రాఘవ్ తమ రాష్ట్రానికే చెందిన రవిపై విజయం సాధించి టైటిల్ గెల్చాడు. విజేతలకు శాప్ చైర్మన్ రవినాయుడు బహుమతులు అందజేశారు.

అనుష్క 'డబుల్'

● రెండో స్వర్ణం కొల్లగొట్టిన భారత షూటర్

● అడ్రియన్‌కు రజతం ● జూ. వరల్డ్ కప్ షూటింగ్




అనుష్క

న్యూఢిల్లీ : వర్ధమాన షూటర్ అనుష్క థోకర్ ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచ కప్‌లో అదరగొడుతోంది. టోర్నమెంట్ ఆమె రెండో స్వర్ణ పతకం చేజిక్కించుకుని భళా అనిపించింది. మహిళల 50మీ. రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో అనుష్క టైటిల్ దక్కించుకుంది. ఇదే కేటగిరీ పురుషుల విభాగంలో అడ్రియన్ కర్మాకర్ రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఈ రెండింటితో కలిపి టోర్నీలో ఇప్పటి వరకు భారత్ సాధించిన పతకాల సంఖ్య 13కి చేరింది. ఇందులో నాలుగు స్వర్ణాలు, ఆరు రజతాలు, మూడు కాంస్యాలున్నాయి. ఆదివారం ఇక్కడ జరిగిన మహిళల 50మీ. రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్లో 18 ఏళ్ల అనుష్క 461 పాయింట్లతో పసిడి పతకం అందుకుంది. టోర్నమెంట్‌లో ఇంతకుముందు అనుష్క మహిళల 50మీ. రైఫిల్ ప్రోన్‌లో బంగారు పతకం నెగ్గిన సంగతి తెలిసిందే. దాంతో ఆమె ఖాతాలో రెండో స్వర్ణం చేరింది. న్యూట్రల్ అథ్లెట్లు అనస్టాసిలా సోరోనిక (454.9) రజతం, మారియా క్రుగ్లోవా (444) కాంస్య పతకం చేజిక్కించుకున్నారు. పురుషుల 50 మీ. త్రీపీ విభాగంలో ఐదుగురు భారత షూటర్లు సహా మొత్తం 12 మంది తలపడ్డారు. అడ్రియన్ కర్మాకర్ 454.8 పాయింట్ల స్కోరుతో రజత పతకం సాధించాడు. న్యూట్రల్ అథ్లెట్లు డిమిత్రి పిమెనోవ్ (459.9) స్వర్ణం, కమిల్ నురియా ఖెమ్మోవ్ (441) కాంస్య పతకం గెలుపొందారు.

రుజ్జి వరల్డ్ రికార్డ్

● పురుషుల షాట్‌పుట్‌లో ఆరో స్వర్ణం

● వరల్డ్ పారా అథ్లెటిక్స్

న్యూఢిల్లీ : బల్గేరియాకు చెందిన రుజ్జి పురుషుల షాట్‌పుట్ ఎఫ్55 విభాగంలో వరుసగా ఆరోసారి స్వర్ణ పతకం దక్కించుకున్నాడు. ఈ క్రమంలో అతడు కొత్త ప్రపంచ రికార్డు సైతం నెలకొల్పాడు. ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో భాగంగా ఆదివారం జరిగిన పురుషుల షాట్‌పుట్ ఎఫ్55 విభాగం ఫైనల్లో 34 ఏళ్ల రుజ్జి 12.94 మీ. గుండును విసిరి కొత్త ప్రపంచ రికార్డ్‌తో పసిడి పతకం అందుకున్నాడు. దాంతో 2023 పారిస్ వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో తానే నెలకొల్పిన 12.68 మీ. గత ప్రపంచ రికార్డును బల్గేరియన్ బద్దలుగొట్టాడు. సెర్బియాకు చెందిన నెబోజెసా డ్యూరిచ్ (12.52మీ.) రజతం, లెచ్ స్టోల్ట్‌మన్ (పోలెండ్, 12.02మీ.) కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. ఇక..రెండో రోజు పోటీలలో రుజ్జితో కలిపి మూడు ప్రపంచ రికార్డులు కొత్తగా నమోదయ్యాయి. మలేసియాకు చెందిన అబ్దుల్ లతీఫ్ పురుషుల లాంగ్‌జంప్ టీ20 విభాగంలో 7.67 మీ. నయా వరల్డ్ రికార్డ్‌తో పసిడి పతకం చేజిక్కించుకున్నాడు. వ్లోదిమిర్ పోనోమరెంకో (ఉక్రెయిన్) పురుషుల షాట్‌పుట్ టీ12లో 17.39 మీ. దూరం గుండును విసిరి కొత్త ప్రపంచ రికార్డ్‌తో విజేతగా నిలిచాడు. మహిళల డిస్కస్ త్రో ఎఫ్57 విభాగంలో నసీమా (అల్జీరియా) 34.54మీ. దూరంతో స్వర్ణం కైవసం చేసుకుంది. మహిళల ఐదు వేల మీటర్ల టీ54 పరుగులో డెబ్రూనర్ (స్విట్జర్లాండ్) పసిడి పతకం సాధించింది. పురుషుల ఐదు వేల మీ.టీ54 రేస్‌లో హనాక్ (బ్రిటన్) స్వర్ణం గెలుపొందాడు.

భారత్‌కు నిరాశ..

రెండో రోజు పోటీలలో భారత అథ్లెట్లు పూర్తిగా నిరాశ పరిచారు. పురుషుల లాంగ్‌జంప్ టీ47లో వికాస్, అజయ్ సింగ్, పురుషుల జావెలిన్ ఎఫ్37లో ప్రవీణ్ కుమార్, హేమ్‌చంద్ర, పురుషుల 100మీ. టీ37లో రాకేష్, శ్రేయాన్ష్ పూర్తిగా విఫలమయ్యారు.


రుజ్జి

ప్రపంచ కప్ ఆరంభోత్సవంలో
గర్గ్‌కు సంగీత నివాళి

గువాహటి: ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్ ఆరంభోత్సవంలో.. ఇటీవలే మరణించిన అస్సోం ప్రముఖ సింగర్ జుబీన్ గర్గ్‌కు సంగీత నివాళులర్పించనున్నారు. అస్సోం క్రికెట్ సంఘం (ఏసీఏ) స్టేడియంలో మంగళవారం భారత్, శ్రీలంక మధ్య మెగా టోర్నీ ఆరంభ మ్యాచ్ జరగనుంది. ఈ సందర్భంగా జుబిన్ అభిమానుల కోసం ఐదువేల టిక్కెట్లను ఉచితంగా అందించనున్నట్టు ఏసీఏ అధికారి ఒకరు తెలిపారు. ఈ నెల 19న సింగపూర్‌లో సముద్రంలో ఈత కొడుతుండగా గర్గ్ మరణించాడు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

సోమవారం | 29-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 165 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి సా.4.32 తదుపరి అష్టమి; నక్షత్రం: మూల పూర్తి; వర్జ్యం: ఉ.12.42-2.28, తె.4.32-6.18; దుర్ముహూర్తం: ఉ.12.29-1.16, మ.2.51-3.39; అమృతఘడియలు: రా.11.15-1.01; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.02 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గ్రూప్-2 ఫలితాలు విడుదల

పురుషుల్లో టాపర్ హర్షవర్ధన్.. మహిళల్లో వినీషా రెడ్డి

10

783 పోస్టులకుగాను 782 మంది ఎంపిక

గ్రూప్-1లో డిప్యూటీ కలెక్టర్లుగా ఎంపికైన 45 మందికి పోస్టింగులు

న్యూయార్క్‌ను మరిపించేలా..

ఫ్యూచర్ సిటీ నిర్మాణం.. ప్రపంచం అబ్బురపడేలా చేస్తాం

- విదేశాల గురించి ఇంకెన్నాళ్లు మాట్లాడుకుందాం?
- బయటి దేశాలవారు గొప్పగా చెప్పుకొనేలా చేస్తా
- పదేళ్లలో ఫార్చ్యూన్ కంపెనీలన్నీ ఫ్యూచర్ సిటీలోనే
- రైతులకు అభ్యంతరాలుంటే మాట్లాడుకుందాం
- రియల్ ఎస్టేట్ కోసమే అంటూ నాపై విమర్శలు
- పార్టీల ఉచ్చులో పడి కోర్టులకెళ్లి నష్టపోవద్దు
- ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతికి బుల్లెట్ రైలు
- అండర్ గ్రౌండ్ విద్యుత్తు లైన్: సీఎం రేవంత్‌రెడ్డి
- ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి శంకుస్థాపన
- మూసీ పునరుజ్జీవానికి సహకరించాలి
- పేదలకు అన్యాయం జరిగే పని ఏదీ చేయను
- ఎన్ కన్వెన్షన్‌పై నాగార్జునకు ముందు చెప్పాం.. తర్వాత ఆయనే సహకరించారు
- బతుకమ్మకుంటకు వీహెచ్ పేరు: సీఎం రేవంత్
- అంబర్‌పేటలో బతుకమ్మ కుంట ప్రారంభోత్సవం



మీర్‌ఖాన్‌పేటలో భారత్ ఫ్యూచర్ సిటీకి శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్/ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచం అబ్బురపడేలా నిర్మిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. న్యూయార్క్‌ను మరిపించే నగరాన్ని కడతామన్నారు. దుబాయి, న్యూయార్క్, టోక్యో, సింగపూర్ వంటి ప్రాంతాలకు వెళ్లివచ్చి అద్భుతంగా ఉన్నాయంటూ ఇంకెన్నాళ్లు గొప్పగా చెప్పుకొంటామని ప్రశ్నించారు. మన ప్రాంతం గురించి బయటి దేశాలవారు గొప్పగా చెప్పుకొనేలా చేయాలన్నదే తన సంకల్పమని ప్రకటించారు. అందుకే భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించాలని, ప్రపంచమంతా దీనివైపే చూసేలా చేయాలని తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రానున్న పదేళ్లలో ప్రపంచంలో ఉండే ఫార్చ్యూన్ 500 కంపెనీలు ఈ సిటీలో ఉండాలన్నదే లక్ష్యమని చెప్పారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి, గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్-1 నిర్మాణాలకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా

మిగతా 11వ పేజీలో...

నేడే స్థానిక షెడ్యూల్?

స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధం!

అన్ని ఏర్పాట్లుచేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో స్థానిక సంస్థల సమరానికి రంగం సిద్ధమైంది. ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం కోరిన నేపథ్యంలో సోమవారం షెడ్యూల్ విడుదల చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) అన్ని ఏర్పాట్లు చేసుకుంది. ఇందుకనుగుణంగానే ఎన్నికల కమిషనర్ ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమావేశమై ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సిద్ధం చేసిన స్థానిక సంస్థల రిజర్వేషన్ల నివేదికలను ఆ శాఖ ఇప్పటికే ఎస్ఈసీకి అందజేసింది. అదే సమయంలో ఈ నెల 30లోపు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలని ఎస్ఈసీని తెలంగాణ ప్రభుత్వం కోరింది. అయితే 30న సద్దుల బతుకమ్మ సందర్భంగా సెలవు ఉండటంతో.. ఎన్నికల షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేయాలని ఎస్ఈసీ నిర్ణయించినట్లు సమాచారం. ఎన్నికల నిర్వహణకుగాను ఇప్పటికే ఎక్సైజ్, పోలీస్, పంచాయతీరాజ్ శాఖల ద్వారా ఎస్ఈసీ నివేదికలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఆ తర్వాత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఇందుకు అనుగుణంగానే

మిగతా 11వ పేజీలో...

గ్యాస్ సిలిండర్‌కూ పోర్టబులిటీ!

» అభిప్రాయ సేకరణ చేస్తున్న పీఎన్‌జీఆర్‌బీ




న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: మీ వంట గ్యాస్ సిలిండర్ ఇచ్చే కంపెనీతో/ఏజెంట్‌తో ఇబ్బందులున్నాయా? అయితే, వారిని వెంటనే మార్చేసుకోండి. మొబైల్ నంబరును ఇష్టమొచ్చిన సర్వీస్ ప్రొవైడర్‌కు ఎలా మార్చుకోవచ్చో అలాగే ఇకపై గ్యాస్ ఏజెన్సీని కూడా మార్చేసుకోవచ్చు. ఈ సేవలు త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. గ్యాస్ ఏజెన్సీలను మార్చుకునేందుకు మొబైల్ పోర్టబులిటీ తరహా సేవలను త్వరలో అందుబాటులోకి తేనున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించి వినియోగదారులు, భాగస్వామ్య పక్షాల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు పెట్రోలియం మరియు సహజ వాయువు నియంత్రణ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ) వెల్లడించింది. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం 2013లోనే పైలట్ ప్రాజెక్టు కింద 24 జిల్లాలో పోర్టబులిటీ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఆ తర్వాత 2014లో 13 రాష్ట్రాల్లోని 480 జిల్లాల్లో ఈ పైలట్ ప్రాజెక్టును విస్తరించింది. ఆ పైలట్ ప్రాజెక్టులో కూడా గ్యాస్ ఏజెన్సీలను మార్చుకోగలరు కానీ, కంపెనీలను మార్చుకునే అవకాశం ఇవ్వలేదు. కానీ, ఇకపై ఏజెన్సీలతో పాటు కంపెనీలను కూడా మార్చుకునేలా ఇంటర్ పోర్టబులిటీ సేవలను అందుబాటులోకి తేవాలని పీఎన్‌జీఆర్‌బీ నిర్ణయించింది. ఈ మేరకు భాగస్వామ్య పక్షాలు, వినియోగదారుల నుంచి అభిప్రాయ సేకరణను మొదలుపెట్టింది. ఆ తర్వాత నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించి దేశ వ్యాప్తంగా ఎల్‌పీజీ పోర్టబులిటీ సేవల అమలుకు ఒక తేదీని నిర్ణయిస్తామని వెల్లడించింది.

రేబిస్‌కు ప్రతి 9 నిమిషాలకొకరు బలి




న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: రేబిస్ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా ప్రతి తొమ్మిది నిమిషాలకు ఒకరిని బలిగొంటోందని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. అత్యవసరంగా వ్యాక్సినేషన్, అవగాహన చేపట్టాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. ప్రపంచవ్యాప్త మరణాల్లో మూడో వంతు భారతదేశంలోనే జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. దేశంలో వీధికుక్కల సంఖ్య కోట్లలో ఉండటమే దీనికి కారణం. రేబిస్ సంక్రమణను అడ్డుకునేందుకు కుక్కలకు సామూహికంగా వ్యాక్సినేషన్, పీఈపీ(పోస్ట్-ఎక్స్‌పోజర్ ప్రొఫైలాక్సిస్) సకాలంలో అందడం కీలకమని ప్రపంచ రేబిస్ దినోత్సవం(సెప్టెంబరు 28) సందర్భంగా డబ్ల్యూహెచ్‌వో పునరుద్ఘాటించింది. ఐడీఎస్‌పీ(ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్) కింద పార్లమెంటుకు సమర్పించిన సమాచారం మేరకు 2024 సంవత్సరంలో భారతదేశంలో 37 లక్షల కుక్క కాటు కేసులు, 54 అనుమానిత రేబిస్ మరణాలు సంభవించాయి. ఇక 2023లో 286 రేబిస్ సంబంధిత మరణాలు సంభవించాయని డీఏహెచ్‌డీ(పశు సంవర్థక, డెయిరీ విభాగం) నివేదించింది. కాగా, 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా రేబిస్‌ను అంతమొందించాలనే లక్ష్యానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేడీ నడ్డా 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఎన్ఆర్‌సీపీ(జాతీయ రేబిస్ నియంత్రణ కార్యక్రమం) ద్వారా ప్రభుత్వం ప్రజల్లో అవగాహనను పెంపొందిస్తోందని, వ్యాక్సిన్ అందుబాటులో ఉండేలా చూస్తోందని పేర్కొన్నారు. కాగా, వ్యాక్సినేషన్ 70% సాధిస్తే.. రేబిస్ వ్యాప్తికి అడ్డుకట్ట వేయొచ్చని పలు దేశాల్లో నిరూపితమైంది.

లోకం తీరు



నక్సలైట్లపై కాల్పులు విరమించం

» వారి ప్రతిపాదనను అంగీకరించేది లేదు: అమిత్ షా



న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నామంటూ మావోయిస్టులు చేసిన ప్రతిపాదనను అంగీకరించేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఒకవేళ వారు లొంగిపోయి, ఆయుధాలను అప్పగిస్తామంటే మాత్రం స్వాగతిస్తామని తెలిపారు. అలాంటప్పుడు భద్రతా బలగాలు వారిపై ఒక్క తూటాను కూడా పేల్చవని తెలిపారు. కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నామని దాదాపు పక్షం రోజుల క్రితం నక్సలైట్లు చేసిన ప్రకటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. నక్సల్ ముక్త్ భారత్‌పై ఆదివారం ఇక్కడ జరిగిన సదస్సు ముగింపు కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగిస్తూ "ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి ఇటీవల నక్సలైట్లు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంతవరకు జరిగిందంతా పొరపాటని అందులో పేర్కొన్నారు. కాల్పుల విరమణ ప్రకటించాలని, తామంతా లొంగిపోతామని చెప్పారు. నేనేమి చెబుతున్నానంటే కాల్పుల విరమణ ఉండబోదు. ఒక వేళ వారు లొంగిపోతే కాల్పుల అవసరమే రాదు. ఆయుధాలు అప్పగిస్తే ఒక్క తూటాను కూడా పేల్చం" అని విస్పష్టంగా చెప్పారు. నక్సలైట్లు లొంగిపోతే వారికి ఎర్ర తివాచీ పరుస్తామని, ఆకర్షణీయమైన పునరావాస పథకాన్ని కూడా అమలు చేస్తామని ప్రకటించారు. నక్సలైట్ల కాల్పుల విరమణ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. 2026 మార్చి 31నాటికి దేశం నక్సలిజం నుంచి విముక్తి పొందుతుందని పునరుద్ఘాటించారు.

లద్దాఖ్ ప్రజలపై బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ దాడి

» భయపెట్టే ధోరణి మానుకోవాలి: రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: లద్దాఖ్‌లో చోటుచేసుకున్న ఘటనలపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. లద్దాఖ్ ప్రజలపై, వారి సంస్కృతీ సంప్రదాయాలపై బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ దాడి చేస్తున్నాయని ఆరోపించారు. "లద్దాఖ్ ప్రజలు తమ గొంతు వినిపించాలనుకున్నారు. సమాధానం ఆశించారు. కానీ, ఇందుకు సమాధానంగా బీజేపీ నలుగురు వ్యక్తులను చంపి, ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్‌ను జైల్లో పెట్టింది" అని 'ఎక్స్'లో రాహుల్ పేర్కొన్నారు. ఈ హింసను వెంటనే ఆపాలని, భయపెట్టే ధోరణిని మానుకోవాలని డిమాండ్ చేశారు. లద్దాఖ్‌కు తమ వాణి వినిపించే అవకాశం ఇవ్వాలని, ఆ ప్రాంతాన్ని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని అన్నారు. కాగా, లేహ్‌లో ఆదివారం ఐదో రోజు కూడా కర్ఫ్యూ కొనసాగింది. అయితే పౌరుల రోజువారీ పనుల కోసం 4 గంటలపాటు సడలించారు.

సైబర్ మోసగాళ్ల ఉచ్చులో ఐఐఎస్‌సీ శాస్త్రవేత్త

» రూ.8.8 లక్షలు కాజేసిన నేరగాళ్లు

బెంగళూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐఎస్‌సీ) శాస్త్రవేత్త డాక్టర్ సంధ్య నుంచి సైబర్ నేరగాళ్లు రూ.8.8 లక్షలు కాజేశారని బెంగళూరు సెంట్రల్ డివిజన్ సీఈఎన్ పోలీసులు తెలిపారు. ఆదివారం వారు ఈ కేసు వివరాలను మీడియాకు తెలిపారు. వారి కథనం మేరకు.. ఈనెల 16న సంధ్యకు ఓ గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. మీ మొబైల్ నంబరు పలుచోట్ల ఉపయోగిస్తున్నారని తెలిపాడు. ఆ తర్వాత కాసేపటికి దుండగులు మరో ఫోన్ నంబరు నుంచి కాల్ చేసి మీ పేరిట 17 కేసులు ఉన్నాయని మెసేజ్ చేశారు. వీటికి సంబంధించి ఓ పోలీసు ఆఫీసర్ మాట్లాడతారని మెసేజ్ చేశారు. కాసేపటికే మరొకరు ఫోన్ చేసి 'మీరు మహిళల రవాణాలో భాగస్వామ్యులయ్యారని, సుప్రీంకోర్టుకు సంబంధించి పలు కేసులను చూపి మిమ్మల్ని సీబీఐ అధికారులు అరెస్టు చేస్తారని బెదిరించారు. భయపడిన సంధ్య తనపై ఎలాంటి కేసులు లేవనీ, తననెందుకు అరెస్టు చేస్తానని ప్రశ్నించారు. అయినా ఈ కేసు నుంచి బయటపడాలంటే ఏం చేయాలని ఆమె అడగడంతో, తాము చెప్పిన బ్యాంకు ఖాతాకు నగదు జమ చేయాలని వారు సూచించారు. ఇలా రూ.8.80 లక్షలను జమ చేయించుకున్నారు.

అమెరికాలో కాల్పులు.. ముగ్గురి మృతి

సౌత్‌పోర్ట్, సెప్టెంబరు 28: అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం రేపాయి. నార్త్ కరోలినాలోని ఓ బార్ వద్ద శనివారం రాత్రి జరిగిన కాల్పుల ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, ఎనిమిది మంది గాయపడ్డారు. సౌత్‌పోర్టులోని వాటర్‌ఫ్రంట్ బార్ వద్దకు ఓ బోటు వచ్చింది. అందులోని వ్యక్తి ఒక్కసారిగా బార్‌పైకి కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ముగ్గురు మరణించగా, పలువురు గాయపడ్డారు. కాల్పుల అనంతరం నిందితుడు అదే బోటులో పారిపోయినట్లు అధికారులు తెలిపారు. సమీపంలోని ఓ ఐలాండ్ వద్ద నిందితుడిగా అనుమానిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. .

కల్లోల కరూర్..!

తొక్కిసలాటలో 40కి పెరిగిన మృతులు..ఆస్పత్రిలో 50 మందికి చికిత్స

» బాధితులకు సీఎం స్టాలిన్ పరామర్శ

» 2 లక్షల పరిహారం ప్రకటించిన మోదీ

» మృతుల కుటుంబాలకు 20 లక్షల చొప్పున అందజేస్తానన్న విజయ్



కరూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలు

చెన్నై, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): చెల్లాచెదురుగా పడి ఉన్న చెప్పులు.. చిరిగిన పార్టీ జెండాలు.. విరిగిన స్తంభాలు.. నలిగిపోయిన మంచినీటి బాటిళ్లు.. తమిళనాట కరూర్‌లోని వేలుచ్చామిపురం ప్రాంతంలో ఆదివారం నెలకొన్న పరిస్థితి ఇది. సినీనటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ పర్యటన సందర్భంగా శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో మృతుల సంఖ్య 40కి పెరిగింది. కరూర్ ప్రభుత్వాస్పత్రి అత్యవసర చికిత్సా విభాగంలో చికిత్స పొందుతున్న కవిన్(31) ఆదివారం మధ్యాహ్నం మృతిచెందినట్లు అధికారులు ప్రకటించారు. మరో 50మంది వరకూ క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈ దుర్ఘటనలో మృతుల కుటుంబాలను కలుసుకుని ఓదార్చేందుకు, గాయపడినవారిని పరామర్శించేందుకు అనుమతించాలంటూ పోలీసులను విజయ్ కోరారు. ఈ ఘటన సమాచారం తెలియగానే సీఎం స్టాలిన్ శనివారం రాత్రి 11 గంటలకు సచివాలయానికి వెళ్లి అధికారులతో సమీక్షించారు. ఆదివారం వేకువజాము కరూర్ ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. పోస్టుమార్టం విభాగం వద్ద మృతులకు నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను ఓదార్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సీఎం పరామర్శించారు. కాగా, మృతులకు నివాళులర్పిస్తూ కరూర్‌లో వ్యాపారులు ఆదివారం స్వచ్ఛందంగా బంద్ పాటించారు.

నివేదిక కోరిన అమిత్‌షా

కరూర్ దుర్ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దీనికి సంబంధించిన సమగ్ర నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వు జారీ చేశారు. సభ కోసం స్థలం ఎంపిక, పోలీసులు కల్పించిన భద్రతా ఏర్పాట్లు, టీవీకే పార్టీకి విధించిన నిబంధనలు, తొక్కిసలాట జరగటానికి గల కారణాలు తదివివరాలతో సమగ్రమైన నివేదికను పంపాలని గవర్నర్ ఆర్ఎన్ రవి కూడా ప్రభుత్వాన్ని ఆదేశించారు.

ఎలా ఓదార్చాలో తెలియడం లేదు: విజయ్

కరూర్ పర్యటన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మృతి చెందినవారి కుటుంబ సభ్యులకు రూ.20లక్షలు, గాయపడినవారికి రూ.2లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు విజయ్ ప్రకటించారు. ఈ ప్రమాదం తనకు తీవ్ర దిగ్భ్రాంతిని, మనోవేదనను కలిగించిందని పేర్కొన్నారు. ఆత్మీయులను కోల్పోయి బాధపడుతున్నవారిని తలచుకుని తీవ్రంగా ఆవేదన చెందుతున్నానని, వారిని ఎలా ఓదార్చాలో తెలియక కన్నీటి పర్యంతమవుతున్నానని తెలిపారు. ఈ దుర్ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి ప్రకటించిన ప్రధాని మోదీ.. బాధిత కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున సాయం అందించనున్నట్లు ప్రకటించారు. ఇక తమిళనాడు కాంగ్రెస్ పార్టీ కూడా మృతుల కుటుంబీకులకు, క్షతగాత్రులకు కలిపి మొత్తం రూ.కోటి సాయం ప్రకటించింది.

రాజకీయాలు వద్దు: సీఎం స్టాలిన్

కరూర్ దుర్ఘటనపై రాజకీయపరమైన వ్యాఖ్యలు చేయదలచుకోలేదని, బాధితులను కాపాడటం, మృతుల కుటుంబాలను ఓదార్చి, వారిని అన్ని విధాలా ఆదుకోవడమే తన కర్తవ్యంగా భావిస్తున్నానని సీఎం స్టాలిన్ అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదనే విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా చెన్నై నీలాంగరైలోని టీవీకే నేత విజయ్ నివాసగృహాన్ని ఆదివారం ఉదయం డీఎంకే విద్యార్థి విభాగం కార్యకర్తలు ముట్టడించేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా 50మంది కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, కరూర్‌లో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదని, తగిన భద్రత కల్పించలేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు.

సీబీఐ విచారణకు ఆదేశించండి: టీవీకే పిటిషన్

కరూర్ దుర్ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించాలని టీవీకే కోరింది. చెన్నైలోని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ దండపాణి నివాసగృహానికి వెళ్లిన ఆ పార్టీ డిప్యూటీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశారు. విజయ్ పర్యటన సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నాయని, పోలీసులు తగినంత భద్రత కల్పించలేదని అందులో ఆరోపించారు. ఆ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి.. సోమవారం మధ్యాహ్నం హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో విచారణ జరిపేందుకు అంగీకరించారని నిర్మల్‌కుమార్ తెలిపారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కేంద్ర పరిశీలకులు!

» బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో జరగనున్న ఉప ఎన్నికలపై ఈసీ దృష్టి

» ఎన్నికల పరిశీలనకు 470 మంది అధికారులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికపై కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) దృష్టి సారించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో ఖాళీ అయిన ఈ స్థానానికి ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ కసరత్తు చేస్తోంది. బిహార్‌తో పాటు జూబ్లీహిల్స్ ఖాళీగా ఉన్న మరికొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరగనున్న ఎన్నికలకు కేంద్ర పరిశీలకులను నియమిస్తున్నట్లు ఈసీ ఆదివారం ప్రకటించింది. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకే పరిశీలకులను నియమిస్తున్నట్లు వెల్లడించింది. బిహార్ శాసనసభ ఎన్నికలు; మరికొన్ని రాష్ట్రాల్లోని 7 అసెంబ్లీ స్థానాలతో పాటు జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికలను పర్యవేక్షించేందుకు దేశవ్యాప్తంగా వివిధ సర్వీసులకు చెందిన 470 మంది సీనియర్ అధికారులను నియమిస్తున్నట్లు తెలిపింది. వీరు ప్రధానంగా అభ్యర్థులు చేసే ఎన్నికల ఖర్చుపై ప్రత్యేక నిఘా పెడతారు. బిహార్ ఎన్నికలతోపాటు జూబ్లీహిల్స్; జమ్మూకశ్మీరులోని బుద్గాం, నౌగ్రోటా; రాజస్థాన్‌లోని అంటా; ఝార్ఖండ్‌లోని ఘాట్‌శిల; పంజాబ్‌లోని తరన్ తారన్; మిజోరంలోని దంప; ఒడిసాలోని నువాపడ నియోజకవర్గాల్లో జరిగే ఉప ఎన్నికల్లో ఈ పరిశీలకులు విధులు నిర్వహిస్తారని ఈసీ వెల్లడించింది. ఇదిలా ఉండగా, బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ ప్రత్యేక వ్యూహం రచిస్తోంది. 'మిషన్ బిహార్ విజయం' కోసం కొందరు కేంద్ర మంత్రులతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన 45 మంది ఎంపీలు, సీనియర్ నేతలను నియమించింది. రాష్ట్రంలోని 40 లోక్‌సభ స్థానాల్లో ఒక్కో సీటును వారికి అప్పగించారు. ప్రతి నాయకుడు ఆరేసి అసెంబ్లీ సెగ్మెంట్లను పర్యవేక్షిస్తారు.

భారత్‌ను సరిదిద్దాల్సిన అవసరం ఉంది

» అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: భారత్‌ను లక్ష్యంగా చేసుకొని అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ మరోసారి రెచ్చిపోయారు. భారత్‌ను సరిదిద్దాల్సిన అవసరం ఉందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తమ దేశ కంపెనీలకు భారతదేశం తన మార్కెట్లను తెరవాలని, అమెరికా ప్రయోజనాలకు భంగం కలిగించని విధంగా చర్యలు తీసుకోవాలని ఆదివారం ఆయన ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. స్విట్జర్లాండ్, బ్రెజిల్, భారత్ సహా అమెరికా వాణిజ్య భాగస్వాములైన కొన్ని దేశాలను సరిదిద్దాల్సి ఉందన్నారు. "ఇవన్నీ అమెరికా విషయంలో సరిగ్గా స్పందించాల్సి దేశాలు. మీ మార్కెట్లను తెరవండి. అమెరికా ప్రయోజనాలకు భంగం కలిగించే విధానాలు వెంటనే ఆపేయండి.ఇలాంటి వాటివల్లే మేము వారితో విభేదిస్తున్నాం"అని హోవార్డ్ తెలిపారు. అమెరికా వినియోగదారులకు భారత్ తన ఉత్పత్తులను విక్రయించాలని భావిస్తే అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయానికి అనుగుణంగా నడుచుకోవాలని తేల్చిచెప్పారు.

ట్రంప్‌కు పెట్టె చూపి.. బుట్టలోకి..!

» అమెరికా పెట్టుబడులకు పాక్ వ్యూహం

» గిఫ్ట్‌గా అరుదైన ఖనిజాల పెట్టె

వాషింగ్టన్, సెప్టెంబరు 28: అమెరికా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు వాషింగ్టన్‌తో ఇస్లామాబాద్ సంబంధాలను బలోపేతం చేసుకునే దిశగా పాకిస్థాన్ నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను శ్వేత సౌధంలో కలిసిన పాక్ ప్రధాని షరీఫ్, ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్.. అరుదైన ఖనిజాలతో కూడిన ఓ చెక్క పెట్టెను ఆయనకు బహూకరించారు. ఆ పెట్టెలోని ఖనిజాలను చూపుతూ ఆసిం మునీర్ వివరిస్తుండగా.. ట్రంప్ ఆసక్తిగా తిలకించారు. దీనికి సంబంధించిన ఫొటోను తాజాగా విడుదల చేసిన శ్వేత సౌధం.. ఇది రెండు దేశాల మధ్య సానుకూల పరిణామంగా అభివర్ణించింది. అయితే కొద్దిరోజుల ముందే పాక్‌లో అరుదైన ఖనిజాల వెలికితీతకు అమెరికాకు చెందిన ఓ కంపెనీ 500 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టిందుకు ఎంఓయూ కుదుర్చుకుంది.

ఇరాన్‌పై మళ్లీ 'స్నాప్‌బ్యాక్' ఆంక్షలు

దుబాయ్, సెప్టెంబరు 28: వివిధ రకాల ఆంక్షలు, అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో ఇప్పటికే కుదేలైన ఇరాన్‌పై ఐక్యరాజ్యసమితి మరోసారి ఆంక్షలు విధించింది. ఇరాన్ అణ్వాయుధాల తయారీకి వీలయ్యే స్థాయిలో యురేనియం శుద్ధి చేపడుతోందన్న కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది. దాని ప్రకారం విదేశాల్లోని ఇరాన్ ఆస్తులన్నీ ఫ్రీజ్ అవుతాయి. ఆ దేశంతో అన్ని రకాల ఆయుధ ఒప్పందాలు నిలిచిపోతాయి. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి అభివృద్ధి కార్యక్రమాన్ని ఆపేయాల్సి ఉంటుంది. లేకుంటే మరిన్ని ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇరాన్‌పై స్నాప్‌బ్యాక్ ఆంక్షల విధింపు కోసం ఫ్రాన్స్, జర్మనీ, యూకే సుమారు నెల రోజుల కిందే ఐక్యరాజ్యసమితిలో ప్రతిపాదన తెచ్చాయి. దానిపై తాజా సమావేశాల్లో విస్తృతంగా చర్చ జరిగింది. తమపై ఆంక్షల విధింపును ఇరాన్ తీవ్రంగా వ్యతిరేకించింది.

అవినీతి కేసులో చైనా మాజీ మంత్రికి మరణశిక్ష

» నిందితుడు నేరాన్ని ఒప్పుకోవడంతో రెండేళ్ల పాటు శిక్ష నిలిపివేత



బీజింగ్, సెప్టెంబరు 28: భారీ మొత్తంలో లంచాలు స్వీకరించిన కేసులో చైనా వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మాజీ మంత్రి టాంగ్ రెంజియన్‌కు ఆ దేశ కోర్టు ఆదివారం మరణశిక్ష విధించింది. కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా కూడా పనిచేసిన టాంగ్ 2007 నుంచి 2024 వరకు కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో నిర్వర్తించిన వివిధ పదవులను ఉపయోగించుకుని వ్యాపారాలు, ప్రాజెక్టు కాంట్రాక్టులు, ఉద్యోగ బదిలీలు వంటి విషయాల్లో ఇతరులకు సహకరించి, బదులుగా సుమారు రూ.334 కోట్ల విలువైన నగదు, ఆభరణాలు స్వీకరించారని కోర్టు తెలిపింది. టాంగ్ చేసిన నేరాలు దేశం, ప్రజల ప్రయోజనాలకు తీవ్రమైన నష్టం కలిగించాయని, అందువల్ల ఆయన మరణశిక్షకు అర్హుడని తీర్పులో పేర్కొంది. అయితే టాంగ్ తన నేరాలను అంగీకరించడంతో రెండేళ్ల పాటు శిక్షను నిలిపివేస్తూ ఉపశమనం కల్పించింది. 2012లో షీ జిన్‌పింగ్ చైనా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత చేపట్టిన ఇప్పటివరకు సుమారు 10 లక్షలకు పైగా అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

'స్వదేశీ'కి దన్ను!

2న ప్రతి ఒక్కరూ 'ఖాదీ' కొనండి: మోదీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: అమెరికా సుంకాల వేళ.. స్వదేశీ ఉత్పత్తులే కొనాలని ప్రధాని మోదీ మరోసారి దేశ ప్రజలకు పిలుపిచ్చారు. గాంధీ జయంతి (అక్టోబరు 2) నాడు ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేయాలని కోరారు. ఇవి దేశీయ ఉత్పత్తులని సగర్వంగా చెబుతూ.. సోషల్ మీడియాలో పోస్టు చేయాలని విజ్ఞప్తి చేశారు. దానికి 'స్థానిక ఉత్పత్తులకే ప్రాధాన్యం (వోకల్ ఫర్ లోకల్)' అనే హాస్టాగ్ జోడించాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించి ఈ విజయదశమితో వందేళ్లవుతున్న సందర్భంగా ఆ సంస్థపై ప్రశంసలు కురిపించారు. క్రమశిక్షణ, నిస్వార్థ సేవే సంఘ్ బలమని తెలిపారు. ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమైన 'మన్ కీ బాత్' 126వ సంచికలో ప్రధాని ప్రసంగించారు. స్వాతంత్ర్యానంతరం ఖాదీ ఉత్పత్తుల కొనుగోలు వెలవెలబోయిందని.. గత 11 ఏళ్లలో తన పాలనలో దేశమంతా ఖాదీకి ఆకర్షితమవుతోందని తెలిపారు. చేనేత, హస్తకళల రంగాల్లో కూడా గుణాత్మక మార్పులు వస్తున్నాయని చెప్పారు.

సంఘ్ అసాధారణ ప్రయాణం..

స్వయంగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ అయిన మోదీ.. దసరాకు ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పాటై నూరేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆ సంస్థను శతధా కొనియాడారు. సంఘ్ కార్యకర్తలకు 'దేశమే ఫస్ట్' అని స్పష్టంచేశారు. 'మేధో బానిసత్వం నుంచి దేశాన్ని విముక్తి చేసేందుకు 1925లో విజయదశమినాడు కేశవ్ బలిరాం హెడ్గేవార్ ఆర్‌ఎస్‌ఎస్‌ను నెలకొల్పారు. వందేళ్లుగా సంఘ్ జాతి సేవలో అవిశ్రాంతంగా నిమగ్నమైంది' అని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రస్తుత చీఫ్ సర్‌సంఘ్‌చాలక్ భాగవత్ నాయకత్వాన్ని ప్రధాని కొనియాడారు.

నేవీ అధికారిణులకు ప్రత్యేక ప్రశంస

మన్ కీ బాత్ ప్రసంగం సందర్భంగా ప్రధాని భారత నౌకాదళానికి చెందిన ఇద్దరు మహిళా అధికారులతో ప్రత్యేకంగా సంభాషించారు. లెఫ్టినెంట్ కమాండర్లు దిల్‌నా,రూప.. ప్రపంచ ప్రదక్షిణ నిమిత్తం 'నావికా సాగర్ పరిక్రమ'లో పాలుపంచుకోవడం ద్వారా నిజమైన ధైర్యసాహసాలను, మొక్కవోని సంకల్పాన్ని ప్రదర్శించారని కొనియాడారు. ఐఎన్ఎస్‌వీ 'తరిణి' నౌకలో వారి పరిక్రమ యాత్ర గత ఏడాది అక్టోబరు 2న గోవాలోని నేవల్ ఓషన్ సెయిలింగ్ నోడ్ నుంచి ప్రారంభమైంది. నాలుగు ఖండాలు, మూడు మహాసముద్రాలు, మూడు ద్వీపకల్పాలు, ప్రతికూల వాతావరణం, సవాళ్ల నడుమ 50 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఈ ఏడాది మే 29న తిరిగి గోవా తీరానికి చేరుకున్నారు.

నాకు మాటలు రావు.. చెవులు వినపడవు.. మెసేజ్ పంపినప్పుడు దయచేసి చూడండి!

» కస్టమర్‌కు జొమాటో డెలివరీ బాయ్ మెసేజ్.. వైరల్



డెలివరీ బాయ్ మెసేజ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: అంగవైకల్యంతో బాధపడుతున్నా.. కుటుంబ పోషణ కోసం ఫుడ్ డెలివరీ బాయ్ అంకిత భావం నెటిజన్ల హృదయాలను గెలుచుకున్నది. ఓ కస్టమర్‌కు ఆయన పంపిన టెక్స్ట్ మెసేజ్ సోషల్ మీడియాలో వైరలైంది. కొద్దిసేపట్లోనే 9 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. 'జొమాటో' ఫుడ్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న వ్యక్తి తన కస్టమర్‌కు పంపిన టెక్స్ట్ మెసేజ్ అందరినీ ఆలోచింప జేసింది. 'నేను మీ ఆర్డర్ తీసుకొస్తున్నా.. త్వరగానే మీకు అందజేస్తా' అని పేర్కొంటూ.. 'హలో.. నేను మూగవాడిని. ఇతరుల మాటలు వినలేని చెవిటి వాడిని. మీ చిరునామాకు వచ్చాక మెసేజ్ చేస్తాను. అది దయచేసి చూడండి' అని పెట్టిన టెక్స్ట్ సందేశం స్క్రీన్‌షాట్‌ను స్తుతి అనే యూజర్.. 'కుటుంబం కోసం ఓ వ్యక్తి పడే కష్టాలు' అనే క్యాప్షన్‌తో 'ఎక్స్'లో పోస్టు చేశారు. దీనిపై స్పందించిన నెటిజన్లు.. ప్రతికూల పరిస్థితుల్లోనూ డెలివరీ భాయ్ తన డ్యూటీ పట్ల దృఢ నిశ్చయాన్ని కొనియాడారు.

స్పీడ్ పోస్టు చార్జీల పెంపు

» పోస్టల్‌లోనూ ఇక నుంచి ఓటీపీ ఆధారిత డెలివరీ

» అక్టోబరు 1 నుంచి అమల్లోకి



హైదరాబాద్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్టు చార్జీలు పెరిగాయి. పెరిగిన చార్జీలు అక్టోబరు 1(బుధవారం) నుంచి అమల్లోకి రానున్నాయి. స్పీడ్ పోస్టు చార్జీలను చివరిసారిగా 2012లో సవరించారని, అప్పటి నుంచి చూస్తే ప్రస్తుతం నిర్వహణ ఖర్చులు పెరిగాయని, అందుకు అనుగుణంగా చార్జీలను హేతుబద్ధీకరించామని పోస్టల్ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. అంతేకాకుండా లెటర్లు, పార్శిళ్ల డెలివరీలకు సంబంధించి పలు కొత్త సదుపాయాలు, సేవలను పోస్టల్ శాఖ ప్రారంభించింది. ఇందులో ముఖ్యమైనది ఓటీపీ ఆధారిత డెలివరీ. ప్రస్తుత అమెజాన్, ఫ్లిప్‌కార్టులు ఎలాగైతే ఓటీపీ చెప్తేనే డెలివరీ చేస్తున్నాయో పోస్టల్ అధికారులు కూడా అలాగే డెలివరీ చేయనున్నారు. ఇందుకు వినియోగదారులు రూ.5అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పాటు డెలివరీ సమయంలో ఆన్‌లైన్ చెల్లింపుల వ్యవస్థ, ఎస్ఎంఎస్ ఆధారిత డెలివరీ నోటిఫికేషన్లు, ఆన్‌లైన్ బుకింగ్ సేవలు, రియల్ టైమ్ డెలివరీ అప్‌డేట్‌లను తీసుకువచ్చింది. రిజిస్ట్రేషన్ పేరుతో కొత్త సదుపాయాన్ని తీసుకువచ్చారు. రూ.5చెల్లించి రిజిస్ట్రేషన్ చేస్తే.. ఏ చిరునామాలో, ఎవరికి ఇవ్వాలని రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్నారో వారికే లెటర్/పార్శిల్‌ను డెలివరీ చేస్తారు. ఇదిలా ఉండగా, విద్యార్థులకు స్పీడ్ పోస్టు చార్జీలపై 10% తగ్గింపు వెసులుబాటు కల్పించారు.

బరువు-చార్జీ(రూ.ల్లో)	లోకల్	200 కి.మీ.లోపు	201-500 కి.మీ	501-1000 కి.మీ	1001-2000 కి.మీ	2000 కి.మీ+
50 గ్రాములు	19	47	47	47	47	47
51-250గ్రాములు	24	59	63	68	72	77
251-500గ్రాములు	28	70	75	82	86	93

దేశంలోని విస్కీ అమ్మకాల్లో 58% దక్షిణ భారతంలోనే

» 9% చొప్పున విక్రయాలతో తెలుగు రాష్ట్రాల జోరు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: దక్షిణ భారతదేశంలో ప్రజలు విస్కీని ఎడాపెడా తాగేస్తున్నారు. సీఐఏబీసీ(కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీస్) గణాంకాల మేరకు 2025 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరం(ఎఫ్‌వై-25)లో దేశంలోని ఐఎంఎఫ్ఎల్(ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్) అమ్మకాల్లో 58 శాతం దక్షిణభారతంలోనే జరిగాయి. దక్షిణాది రాష్ట్రాల్లో మొత్తం 23.18 కోట్ల కేసులు అమ్ముడుపోయాయి. ఎఫ్‌వై-24లో దేశవ్యాప్తంగా 39.62 కోట్ల ఐఎంఎఫ్ఎల్ కేసులు అమ్ముడుపోగా, ఎఫ్‌వై-25లో 40.17 కోట్ల కేసులు అమ్ముడయ్యాయని సీఐఏబీసీ డైరెక్టర్ జనరల్ అనంత్ ఎస్ అయ్యార్ చెప్పారు. దేశంలోని మొత్తం అమ్మకాలలో 17 శాతం సాధించి కర్ణాటక అగ్రస్థానంలో నిలిచింది. ఎఫ్‌వై-25లో తెలంగాణలో 3.71 కోట్ల కేసులు, ఏపీ 3.55 కోట్ల కేసులు అమ్ముడయ్యాయి. దేశవ్యాప్త అమ్మకాలలో ఇది సుమారు 9 శాతం. దేశంలోని మొత్తం అమ్మకాలలో ఉత్తర భారతం 20 శాతం సాధించింది. అందులో అత్యధికంగా 2.50 కోట్ల కేసులు ఉత్తరప్రదేశ్‌లో అమ్ముడయ్యాయి. దేశవ్యాప్తంగా 6వ స్థానంలో యూపీ నిలిచింది. దాని తర్వాతి స్థానాల్లో రాజస్థాన్(9), ఢిల్లీ(10), హరియాణా(11) నిలిచాయి. రాజస్థాన్‌లో 1.37 కోట్ల కేసులు, ఢిల్లీలో 1.18 కోట్ల కేసులు, హరియాణాలో 1.17 కోట్ల కేసులు అమ్ముడయ్యాయి. ఉత్తర భారతం కూడా ఎఫ్‌వై-25లో ఐఎంఎఫ్ఎల్ అమ్మకాల్లో ఒక శాతం వృద్ధి సాధించింది.

• తిరువీధుల మెరిసే దేవదేవుడు



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

తిరుమల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన గరుడవాహనసేవ ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగిం ది. వజ్రవైఢూర్యాభరణాల అలంకరణతో మలయప్ప తన ఇష్టవాహనమైన గరుడుడిని ఆధిరోహించి భక్తకోటికి దర్శనమిచ్చారు. తొలినాలుగురోజులూ పలుచగా కనిపించిన మాడవీధులు ఆదివారం కిక్కిరిసిపోయాయి. ఉదయం జరిగిన మోహినీ అవతారసేవ సమయంలోనే మాడవీధులు నిండిపోయాయి. రాత్రి జరిగే గరుడసేవను గ్యాలరీల నుంచి 2లక్షల మంది, అదనపు క్యూలైన్లు, ఆలయం ముందు రీఫిల్లింగ్ ద్వారా 35 వేల మంది వీక్షించారు. అంతకు ముందు ఉదయం మోహినీరూపుడై శ్రీకృష్ణస్వామి సరసన మలయప్ప తిరువీధుల్లో విహరించాడు. సప్తగిరి వద్ద, నందకం వద్ద భక్తుల మధ్య తోపులాటలు చోటుచేసుకున్నాయి.

• ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

విజయవాడ, శ్రీశైలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని విజయవాడ ఇంద్రకీలాద్రి భక్తులతో పోటెత్తింది. శరన్నవరాత్రుల్లో ఏడోరోజు దుర్గమ్మ మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం సెలవు కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దిగువ నుంచి కొండపై వరకు క్యూలన్నీ తెల్లవారుజామున 4 గంటలకే నిండిపోయాయి. నిమిషానికి 100 మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. రాత్రి 7 గంటల సమయానికి 1,01,400 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా ఉత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజు ఆదివారం భ్రమరాంబికా దేవి భక్తులకు కాళరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా రాత్రి మల్లికార్జున స్వామి, భ్రమరాంబికా దేవి గజవాహనంపై విహరించారు.


మహాచండీదేవి అవతారంలో కనకదుర్గమ్మ


నిజామాబాద్ జిల్లా సాలూర మండలంలోని అంతర్రాష్ట్ర బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీరా నది

మంజీర ఉగ్ర రూపం

జల దిగ్బంధంలో పరీవాహక గ్రామాలు

- బోధన్, సాలూర మండలాల్లో వరద పోటు
- బాసరను మరోసారి చుట్టుముట్టిన గోదావరి
- శ్రీశైలం, సాగర్‌కు 5.9 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 1న అల్పపీడనం.. 3,4 తేదీల్లో భారీ వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): భారీ వర్షాలకు మంజీర ఉగ్ర రూపం దాల్చింది. నిజాంసాగర్ నుంచి వస్తున్న వరదతో నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. మరోవైపు మహారాష్ట్ర నుంచి గోదావరికి భారీగా వరద వస్తోంది. దీంతో ఈ రెండు నదులు కలిసే నిజామాబాద్ జిల్లాలోని కందకుర్తి ప్రాంతంలో మంజీర పోటెత్తుతోంది. అప్పటికే ఆ ప్రాంతంలో భారీగా శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ కూడా నిలిచి ఉండటంతో.. సమీప గ్రామాల్లోకి మంజీర వరద పారింది. దీంతో బోధన్ మండలంలోని హంగర్గ, బికెనెల్లి, ఖండ్‌గావ్, కొప్పర్గ.. సాలూర మండలంలోని మందర్నా, ఖాజాపూర్, హున్స గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. 40 ఏళ్ల తర్వాత ఇంతటి వరద వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు గ్రామస్థులను బస్సుల్లో పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు హంగర్గ సరిహద్దు గ్రామాల్లోని 7 వేల ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. తెలంగాణ సరిహద్దు గ్రామమైన ఖండ్‌గావ్ నుంచి మహారాష్ట్రలోని కొండల్‌వాడికి రాకపోకలు నిలిచిపోయాయి. మంజీర ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రెండు ప్రాంతాల మధ్య ఉన్న బ్రిడ్జిపై నుంచి వరద పారుతోంది. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయల వద్ద మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఘనపురం ప్రాజెక్టు దిగువన ఉన్న మొదటి బ్రిడ్జి, ఎల్లాపూర్ బ్రిడ్జి నీట మునిగాయి. రెండు రోడ్లను మూసి వేయడంతో పాపన్నపేట, టేక్మాల్, పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, రేగోడ్ మండలాల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లడానికి అవకాశం లేకుండాపోయింది. నిర్మల్ జిల్లా బాసరను శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ మరోసారి ముంచెత్తింది. ఆలయ పరిసరాలు, స్నాన ఘట్టాలు పూర్తిగా జలమయమయ్యాయి. బాసరలోని ప్రైవేటు హోటళ్లు, సత్రాల చుట్టూ నీరు చేరడంతో, అందులో బస చేసిన భక్తులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆలయానికి వెళ్లే రెండు ప్రధాన రహదారులపై భారీగా వరద నీరు చేరింది. గోదావరి పరీవాహక ప్రాంతంలో సుమారు వెయ్యి ఎకరాల పంట మరోసారి నీట మునిగింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. నెల రోజుల్లోనే ఈ స్థాయిలో వరద రావడం ఇది రెండోసారి కావడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎంజీబీఎస్ నుంచి బస్సులు ప్రారంభం

మూసీ వరదతో జలదిగ్బంధంలో చిక్కుకున్న హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ స్టేషన్(ఎంజీబీఎస్) ఆదివారం తెరుకుంది. నీటి ప్రవాహం తగ్గడంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పారిశుధ్య సిబ్బంది శ్రమించి ప్లాట్‌ఫాంలు, బస్ స్టేషన్ ఆవరణలో బురదను తొలగించారు. ఆదివారం ఉదయం 11 తర్వాత బస్సుల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

మేడిగడ్డకు 7.7 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి ఆదివారం 7.71 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో గేట్లన్నీ ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు వదిలేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఆదివారం 3 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. దీంతో 39 గేట్లను ఎత్తి 4.5 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కృష్ణా పరీవాహకంలో గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు 5.05 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 39 గేట్లను ఎత్తి 5.20 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం జలాశయానికి 5.93 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. పది గేట్లను 23 ఫీట్ల మేర ఎత్తి 5.18 లక్షల క్యూసెక్కులు.. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 64,759 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, 202.9 టీఎంసీల నీరు ఉంది. నాగార్జునసాగర్‌కు 5.88 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో 26 గేట్ల ద్వారా 5.45 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, 299.7 టీఎంసీల నిల్వ ఉంది.

నేడు, రేపు ఈదురుగాలులతో వర్షాలు

బంగాళాఖాతంలో అక్టోబరు 1 నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మంగళవారం నాటికి ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో ఉత్తర బంగాళాఖాతంలో ఒక అల్పపీడనం, మధ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. దీంతో అక్టోబరు 3, 4 తేదీల్లో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా నేడు, రేపు కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

మూసీకి కబ్జాల మూత

నది గర్భంలో భారీగా నిర్మాణాలు.. నార్సింగి వద్ద ఓ బహుళ అంతస్తుల ప్రాజెక్టు

- విచారణ జరుపుతున్న హైడ్రా.. త్వరలో సర్కారుకు నివేదిక
- ఇతర ప్రాంతాల్లోనూ కబ్జాలు, ఆక్రమణలు
- నదిలో తగ్గిపోతున్న వరద ప్రవాహ సామర్థ్యం


ఆక్రమణల చెరలో మూసీ పరీవాహక ప్రాంతం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మూసీ ఉగ్ర రూపం నేపథ్యంలో ప్రభుత్వ విభాగాలు అప్రమత్తమయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్ నగరం పొడవునా క్షేత్రస్థాయిలో పరిస్థితులపై అధ్యయనానికి చేపట్టాయి. ఈ క్రమంలో 'హైదరాబాద్ విపత్తుల నిర్వహణ, ఆస్తుల సంరక్షణ సంస్థ (హైడ్రా)' కీలక విషయాన్ని గుర్తించింది. నార్సింగి ప్రాంతంలో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ (ఆదిత్య బిల్డర్స్) చేపట్టిన బహుళ అంతస్తుల భవనం సెల్లార్‌లోకి భారీగా మూసీ వరద చేరిందని, చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మించినా నీరు ఆగలేదని గుర్తించింది. ఈ నేపథ్యంలో ఆ భవనం నది ఎఫ్‌టీఎల్ పరిధిలోగానీ, బఫర్ జోన్‌లోగానీ ఉందా అన్నది తేల్చేందుకు కసరత్తు మొదలుపెట్టింది. గతంలోనూ ఈ బహుళ అంతస్తుల భవనంపై ఫిర్యాదులు అందాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. శనివారం ఈ భవనం నిర్మిస్తున్న ప్రాంతాన్ని కమిషనర్ రంగనాథ్, అధికారులు సందర్శించారు. డ్రోన్ ద్వారా పరిసర ప్రాంతాల్లో వరదను చిత్రీకరించారు. ఆ ప్రాంతంలో వ్యర్థాలతో నింపి, ఎత్తు పెంచినట్టు ప్రాథమికంగా గుర్తించారు. అక్కడ నది ఎంత వెడల్పు ఉండాలి? ప్రస్తుతం ఎంత ఉంది? నాడు, నేడు ప్రవాహ సామర్థ్యం ఎంత అనే అంశాలను పరిశీలిస్తున్నారు. ఆ భవనానికి హెచ్‌ఎండీఏ అనుమతులున్న నేపథ్యంలో.. నిబంధనల ప్రకారమే అనుమతులు ఇచ్చారా? ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌కు సంబంధించి నిరభ్యంతర పత్రం తీసుకున్నారా? ఒకవేళ సమర్పించి ఉంటే ఇచ్చిన అధికారి ఎవరు? క్షేత్రస్థాయిలో, రికార్డులను పరిశీలించే ఎన్‌ఓసీ ఇచ్చారా? అన్నది తేల్చాలని భావిస్తున్నారు. సమగ్ర పరిశీలన తర్వాత దీనిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని రంగనాథ్ వెల్లడించారు. నార్సింగి, కోకాపేట వంటి ప్రాంతాల్లో నది ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో బహుళ అంతస్తుల భవనాలు, విల్లాలు నిర్మించారు. జియాగూడ, అఫ్జల్‌గంజ్, మలక్‌పేట, అంబర్‌పేట, ఉప్పల్ వంటి ప్రాంతాల్లో పేదల ఇళ్లు ముంపునకు గురవుతుంటే.. నార్సింగి, బండ్లగూడ జాగీర్, గండిపేట, కోకాపేట తదితర ప్రాంతాల్లో విల్లాలు, బహుళ అంతస్తుల భవనాల్లోకీ నీళ్లు చేరాయి. జంట జలాశయాల్లో ఆక్రమణలూ వరద తీవ్రతకు కారణమని వాతావరణ మార్పులు, పట్టణాల్లో వరదల నిపుణుడు బీవీ సుబ్బారావు పేర్కొన్నారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో భవన నిర్మాణాలు ఉన్నాయని.. జలాశయాల్లో వ్యర్థాలు పోసి నిర్మాణాలు చేపట్టడంతో, నీటి నిల్వ సామర్థ్యం తగ్గి నీరంతా దిగువకు వదలాల్సి వస్తోందని వివరించారు.

ఆక్రమణలతో పెరుగుతున్న ముంపు తీవ్రత

2020లో అతిభారీ వానలతో మూసీలో భారీగా వరద వచ్చింది. కానీ ఇప్పటిస్థాయిలో అప్పుడు కనిపించలేదు. నదిలో ఆక్రమణలతో ప్రవాహ సామర్థ్యం తగ్గి.. కాలనీలు, బస్తీల్లోకి వరద చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. చాదర్‌ఘాట్ వంతెన నుంచి ఉస్మానియా ఆస్పత్రి వరకు పలు చోట్ల నదిలో వ్యర్థాలు నింపి.. వాహనాల పార్కింగ్, ఇతర అవసరాల కోసం వాడుతున్న కబ్జాలను హైడ్రా జూలైలో తొలగించింది. 9.61 ఎకరాల్లో ఆక్రమణల తొలగించినా.. నది గర్భంలో నింపిన మట్టిని తొలగించలేదు. ఎంజీబీఎస్ మునగడానికి ఇది కూడా ఒక కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్యూఆర్ కోడ్‌తోనే టికెట్ల కొనుగోలు!

- పండగ సీజన్‌లో రైల్వే శాఖ నూతన ఆలోచన
- త్వరలో రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్లు మూసివేత?
- స్మార్ట్ ఫోన్లు లేని ప్రయాణికులకు ఇబ్బందులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పండుగ సీజన్ కారణంగా రైల్వే స్టేషన్లలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రిజర్వ్ చేయని జనరల్ బోగీల్లో ప్రయాణించే వారి కోసం క్యూఆర్ కోడ్ స్కానర్లను రైల్వే శాఖ అందుబాటులోకి తెచ్చింది. యూటీఎస్ అనే మొబైల్ యాప్‌ను ఉపయోగించి ప్రయాణికులు క్యూలైన్లలో వేచిచూసే అవసరం లేకుండా టికెట్లు బుక్ చేసుకోవచ్చని ఈ కొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. రైల్వే సిబ్బంది ధరించే జాకెట్‌పై క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు ముద్రించి ఉంటాయి. ఈ జాకెట్ ధరించి ఉన్న సిబ్బంది వద్ద నుంచి చేతిలో డబ్బు లేకపోయినా టికెట్ కొనచ్చని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఆర్-వాలెట్ ద్వారా టికెట్లు కొనుగోలు చేస్తే 3 శాతం బోనస్ లభిస్తుందని ప్రచారం చేస్తున్నారు. ఇలా ప్రజల్లో కొత్త విధానంపై అవగాహన కల్పించి త్వరలో టికెట్ బుకింగ్ కౌంటర్లను మూసివేయాలని అధికారులు భావిస్తున్నారు. వాటి స్థానంలో క్యూఆర్ కోడ్ లేదా ఏటీవీఎం(ఆటోమేటెడ్ వెండర్ మెషీన్) యంత్రాలను ఉపయోగించాలని పదే పదే కోరుతున్నారు. సికింద్రాబాద్, కాచిగూడ, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, తిరుపతి, నాందేడ్ రైల్వే స్టేషన్లలో దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. వారం రోజుల నుంచి మొదలైన ఈ కొత్త పద్ధతితో చేతిలో స్మార్ట్ ఫోన్ లేని ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పండుగకు వెళ్లే కార్మికులు, కూలీలు వద్ద ఉన్న సాధారణ ఫోన్లలో యాప్ లేకపోవడంతో ఏటీవీఎం సెంటర్ల వద్ద టికెట్లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

బొమ్మలు: అక్బర్

ఒకే ఒక భైరప్ప

సమాజంలోని అన్ని వ్యవస్థల్లాగే రచయితలకు కూడా ఉత్థాన పతనాలు ఉంటాయి. కొంతకాలం నిరంతరంగా విస్తృతంగా రచనలు చేస్తూ వచ్చిన రచయిత ప్రయాణం ఏదో ఒక చోట ఆగిపోతుంటుంది. అది తాత్కాలికంగానైనా శాశ్వతంగానైనా. అలాంటి ఉత్థాన పతనాలు లేని రచయితలు అరుదు. అలాంటి అతికొద్ది రచయితల్లో ఎస్.ఎల్. భైరప్ప ఒకరు. 1931లో హాసన్ జిల్లాలోని సంతేశివర అనే వూళ్ళో భైరప్ప పుట్టినపుడు ఆ పసిపిల్లవాడు తన పేరునే ఇంటిపేరుగా చేసుకుని తనకు పేరు ప్రఖ్యాతలు తెస్తాడని సంతేశివర గ్రామం ఊహించి ఉండదు. తను పుట్టిన ఊరికి భారతీయ చిత్రపటంలో శాశ్వత స్థానం కల్పించిన ఆ రచయితే ఎస్. ఎల్. భైరప్పగా పిలువబడే సంతేశివర లింగణ్ణయ భైరప్ప.

రచయిత తను రాస్తున్న విషయం గురించో అనుభవాల గురించో సిద్ధాంతం గురించో ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ మమేకమై రాసినపుడు, రాసే విషయానికి సంబంధించిన దాని ఆత్మను పట్టుకోగలిగినపుడు ఆ ఆత్మ ఆ రచనను నడిపిస్తుంది. పదికాలాలపాటు నిలబెడుతుంది. రచయిత గుండె ల్లోంచో గుండె లోతుల్లోని తడిలో నుంచో ఉద్వేగాల జడిలో నుంచి కాకుండా



పాళీ నుంచి వచ్చిన రచన ఏదీ బతికి బట్టకట్టిన దాఖలాలు చరిత్రలో లేవు. ఈ కొలమానం నుంచీ నేపథ్యం నుంచీ చూసినపుడు భైరప్ప రాసిన 'వంశవృక్ష' 'గృహభంగ', 'దాటు', 'పర్వ', 'ఆవరణ', 'సాక్షి', 'యాన', 'ఉత్తర కాండ', 'మతదాన', 'గ్రహణ', 'మంద్ర' తదితర రచనలన్నీ ఆ కాల పరీక్షకు తట్టుకుని నిలబడగలిగినవే. చేసిన ప్రతి రచన ద్వారా సంచలనం సృష్టించిన అతికొద్దిమంది రచయితల్లో కూడా భైరప్ప ఒకడు.

సమాజపు పునాదులనే కూకటివేళ్ళతో పెళ్లగించి వేయగల కులం, మతం, మతాంతీకరణ, ఇతిహాసాలు, సంప్రదాయాలు తదితర అంశాలను ఇతివృత్తాలుగా తీసుకుని వాటిని విస్తృతమైన పరిశోధన, అనుభవాల మేళవింపుతో ఆసక్తిరమైన రచనలుగా మలచడంలో భైరప్ ప్రతిభకు 'దాటు', 'వంశవృక్ష', 'పర్వ'లు ఒక నిదర్శనం.

భైరప్ప రచనల్లో విలక్షణమైనదిగా ఆయనకు ప్రథమంగా గుర్తింపు తెచ్చిపెట్టింది 'వంశవృక్ష'. ఆచార సంప్రదాయాలకు, ఆధునిక భావజాలానికి మధ్య వారధిగా ఆయన సృష్టించిన శ్రీనివాసశ్రోత్రి పాత్ర చిరకాలం గుర్తుండిపోతుంది. సదాచార బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి వంశవృక్షానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చే శ్రీనివాసశ్రోత్రి తన పుట్టుక తాలూకూ మూలాలు తెలిసి ఖిన్నుడవుతాడు. ఏకైక కుమారుడు, భార్య చనిపోయినపుడు కూడా చలించకుండా ఆత్మనిగ్రహంతో ఉండగలిగిన శ్రోత్రి తన జన్మ రహస్యం తెలిసి ఒక్కసారిగా విరాగిగా మారిపోతాడు. "మరొకరి పాపపుణ్యాలను నిర్ణయించే అధికారం మనకు లేదు. అందులోనూ తల్లిదండ్రుల జీవితాలను తూచి చూడడం మహాపాపం," అనుకోగలిగిన జన్మ సంస్కారం కలిగిన శ్రీనివాసశ్రోత్రి కూడా తండ్రికి శ్రాద్ధక్రియలు నిర్వహించాల్సి వచ్చే సందర్భంలో మానసిక విచికిత్సకు లోనవుతాడు. ఎవరి వంశానికి తాను ధర్మబద్ధంగా ఇవ్వబడలేదో వారికి శ్రాద్ధకర్మలు చేసే రస విహీనమైన నాటకం ఆడడంలో అర్థం ఏముందని అనుకుంటాడు. తనను పట్టుకున్న ఆధారం అదృశ్యమై అంతులేని అగాధంలో పడిపోతున్నట్టు భావిస్తాడు. 'వంశవృక్ష' విశ్వనాథ సత్యనారాయణ 'వేయి పడగలు'ను తలపించే విశిష్ట నవల.

కౌరవులు, పాండవులు కురుక్షేత్ర యుద్ధానికి సన్నద్ధమవుతున్న సందర్భాన్ని నేపథ్యంగా తీసుకుని భైరప్ప రచించిన 'పర్వ' ఆధునిక మహాభారతానికి రక్త మాంసాలను అద్ది, ఆ పాత్రలను సజీవంగా కళ్ళముందు నిలబెడుతుంది. మహాభారతం చుట్టూ అలుముకున్న దైవిక భావజాలానికి విరుద్ధంగా దానికి ఒక హేతుబద్ధమైన రూపం ఇచ్చి, ఆయా పాత్రల అంతఃసంఘర్షణకు మనోవిశ్లేషణకు 'పర్వ' అద్దం పడుతుంది. కుంతి, ద్రౌపది, భీముడు, అర్జునుడు తదితర పాత్రల అంతరంగపు అట్టడుగు పొరల్లో నిక్షిప్తమైన నిజాలను వెలికి తీసే ప్రయత్నం చేస్తుంది.

"నువ్వు కళ్ళకు గంతలు ఎందుకు కట్టుకున్నావో నిజం చెప్పు" అని కృష్ణుడు గాంధారిని అడిగినపుడు "నాకు ఇష్టం లేకుండా గుడ్డివాడిని భర్తగా చేస్తే అతని మొహం కూడా చూడను అని శపథం చేసి మొదట కళ్ళకు గంతలు కట్టుకున్నాను. ధృతరాష్ట్రుడికి లేని చూపు తనకు ఎందుకని కళ్ళకు గంతలు కట్టుకున్నట్టు మిగిలిన వారు అంతా భావించి నన్ను ప్రశంసించినపుడు ఆ దేవీ పట్టం నుంచి దూరం కాకుండా ఉండేందుకు గంతలు కట్టుకోవడం కొనసాగించాను" అని అంటుంది గాంధారి. మహాభారతంలో బైటకు కనిపించని ఎన్నో చీకటి కోణాలని, యుద్ధాల పేరుతో జరిగే వినాశనాన్నీ, రాజుల అంతఃపురాలలో మగ్గిపోయే స్త్రీ జనపు కన్నీటి ఘోషనీ, పురుషులు స్త్రీల మధ్య పాటించే ద్వంద్వ ప్రమాణాలను అడుగడుగునా 'పర్వ' చెప్పకనే చెబుతుంటుంది. దాదాపు ఇరవై ఏళ్ళపాటు తనలో మహాభారత కథా వాస్తవాల పట్ల ప్రారంభమైన ఊహలు, ఆలోచనలకు పుస్తకరూపమే 'పర్వ' అంటారు భైరప్ప.

భైరప్ప నవలల్లో విశిష్ట ప్రాచుర్యం పొందడమే గాక వివాదాస్పదంగానూ నిలిచిపోయిన నవల 'ఆవరణ'. అభ్యుదయ భావాలున్న అమీర్‌ను పెళ్ళి చేసుకున్న లక్ష్మి తన పేరును రజియాగా మార్చుకుంటుంది. అయితే అమీర్ తను అనుకున్నంత ఉన్నతుడు కాదని తెలుసుకుని అతనికి దూరం అవుతుంది. ఆ క్రమంలో చరిత్ర మీద ఆసక్తి కలిగి మొగలుల చరిత్ర గురించి అధ్యయనం చేయాలనుకున్న లక్ష్మికి ఆ పరిశోధనలో ఇస్లామిక్ పరిపాలన వల్ల మారిన హిందూ సమాజ స్వరూప స్వభావాలకు సంబంధించి కొన్ని చారిత్రక సత్యాలు వెల్లడవుతాయి. హిందూ సంస్కృతిని ధ్వంసం చేసి ఆ పునాదుల మీద మొగలులు సామ్రాజ్యాన్ని స్థాపించారని లక్ష్మి పరిశోధనా పత్రాలను తయారు చేసి ఒక సంచలనానికి కారణం అవుతుంది.

'ఆవరణ' నవలతో భైరప్ప సమాజాన్ని మతపరంగా విడగొట్టడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తాయి. 'సంస్కార' నవల రచయిత యు.ఆర్. అనంతమూర్తి కూడా 'ఆవరణ'ను ప్రమాదకరమైన నవలగా అభివర్ణించారు. అర్ధసత్యాలతో కూడిన ఇలాంటి రచనల వల్ల మత సమైక్యత దెబ్బతింటుందని ఇతర రచయితలు కూడా భైరప్పను తీవ్రస్థాయిలో విమర్శించారు. అయితే తను ఎంతో విస్తృతమైన పరిశోధన చేసి ఈ రచన చేశానని, ఇందులోనివన్నీ అక్షర సత్యాలని భైరప్ప అంటారు.

'పర్వ'లో మహాభారతంలాగే 'ఉత్తరకాండ'లో రామాయణంపై కూడా ఒక విభిన్న దృష్టికోణం నుంచి ప్రశ్నలు సంధిస్తారు భైరప్ప. సీత దృష్టికోణం నుంచీ రామాయణాన్ని నిర్వచించిన భైరప్ప రామాయణం అంతా ఒక్క మాటలో చెప్పాలంటే సీతకు చేసిన ద్రోహం అని, ఆమె తప్పు లేకుండానే ఆమెకు విధించిన శిక్ష అనీ అంటారు. కైకపై దశరథుడికి ఉన్న ప్రేమ, కైకేయి దురాశ, రాముడి శక్తి సామర్థ్యాలు, భరతుడి నిస్సహాయత, లక్షణుడి భ్రాతృ ప్రేమ లాంటి విషయాలన్నిటినీ పక్కనపెడితే రామాయణం సీత జీవితం తాలూకూ విషాదానికి, అర్థరాహిత్యానికి నిదర్శనమని అంటారు భైరప్ప. 'ఉత్తరకాండ' కూడా కన్నడ సమాజంలో ప్రకంపనలు సృష్టించింది.

> తను సృష్టించిన పాత్రలపై రచయితకు సహానుభూతి ఉండాలి. ఆ పాత్రలను సంపూర్ణంగా అవగాహన చేసుకుని వాటిల్లోకి పరకాయప్రవేశం చేయగలిగి ఉండాలి. గతంలోని అనుభవాలను వర్తమానంతో బేరీజు వేసుకుని భవిష్యత్తును దిశానిర్దేశం చేయగలిగిన దార్శనికత కలిగి ఉండాలి. అలాంటి ఒక దార్శనికుడు భైరప్ప

ఒక రచయిత విస్తృతంగా రాస్తూ పోయినపుడు కొంతకాలానికి అతను చెప్పాలనుకున్నదంతా చెప్పివేస్తాడు. అంతవరకూ ఉప్పెనలా ఎగసి వచ్చిన ఆలోచనా ప్రవాహం ఒక చోట ఇంకిపోయి ఒకలాంటి భావశూన్యత ఏర్పడుతుంది. ఏది రాద్దామనుకున్నా అది ఎప్పుడో ఒకప్పుడు ప్రస్తావించిన విషయమే అనిపిస్తుంది. భావాల పునర్ వ్యక్తీకరణగా అనిపించినపుడు అతని కలం ఒకచోట ఆగిపోతుంది. ప్రతి రచయితా ఏదో ఒక దశలో ఈ అనుభవానికి లోనవకుండా ఉండడు. అయితే దీనికి మినహాయింపుగా భైరప్ప అవిశ్రాంతంగా రచనలు చేస్తూనే వచ్చారు. ఇరవైనాలుగుకు పైగా నవలలతో సహా దాదాపు నలభై ఎనిమిది పైగా రచనలు చేశారు. ఈ విశిష్టత కారణంగానే భైరప్పను పద్మభూషణ్, పద్మశ్రీ, సరస్వతి సమ్మాన్, కేంద్ర, రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డులు వెతుక్కుంటూ వచ్చాయి.

తను రాసే వస్తువు పైనా, విషయం పైనా నిబద్ధత ఉన్నపుడు రచయిత విమర్శను కూడా అంతే నిబద్ధతతో అంగీకరించవలసి, ఎదుర్కొనవలసి ఉంటుంది. రచయిత ఎంత గొప్పవాడైనా, మేధావి అయినా విమర్శకుడు తనను సమర్థించనపుడు, తనకు సహాయంగా రానపుడు రచయిత నిస్సహాయుడిగా ఉండిపోవలసిందేనని ప్రముఖ ఆంగ్ల విమర్శకుడు మాథ్యూ ఆర్నాల్డ్ అంటారు. అయితే భైరప్ప ఎప్పుడూ అలా నిస్సహాయుడిగా ఉండిపోలేదు. నిబద్ధతనూ వదులుకోలేదు. తను సృష్టించిన పాత్రలపై రచయితకు సహానుభూతి ఉండాలి. ఆ పాత్రలను సంపూర్ణంగా అవగాహన చేసుకుని వాటిల్లోకి పరకాయ ప్రవేశం చేయగలిగి ఉండాలి. గతంలోని అనుభవాలను వర్తమానంతో బేరీజు వేసుకుని భవిష్యత్తును దిశానిర్దేశం చేయగలిగిన దార్శనికత కలిగి ఉండాలి. అలాంటి ఒక దార్శనికుడు భైరప్ప.

■ జి. లక్ష్మి

✆ 94907 35322

పదమై పలికింది జనహృదయం!

గోరటి వెంకన్న కంటే ముందు చాలామంది వాగ్గేయకారులు మనకు ఉన్నారు. తనతో పాటు ప్రయాణంలో ఉన్న సమకాలీన వాగ్గేయకారులూ గణనీయ సంఖ్యలో ఉన్నారు. ఐతే వెంకన్న దారి వేరు. వెంకన్న పాటలో కవిత్వం నిండి వుండటం, అతని కవిత్వంలో పాట లక్షణాలు అమరిపోవడం అతన్ని ఇతరులకన్నా విభిన్నంగా ఉంచింది. చాలా మంది వాగ్గేయకారుల పాటల్లో పాడుకోవటానికి అనుగుణమైన వాక్యాలు ఉంటాయి. కానీ వాటిలో కవిత్వం ఉండదు. కొంతమందిలో కవిత్వం ఉంటుంది కానీ గాన యోగ్యత తక్కువ. గద్దర్ గేయాల్లో రెండూ కలిసిపోయిన కళను చూస్తాం. ఈ కళ గోరటి వెంకన్నలో మరింత ఉన్నతంగా లోతుగా కనిపిస్తుంది. గాన యోగ్యతకూ కవిత్వ గాఢతకూ మధ్య పదిలమైన సమన్వయం ఉంటుంది. ఈ సమన్వయ నేర్పరితనమే ఇతన్ని ఇతర వాగ్గేయ కారుల కన్నా పది మెట్లు పైన ఉంచింది.

గోరటి వెంకన్న దృష్టిలో కళ అనేది సౌందర్యంలో మాత్రమే ఉండదు. విషయాల్ని విభిన్నంగా చూడగలిగే దృష్టిలో నిజమైన కళ ఉంటుంది. వాస్తవాలనూ, పరిసరాలనూ, ప్రకృతిలోని జీవజాలాన్నీ మనం చూసే దృష్టికి విభిన్నంగా చూడటం ద్వారా, అదే దృష్టి నుంచి చిత్రించడం ద్వారా ఒక అనూహ్యతనీ, తాజాతనాన్నీ, గోరువెచ్చనితనాన్నీ సాధించగలిగాడు గోరటి వెంకన్న. వీటికి తోడు కథనాత్మకతా, వర్ణనా చాతుర్యం, ప్రదర్శనాత్మకతలు ఇతని కళాస్వభావంలో ఇమిడిపోయాయి.

ఏటిని నమ్ముకుని బతుకుతున్న 'కొంగమ్మ' గురించి రాస్తూ ఆ జీవిని చూసిన తీరు చూడండి: "ఒంటి కాలి మీద నిలిసి వొడుపుతో సేపను పట్టి/ గూటిలోని బిడ్డ కొరకు నోట కరుసుకొని పోతే/ దొంగ కొంగ జపమని నిందలంటగట్టె నరుడు/ ఏలెడంత పొట్ట మీద ఎందుకమ్మ ఇంత నింద/ నరుడు తప్ప పుడమిలోన కొంగమ్మా/ ఏ జీవి కపటమెరుగదమ్మ కొంగమ్మా/ కపటమున్న నరుడు కొంగమ్మా/ నీకు కపట మంటగట్టె కొంగమ్మా" – కొంగ ఆహారాన్వేషణకు మనిషి అంటగట్టిన స్వభావాన్ని ఉల్టాగా చూపటంలోని కళా కౌశల్యమిది.

పల్లెల్లో ఎక్కడ చూసినా కనిపించే నల్ల తుమ్మ మీద రాసిన పాటలో తుమ్మ చెట్టంటే ఉండే తేలిక భావాన్ని పోగొట్టి దాని పట్ల ఆత్మీయత కలిగేట్లు చేయడంలోనూ ఇదే కళా మర్మం ఉంది: "ఓ నల్ల తుమ్మ పసిడి పూల కొమ్మ/ నీవు లేక పల్లె చిరునామ లేదమ్మ/ / గులకరాళ్ళ సవుక నేలలో మొలిసేవు/ గుట్టలు రాల్లున్న గుబురుగ పెరిగేవు/ పెట్టిపోతల కొరకు పెట్టుకోవు బెంగ/ మేక పంచకముంటె అదె నీకు సురగంగ/ కంచె లేకనే పెరిగి కంచె నీవయ్యేవు/ మంచెపై కాపుకు దాపు నీవయ్యేవు" – ఈ పాట పొందిన జనాదరణకు కారణం తుమ్మచెట్టు పట్ల వెంకన్న చూపిన భిన్నమైన దృష్టే. వెనకటికి జాన్ కీట్స్ అనే ఆంగ్ల కవి ఆకు రాలే కాలాన్ని అందమైన కాలంగా వర్ణించాడు. మేకల అరుపులలోనూ, క్రిమికీటకాల రొదలోనూ సంగీతాన్ని వినగలిగాడు. ఇక్కడ వెంకన్న ధోరణీ అదే.

> గొప్ప కవులు వాస్తవికతనీ పరిసరాలనీ కవిత్వంగా మలిచే క్రమంలో తమదైన కళా వ్యవస్థను ఏర్పరచుకుంటారు. ఆ వ్యవస్థ నిర్మాణంలోకి వస్తువును తేవటం ద్వారా దాన్ని గ్లోరిఫై చేస్తారు. ఒక కొత్త గ్రామర్‌నీ గ్లామర్‌నీ పరిచయం చేస్తారు. గోరటి వెంకన్న చేసిందదే. అందుకే జనం పల్స్‌ను ఇతరుల కంటే బాగా పట్టుకోగలిగాడు. జనం వినాలనుకునే రీతిలో, వారి ఉద్వేగోల్లాసాలను తాకే విధంగా తనదైన కళా వ్యవస్థను నిర్మించి నిలవగలిగాడు. గెలవగలిగాడు.

తన అసాధారణ దృష్టితో 'జీవబంధం'లోని తాత్త్వికతను ప్రశ్నల రూపంలో పండించిన వైనం మరింత అబ్బురం: "జీవుల పొడిసే గద్దనెందుకో/ దేవుని మోసే వాహనమంటివి/ బరువులు మోసే గాడిద సేవను/ మరిసి చులకనలాడుచుంటివి// కాటు వేసే ఆ పాముకెందుకో/ నాగదేవతని పూజ చేసెదవు/ పాలనిచ్చే ఈ బర్రె నెందుకో/ బడితపూజతో బాద పెడతవు" – ఇక్కడ వెంకన్న ఉపయోగించిన లాజిక్ పోయెటిక్ లాజిక్. ఈ లాజిక్ ద్వారా తల్లకిందుల వాదనల్ని తుత్తునియలు జేసి ఆరోగ్యకరమైన తర్కాన్ని ప్రవేశపెడతాడు. ఓపికుంటే పై వాక్యాల సింబాలిక్ అర్థాన్ని కూడా రాబట్టవచ్చు. ఈ దేశంలో పొడిసే గెద్దలెవరో కరిచే పాములెవరో – గాడిద సేవ ఎవరిదో, పాలిచ్చే బర్రె ఎవరో తెలుసుకోవడం కష్టమేమీ కాదు.

వెంకన్న కవితా తర్కం అంటరానితనాన్ని ఎంత విభిన్నంగా కడిగిపారేసిందో ఇక్కడ చూడండి: "చాయ తాగితే గ్లాసులు/ మైలపడినవంటివి/ మొక్కినందుకే దేవుని/ మహిమ తొలిగెనంటివి/ గుడిలోకి వచ్చినరని/ గుడినే వెలి వేస్తివి/ గాలి పీల్చి వదిలిరి/ గాలిని వెలివేస్తవ/ వెలుగులో నడ యాడిరని/ పొద్దును వద్దంటవ/ నేలకు సెమటొచ్చిరని/ గింజల తిననంటవ" – ఇక్కడ కబీర్, తుకారం ధోరణిని పరాకాష్ఠకు తీసుకెళ్లాడు వెంకన్న.

అతని గేయ కవిత్వం – కవిత్వ గేయం అపారమైన వస్తు వైవిధ్యాన్నీ, విస్తృతినీ కలిగి ఉంది. దళిత బహుజన ఆకాంక్షలూ ఆరాటలూ పోరాటాలూ ఇతని అక్షరాల్లో ఒదిగిపోయాయి. వామపక్ష, విప్లవ ఉద్యమాల సానుకూలతా చోటు చేసుకుంది. గ్లోబలైజేషన్ తెచ్చిన ముప్పును పుక్కిటబట్టిన లెక్కలేనన్ని ఉదంతాలూ వెంకన్న వ్యక్తీకరణలో ఉన్నాయి. అన్నిటికీ మించి పల్లె తెలంగాణ స్వప్నలిపిని గొప్పగా రికార్డు చేయగలిగాడు: "తల్లీ తెలంగాణమా తనువెల్ల మాగాణమా/ పురి విప్పిన గానమా పూసిన పున్నాగమా/ గర్భానా సింగరేణి గళమున మధురవేణి/ తరుల పూలతోని కురులల్లుకున్న రాణి"– అని ఓ పక్క పలుకుతూనే –"సేతానామేడుందిరా/ తెలంగాణ సేలన్ని బీడాయెరా/ భూకంపమొచ్చి భూమి పగిలినట్టు/ రేగళ్ళ సవుకలు నెర్రెలొచ్చినాయి/



ఎర్రని దుక్కులు ఇసుక దుబ్బలాయె/ ఉసుక భూములన్ని ఉత్త దుమ్మాయి పాయె/ మెదిమ గడ్డలు గూడరా తెలంగాణ/ లొట్టిమొద్దు లాయెయెరా... ఓరన్న" – అని మరోపక్క వాపోయాడు.

వెంకన్న రాసిన 'పల్లె కన్నీరు పెడుతుంది' పాట అమితమైన జనాదరణ పొందింది. ప్రపంచీకరణ పల్లెటూళ్లను విధ్వంసం చేసిన తీరును కదిలించే రీతిలో కళ్ళకు కడుతుంది ఈ పాట. కులవృత్తులకు వచ్చిన ముప్పును గురించి నొచ్చుకుంటుంది. వృత్తుల విధ్వంసం పట్ల వెంకన్న ధోరణిని విమర్శించినవారు ఉన్నారు. గ్రామ వ్యవస్థల్లో కులవృత్తులను వైభవీకరించడమంటే కులపీడనను సపోర్ట్ చేయడమే. కులవృత్తులు పోకుండా కుల నిర్మూలన జరగదు. విద్యను సాధనంగా చేసుకుని తరువాతి తరాలను వృత్తుల కబంధ హస్తాల నుంచి కాపాడుకోవాలని అంబేద్కర్ చెప్పిన దానికి ఈ పాటలోని స్పిరిట్ వ్యతిరేకం అని విమర్శకులు అన్నారు. ఈపాట వచ్చిన కొత్తల్లో నేనూ అలాంటి విమర్శను చేశాను. అయితే వెంకన్న ఉద్దేశం వృత్తులు వుండాలని కాదు. తగిన ప్రత్యామ్నాయం లేకుండా వృత్తులు పోతే ఉపాధి పోయినట్లే అనేది తన ఉద్దేశం. అందుకే ముగింపులో ఈ వాక్యాలు: "వృత్తులు కూలే ఉపాధి పాయె/ ప్రత్యామ్నాయ్యం లేకనె పాయె/ కూలిన బతుకులు నిలుపుటకైనా/ కుటీర పరిశ్రమలైన లేవు/ బహుళ జాతి కంపెనీల మాయలోన మాయన్నలారా/ భారత పల్లెలు నలిగిపోయి కుమిలె ఓ అయ్యలారా". ముగింపు ఇలా స్పష్టంగా ఉన్నప్పటికీ ఆ పాటలో కవి నడక ఫ్యూడల్ విలువల దిశగా వెళ్లినట్లే అనిపిస్తుంది.

'ఏకునాదం మోత' నుంచి 'వల్లంకి తాళం' వరకు ఐదు సంపుటాలుగా వెలువడిన వెంకన్న కవిత్వం అచ్చనైన దేశీయ కవిత్వం. లయ, ప్రాసలతో జనం భాషతో, పల్లె గోసతో, మేటి కళతో ఉత్తమ ప్రమాణాల్ని నెలకొల్పిన కవిత్వమిది. దున్న ఇద్దాసు, వేమన, వీరబ్రహ్మం, కృష్ణశాస్త్రి, జాషువాలు పెట్టిన ఒరవడిలో కబీరు, తుకారం లాంటి భక్తి కవుల మార్గంలో సమాకాలీన సమాజాన్నీ ప్రకృతినీ మేళవించి అలికిన పలుకుల వాన వెంకన్న కవిత్వం.

గొప్ప కవులు వాస్తవికతనీ పరిసరాలనీ కవిత్వంగా మలిచే క్రమంలో తమదైన కళా వ్యవస్థను ఏర్పరచుకుంటారు. ఆ వ్యవస్థ నిర్మాణంలోకి వస్తువును తేవటం ద్వారా దాన్ని గ్లోరిఫై చేస్తారు. ఒక కొత్త గ్రామర్‌నీ గ్లామర్‌నీ పరిచయం చేస్తారు. గోరటి వెంకన్న చేసిందదే. అందుకే జనం పల్స్‌ను ఇతరుల కంటే బాగా పట్టుకోగలిగాడు. జనం వినాలనుకునే రీతిలో, వారి ఉద్వేగోల్లాసాలను తాకే విధంగా తనదైన కళా వ్యవస్థను నిర్మించి నిలవగలిగాడు. గెలవగలిగాడు.

(గోరటి వెంకన్న రేపు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోనున్న సందర్భంగా)

■ జి. లక్ష్మీనరసయ్య

ఏమై... ఏమీ కాక...



1.
ఎక్కడెక్కడో వెతికి వచ్చాను
రాత్రి మరగ కాగి దట్టంగా కట్టిన
స్వప్నాల మీగడ పొరలకు ఆ వైపునా ఈ వైపునా
కళ్ళవెనక కీకారణ్యపు కోనకోనల్లోనూ
కలతనిద్ర ఎడారుల ఇసుకతెరల్లోనూ
అలసి సొలసి సొమ్మసిలిన నిద్ర నీరెండలో
ఆ రెండో నీడ నువ్వేనా...

2.
పాట వినబడుతూనే ఎక్కడో ఉసూరుమంటూ
క్రమం తప్పని దినచర్య
కొక్కానికి వేళ్ళాడుతున్న తపన
ప్రాణం పోసుకు సజీవమవుతుంది
పాటతోపాటే సాగిసాగి రెప్పవాలని సముద్రమవుతుంది
సముద్రమే పొట్టి పొట్టి హద్దులు చేరిపేసుకున్నవేళ
అణువణువునా శ్రుతిలయల హోరే

3.
ఆ రోజున స్తబ్ధంగా ఉదయించిన మౌనాన్ని
విసిగించి విసిగించి బేరాలాడిన చూపులు
ప్రశంసల మచ్చుజల్లి వశీకరించిన క్షణాన
కూకటివేళ్ళతో నన్ను పెకలించి వేసి
నీ జీవితాన నాటుకున్నప్పుడు
వేదమై నాదమై భూనభోతలాలమధ్య గానమై
నీ చుట్టూ ఇక సుడిగాలినై...

4.
పైపైన ఎక్కడో చూపానని
నీలి గాలి వయ్యారాల అలల్లోకి
సుళ్ళు తిరిగే దృశ్యాదృశ్య వృత్తాలమై
ఎవరికి తెలుసు ఏమయామో ఏమి కాలేదో...

■ స్వాతీ శ్రీపాద

✆ 82972 48988

గొగోల్‌ని కలిస్తే కథ చెప్పించుకుంటాను

చదువు ముచ్చట

సాలోమోన్ విజయ్ కుమార్



రీసెంట్‌గా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?

అమెరికన్ రచయిత జేమ్స్ ఫ్రే రాసిన 'ది ఫైనల్ టెస్టమెంట్ ఆఫ్ ది హోలీ బైబిల్' అనే నవల ఇటీవల చదివాను. జీసస్ మెస్సయ్యగా వచ్చి పాపులందరికీ తీర్పు చెబుతాడని క్రైస్తవుల నమ్మకం. అయితే ఈ నవలలో జీసస్ మత సంబంధమైన మెస్సయ్యగా కాకుండా నేటి ఆధునిక ప్రపంచం హీనంగా చూసే కొన్ని జన సమూహాలను, నానా రకాల వ్యసనపరులను అర్థం చేసుకొని ఆదరించే మెస్సయ్యగా వస్తాడు. 'ప్రేమ, హాస్య చతురత, సంభోగం, బతుకుని మెరుగు పరుస్తాయి' అంటాడు ఓ చోట రచయిత. వీటన్నిటి వలన ఈ నవల చర్చ్ ఆగ్రహానికి, విమర్శలకు గురయ్యింది. ఐతే మతపు మూసల్ని దాటి జీసస్ ప్రేమ స్వరూపాన్ని, God is love అనే బైబిల్ సందేశాన్ని ఆవిష్కరించే విషయంలో రచయిత కళాత్మక అభివ్యక్తి గొప్పగా ఉంది. అందుకే ఈ నవల బాగా నచ్చింది.

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?

ఆర్మీనియన్ కథల తెలుగు అనువాదం 'కొండగాలి కొత్త జీవితం' ఇంటర్మీడియట్ రోజుల్లో చదివాను. అందులో పిండిమర పనివాడు గెగామ్, మూగ చెవిటి అమ్మాయి తుతీ మధ్య ప్రేమ గురించి రాసిన 'చరమ దశ' అనే కథ నా ఆల్ టైం ఫేవరేట్. 'కడవ భుజానపెట్టి నీటికెళ్లెను పడతి', 'గరుడ పర్వతంపైన', 'ఆకుపచ్చని లోయ', 'గుడ్ మార్నింగ్ జాక్', 'ఒంటెలు వెళ్లిపోతాయి పర్వతాలు ఉండిపోతాయి'... ఇట్లా ఆ సంకలనం లోని కథలన్నీ గొప్పవి. చిన్న పుస్తకమే అయినా ఆర్మీనియా ఆత్మనంతటినీ పొందుపరచిన విశిష్టమైన సంకలనం అది.

మీ నమ్మకాలనూ, దృక్పథాన్నీ ప్రభావితం చేసిన రచయిత?

అలా ఎవరూ లేరు కానీ సత్యం పక్షాన నిలబడిన మంటో, తమవైన మూలాలను తవ్వితీసిన అలెక్స్ హేలీ, చినువా అచెబె, నాలుగే నాలుగు లైన్లలో కథ రాసి ముగించిన హంగేరియన్ రచయిత ఓర్కనీ, తెలుగులో తమ తమ మాండలికాలకు పట్టం కట్టి రాసిన గోరటి వెంకన్న, శిష్టా ఉమామహేశ్వరరావు, నామిని సుబ్రహ్మణ్యం నాయుడు వీళ్లంటే నాకు గౌరవం. వీళ్ల రచనలు నా దృష్టికి విలువైనవి.

సాహిత్యంలో మీకు బాగా నచ్చిన పాత్ర ఏది, ఎందుకు?

జమీల్యా! ఎందుకంటే కుసుమ కోమల కావ్య నాయికల్లాగా తీర్చి దిద్దిన శృంగార దేవత కాదు జమీల్యా. పెళ్లైన వెంటనే యుద్ధంలో మాయమైన భర్త, ఊరిలో పోకిరీల వెకిలి చేష్టలు, ఇంట్లో కఠినమైన సాంప్రదాయాలు, ఎవరితో ఏమీ చెప్పుకోలేని ఒంటరితనం, వీటితోపాటు పగలు రాత్రి తేడా లేకుండా ఎండా వానల్లో వ్యవసాయ క్షేత్రపు గొడ్డు చాకిరీకి అంకితమైన బతుకు. అయితే వీటన్నిటి మధ్యనా పాటలు పరవశాలు కలలు తాదాత్మ్యాలతో కూడిన మనోహరమైన ఆత్మలోకం జమీల్యాది. దనియార్ కూడా తన



వంటి మనస్తత్వం కలవాడేనని గ్రహించాక వాడు బికారి, అవిటివాడు అనేది లెక్కచేయకుండా అతడితో వెళ్లిపోయింది. నవల ఆఖరి పేజీ చివరి అక్షరం వరకూ ఆ ఇద్దరి మధ్యనా కించిత్తు ప్రేమ కలాపం కనపడదు. చదువుతున్న మనల్ని మాత్రం ప్రతి పుటలోనూ ప్రేమ జల్లులు తడుపుతుంటాయి. చిత్రకారుడు కాబోతున్న కుర్రాడి దృక్కోణం నుంచి నవల నడుస్తుంది కనుక రచయిత చింగిజ్ ఐత్మాతోవ్ జమీల్యాని పాఠకుడి గుండెలమీద శాశ్వతమైన రంగులతో చిత్రించాడు.

ఏ గత కాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఏం మాట్లాడతారు?

ఈ ప్రశ్నకు నాకు కలిగే వింతైన ఆలోచనల్లోంచి జవాబు చెబుతాను. మార్క్వెజ్ 'వందేళ్ల ఏకాంతం' నవలలో 'అందాల రెమెడియాస్'తో కలిసి ఆకాశానికి ఎగిరిపోయినట్టు, ఆర్కాదియో శవ యాత్రలో ఆకాశం కురిపించిన పసుపు పూల వానలో తడిసినట్టు అనిపిస్తుంది. చనిపోయిన గొగోల్‌ని కలిసి ఎందుకయ్యా పిచ్చి ముదిరి 'మృత జీవులు' రెండో భాగం ప్రతుల్ని కాల్చేసి మాకు కాకుండా చేశావు, కనీసం వినిపించవా అని అడగాలనుంది. కాఫ్కా గురించి జమ్సా (మెటామార్ఫసిస్ కథలో పురుగుగా మారే వ్యక్తి) నోట వినాలనుంది. మహాశ్వేతాదేవి 'బషాయి టుడు' కోసం అడవుల్లో వెతుకుతున్నట్టు, 'అంటరాని వసంతం' పాత్రలన్నీ కళ్లముందు మెదిలినట్టు, 'మోటర్ సైకిల్ డైరీస్'లో లాటిన్ అమెరికా దేశాలన్నీ తిరుగుతున్నట్టు ఉంటుంది. ఈ అమేజింగ్ అనుభూతులన్నీ ఆయా రచయితలతోనూ వారు సృష్టించిన పాత్రలతోనూ జరుపుతున్న మానసికమైన సంభాషణలే కదా!

రచన విషయంలో మీకు దొరికిన మంచి సలహా?

సాహిత్యం అంటూ నీ జీవితానికి మించినది బైట ఎక్కడో ప్రత్యేకంగా లేదు. నీ అనుభవాలను, నీ తప్పొప్పులను, నువ్వు ప్రేమించేవాళ్ల జీవితాలను నిజాయితీగా నిర్భయంగా రాయగలిగితే అదే గొప్ప సాహిత్యం అవుతుంది అన్నారు ఓసారి కె. శ్రీకాంత్. లోతుగా నాటుకున్న ఆ మాటలే నేనేది రాస్తున్నా గీటురాళ్లుగా పని చేస్తుంటాయి.

✆ 83413 36828

'గరం గరం చాయ్' కథలు

పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో ఆర్.సి. కృష్ణస్వామి రాజు రాసిన ఏభై పొట్టి కథల 'గరం గరం చాయ్' పుస్తక ఆవిష్కరణ అక్టోబర్ 1 సా.4.30కు వేమన విజ్ఞాన కేంద్రం, యశోద నగర్, తిరుపతిలో జరుగనున్నది. ఈ పుస్తకాన్ని ఎం.పి. నరసింహరాజు, ఉపకులపతి, దమ్మ దీప అంతర్జాతీయ బౌద్ధ విశ్వవిద్యాలయం, త్రిపుర ఆవిష్కరిస్తారు. జి. శైలమ్మ, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం సమీక్ష చేస్తారు. ముఖ్య అతిథులు తిరునగరి శరత్ చంద్ర, ఎన్. ధర్మయ్య. వివరాలకు: 93936 62821.

జి.ఎస్.ప్రసాద్

కథలు, కవితల పోటీ

ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం – ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ సౌజన్యంతో, మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ నిర్వహణలో కథలు, కవితల పోటీ జరుగుతుంది. సమకాలీన సామాజిక సమస్యల్ని, ప్రశార్థకమౌతున్న మానవతా విలువల్ని స్పృశిస్తూ కథల్ని, కవితల్ని ఆహ్వానిస్తున్నాం. వీటిని డీటీపీ చేసి గానీ, యూనికోడ్ ఫాంట్‌లో గాని మాత్రమే పంపాలి. రూ.5వేల చొప్పున 8 ఉత్తమ కథలు, వెయ్యి చొప్పున 10 కన్సొలేషన్ కథలు; రూ.2,500ల చొప్పున 8 ఉత్తమ కవితలు, ఐదు వందల చొప్పున 10 కన్సొలేషన్ కవితలను ఎంపిక చేస్తారు. 3 – 5 పేజీలు మించని కథలను, నలభై లైన్లకు మించని కవితలను అక్టోబరు 15లోపు ఈమెయిల్: malleteegasss@gmail.comకు పంపాలి. వివరాలకు: 92464 15150.

కలిమిశ్రీ



సెల్ఫీస్పాట్‌గా బతుకమ్మకుంట

బతుకమ్మకుంట విద్యుత్ ధగధగలతో కాంతులీనుతోంది. ప్రభుత్వం కృషితో పూర్వ వైభవం సంతరించుకుంది. సెల్ఫీలు దిగుతూ సందర్శకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు.



దుకాణంలోకి వచ్చిన బురదను తొలగించేందుకు శ్రమిస్తున్న సిబ్బంది



మూసానగర్‌లో వరదలో మునిగిన ఇళ్లలోని వస్తువులను పారేస్తున్న ప్రజలు

వరద తగ్గింది.. బురద మిగిలింది

మూసీ ముంపు ప్రాంతాల్లో పరిస్థితులు అధ్వానం

- బురద, చెత్తా చెదారం తొలగింపు పట్టని ప్రభుత్వ విభాగాలు
- సర్వం కోల్పోయిన బాధితులు
- పలు చోట్ల భోజనం, అల్పాహారం అందజేత

హైదరాబాద్ సిటీ/చాదర్‌ఘాట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మూసీ ముంపు ప్రాంతాలు మురికి కూపంగా మారాయి. వరద ప్రవాహం పెరగడంతో చేతికందిన వస్తువులు తీసుకొని బయటపడిన బాధితుల్లో కొందరు వరద తగ్గిన చోట ఇళ్లకు వస్తున్నారు. నది గర్భంలో ఉన్న గుడిసెలు, రేకుల ఇళ్లే కాదు.. పలు కాలనీలు, బస్తీల్లో పక్కా గృహాల్లోకీ ఐదారు అడుగుల ఎత్తులో నీరు వచ్చింది. ఆ నివాసాల్లో బురద, చెత్తా చెదారం పేరుకుపోయింది. నిత్యావసర, ఇతర వస్తువులు పూర్తిగా పాడయ్యాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో కుటుంబాలు ఆకలితో అల్లాడాయి. వరద మిగిల్చిన నష్టం చూసి కొందరు బోరున విలపించారు. పలుచోట్ల జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో అల్పాహారం, భోజనం, పాలు, బిస్కెట్లు అందజేశారు. గ్రేటర్‌లో వెలువడే మురుగంతా మూసీలోనే కలుస్తోంది. ఈ క్రమంలో వరదతోపాటు

మిగతా 6వ పేజీలో..



చాదర్‌ఘాట్ బ్రిడ్జిపై చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

పట్టించుకోని ప్రభుత్వ విభాగాలు

వరద ఉన్నంత వరకూ జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, పోలీసులు, హైడ్రా తదితర విభాగాల అధికారులు బస్తీల్లోనే ఉన్నారు. ముంపు తగ్గడంతో వారంతా వెళ్లిపోయారు. రోడ్లు, ఇళ్లలో బురద, చెత్తా చెదారం తొలగింపును పట్టించుకునే వారు లేరు. స్థానిక ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేస్తే కానీ బల్దియా, వాటర్‌బోర్డు అధికారులు స్పందించలేదని మూసానగర్ వాసి ఒకరు పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో బురద, చెత్త తొలగించి నీటితో రోడ్డును శుభ్రం చేశారు.



సమతా కాలనీలో బాకీ కార్డులను పంచుతున్న కేటీఆర్

కాంగ్రెస్ మోసాలను బాకీ కార్డులతో
ఎండగడతాం

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను, ప్రజలకు పడ్డ బకాయిలను బాకీ కార్డు ఉద్యమంతో ఎండగడతామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. ఆదివారం షేక్‌పేట డివిజన్‌లోని సమతా కాలనీలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బీఆర్‌ఎస్ మైనారిటీ నేతలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ 'కాంగ్రెస్ బకాయి కార్డు'లను ప్రజలకు అందజేసి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించాలన్నారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ 700 రోజులైనా ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. ఆడబిడ్డలకు

మిగతా 6వ పేజీలో..



బి.శ్రేయ



ఐశ్వర్య

ఎన్నాళ్లో వేచిన ఉదయం

గ్రూప్-1లో విజయంపై అభ్యర్థుల ఆనందం

చాంద్రాయణగుట్ట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1లో విజయం సాధించి ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక కావడంపై నగరానికి చెందిన అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు. సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని చాంద్రాయణగుట్టకు చెందిన టీపీసీసీ కార్యదర్శి బి.వెంకటేశ్ ముదిరాజ్, వందన కుమార్తె బి.ఐశ్వర్య అన్నారు. టీజీపీఎస్సీ గ్రూప్-1లో 246వ ర్యాంక్ సాధించి ఆమె డీఎస్పీగా ఎంపికయ్యారు. సివిల్స్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ గ్రూప్-1 సాధించారు.

డిప్యూటీ కలెక్టర్‌గా రంజిత్‌రెడ్డి

దుండిగల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ కావాలన్నది తన లక్ష్యమని రైతు వెంకట్‌రెడ్డి, విజయ దంపతుల కుమారుడు అక్కినపల్లి రంజిత్‌రెడ్డి

మిగతా 8వ పేజీలో..



నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడిగా
మంత్రి శ్రీధర్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నిక

గోషామహల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడిగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం రాత్రి ఎగ్జిబిషన్ సొసైటీకి నూతన కార్యావర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ సెక్రటరీ బీఎన్ రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు ఆర్.సుఖేష్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ టి.చంద్రశేఖర్ మాట్లాడుతూ 1938లో సొసైటీ ప్రారంభమైందని తెలిపారు. అప్పటి నుంచి అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చిన ఆదాయంతో 20 విద్యా సంస్థలను నిర్వహిస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు.



జయహో.. భారత్

ఆసియా కప్ టి20 క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై భారత్ విజయం సాధించడంతో నగరంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం రాత్రి అభిమానులు సచివాలయం వద్ద చేరి జాతీయ జెండా చేతబట్టి కేరింతలు కొడుతూ, బాణసంచా కాలుస్తూ జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు.



కొత్త పోలీస్ బాసులు

నేడు బాధ్యతలు స్వీకరించనున్న పలువురు అధికారులు 6



బెంగాలీ సంస్కృతి ఆదర్శం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ 6

గ్రూప్-1 నిర్వహణలో టీజీపీఎస్సీ ఫెయిల్

అవకతవకలు, అవినీతిపై సీబీఐతో విచారణ

గ్రూప్-1 అభ్యర్థులు, నిరుద్యోగుల డిమాండ్ 6



శుభకార్యానికి పిలవలేదని వివాదం..

తమ్ముడిని హత్య చేసిన అన్న



చంపాపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి పిలవలేదనే విషయంలో మొదలైన వివాదం ఒకరి హత్యకు దారితీసింది. ఈ సంఘటన హఫీజ్‌బాబానగర్‌లో జరిగింది. కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ ముక్తార్(34) హఫీజ్‌బాబానగర్-సి బ్లాక్‌లో నివసిస్తూ పత్తర్‌గట్టిలో ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. ఇటీవల అతడి సోదరుడు షేక్ ఈషా(38) ఇంట్లో శుభ కార్యం జరగగా ముక్తార్‌ను పిలవలేదు. ఈ విషయమై ముక్తార్ శనివారం రాత్రి తల్లితో గొడవపడుతుండగా ఈషా కత్తితో అతడి కడుపులో పొడిచి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ముక్తార్ మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఐయిషా సిద్దిఖీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సొం'టూర్'కు పయనం

ప్రయాణికులతో రద్దీగా పలు బస్టాండ్‌లు

తగినన్ని బస్సులు లేకపోవడంతో పడిగాపులు 6



రన్‌లో పాల్గొన్న ప్రజలు

రన్‌లో యువతి ఆనందం

సాగర్ పరిసరాలు పింక్ మయం

సందడిగా రన్

ఖైరతాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ స్ట్రైడ్ అండ్ షైన్ నినాదంతో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, సుధారెడ్డి ఫౌండేషన్‌ల సంయుక్తాధ్వర్యంలో 10కే, 5కే, 3కే విభాగాల్లో ఆదివారం నిర్వహించిన పింక్ రన్ సందడిగా సాగింది. 'సాగర్ పరిసరాలు పింక్ మయంగా మారాయి. మిస్ వరల్డ్ 2025 ఒపెల్ సుచేత, మిస్ ఆసియా కృష్ణహ్, పలు దేశాల అందగత్తెలతో పాటు ప్రముఖ ప్రపంచ స్థాయి టెన్నిస్ క్రీడాకారుడు లియాండర్ పేస్, ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం, ఐఏఎస్ సీనియర్ అధికారి జయేష్ రంజన్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, ఐపీఎస్ అధికారి తరుణ్ జోషి, వృద్ధులు, యువత, చిన్నారులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు. మిస్ వరల్డ్ పోటీల చైర్ పర్సన్ జూలియా, నిర్వాహక సంస్థల అధిపతులు పీవీ కృష్ణారెడ్డి, సుధారెడ్డి అతిథులతో కలిసి జెండా ఊపి రన్‌లను ప్రారంభించారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ ఇలాంటి రన్‌ను నిర్వహించడం శుభపరిణామమని ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు లియాండర్ పేస్ అన్నారు. సంతోషంగా ఉండాలంటే నిత్యం వ్యాయామం, రన్, వాకింగ్ చేయాలన్నారు ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం. వచ్చే సంవత్సరం హైదరాబాద్ రన్ నిర్వహిస్తామని నిర్వాహకులు

మిగతా 6వ పేజీలో..

17 % తగ్గిన క్రైమ్ రేట్

నేర నియంత్రణకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం
వార్షిక నివేదిక వెల్లడించిన సీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేర నియంత్రణకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. గత ఏడాది సెప్టెంబరులో రెండోసారి హైదరాబాద్ నగర సీపీగా బాధ్యతలు స్వీరించిన ఆయన సరిగ్గా ఏడాది తర్వాత బదిలీ అయ్యారు. ఆనంద్‌ను హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో గతేడాది సెప్టెంబరు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు హైదరాబాద్ సిటీ వార్షిక నేర నివేదికను సీపీ ఆదివారం విడుదల చేశారు. 2023 సెప్టెంబరు నుంచి 2024 ఆగస్టుతో పోల్చితే 2024 సెప్టెంబరు నుంచి 2025 ఆగస్టు వరకు సిటీ కమిషనరేట్‌లో క్రైమ్ రేటును 17 శాతం తగ్గించామని తెలిపారు. గతేడాదిలో 38,206 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 31,533 కేసులు నమోదయ్యాయన్నారు. వరకట్న వేధింపులు, హత్యలు 18 శాతం పెరిగినట్లు వెల్లడించారు. సైబర్ నేరాలు 14 శాతం తగ్గాయన్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది దొంగతనాలు, దోపిడీలు 26 శాతం తగ్గినట్లు సీపీ వెల్లడించారు. 55 శాతం సొత్తు రికవరీ చేశామన్నారు.



సిటీ కమిషనరేట్ ఉన్నతాధికారులతో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్

మెట్రో ఫ్యూచర్ ముందుకు..



గ్రీన్‌ఫీల్డ్ నమూనా

పార్ట్-బీ డీపీఆర్‌లోని ముఖ్యాంశాలు

కారిడార్	కిలోమీటర్లు	అంచనా వ్యయం (సుమారు)	స్టేషన్ల సంఖ్య
జేబీఎస్-మేడ్చల్	24.5	5,571.00 కోట్లు	18
జేబీఎస్-శామీర్‌పేట్	22.0	5002.58 కోట్లు	14
ఎయిర్‌పోర్టు-ఫ్యూచర్‌సిటీ	40	9004.64 కోట్లు	16

- వడివడిగా అడుగులు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- 'ఎఫ్‌సీడీఏ' ఆఫీసుకు శంకుస్థాపన చేయడంతో పనులపై ఆసక్తి
- పార్ట్-బీలోని మూడు కారిడార్ల డీపీఆర్ ఆమోదంపై కాంగ్రెస్ సర్కార్ దృష్టి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ మెట్రో కారిడార్ ముందుకుసాగుతోంది. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మిస్తున్న ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయానికి రంగారెడ్డి జిల్లా కందుకూరులోని మీర్‌ఖాన్‌పేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేయడంతో మెట్రో పనులపై ఆసక్తి నెలకొంది. ఎఫ్‌సీడీఏ ఆఫీస్‌ను త్వరగా నిర్మించడంతోపాటు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రతిపాదించిన కారిడార్‌ను కూడా పూర్తి చేయాలనే పట్టుదలతో కాంగ్రెస్ సర్కారు అడుగులు వేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. మెట్రో రెండోదశ విస్తరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 8 కారిడార్లను చేపడుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పార్ట్-ఏ కింద ప్రతిపాదించిన 5 కారిడార్లలోని 76.4 కిలోమీటర్లకు రూ.24,269 కోట్లు, పార్ట్-బీ కింద ప్రతిపాదించిన 3 కారిడార్లలోని 86.5 కిలోమీటర్లకు రూ.19,578.22 కోట్లు కేటాయించింది. మొత్తం ప్రాజెక్టును 50 : 50 జాయింట్ వెంచర్(జేవీ)గా చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ క్రమంలో పార్ట్-ఏకు సంబంధించిన డీపీఆర్ అనుమతి కోసం గతేడాది నవంబరు 4న కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. డీపీఆర్ తుదిదశ పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది.

పార్ట్-బీలో మొత్తం 86.1 కిలోమీటర్లు

వాస్తవంగా పార్ట్-ఏ కిందనే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను

మిగతా 8వ పేజీలో..

సౌం'టూర్'కు పయనం

ప్రయాణికులతో రద్దీగా పలు బస్టాండ్‌లు
తగినన్ని బస్సులు లేకపోవడంతో పడిగాపులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండగలకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో బస్టాండ్లు రద్దీగా మారాయి. జేబీఎస్, ఉప్పల్ బస్టాండ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్ ప్రాంతాల నుంచి ఆర్టీసీ రెగ్యులర్ సర్వీసులతో పాటు జిల్లాలకు ప్రత్యేక బస్సులు నడిపింది. ఆదివారం ఉదయం జూబ్లీబస్టాండ్‌లో రద్దీకి అనుగుణంగా కరీంనగర్ మార్గంలో ఎక్స్‌ప్రెస్ బస్సులు లేకపోవడంతో పెద్దసంఖ్యలో మహిళా ప్రయాణికులు గంటన్నరకు పైగా బస్సుల కోసం పడిగాపులు కాశారు. మెట్రోడీలక్స్, సూపర్‌లగ్జరీ బస్సుల్లో మహిళలకు ఉచితప్రయాణం లేకపోవడంతో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు పెంచాలని డిమాండ్ చేశారు. పండగ పేరుతో నడుపుతున్న ప్రత్యేక సర్వీసుల్లో 50 శాతం అధిక చార్జీలు వసూలు చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. రద్దీకి తగినట్లు బస్సులు నడుపుతున్నామని అధికారులు చెబుతున్నా పలు జిల్లాలకు తగినన్ని బస్సులు లేవంటున్నారు.


జేబీఎస్‌లో బస్సులకోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

శివార్లనుంచి జిల్లాలకు సర్వీసులు

ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ఆర్టీసీ ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, కేపీహెచ్‌బీ, సంతోష్‌నగర్ ప్రాంతాల్లో ప్రయాణికుల కోసం షామియానాలు, కుర్చీలు, తాగునీరు సౌకర్యాలు ఏర్పాటు చేసింది. దసరా స్పెషల్ సర్వీసుల వివరాలకు టీజీఎస్ ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించవచ్చన్నారు. పండగ రద్దీని దృష్టిలో పెట్టుకొని కొంతమంది ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు చార్జీలు పెంచారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

3న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 'అలయ్ బలయ్'


మాట్లాడుతున్న బండారు విజయలక్ష్మి

అమీర్‌పేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అక్టోబర్ 3న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి వెల్లడించారు. ఆదివారం అమీర్‌పేటలోని హోటల్ ఆదిత్యా పార్క్‌లో ఫౌండేషన్ సభ్యులతో కలిసి విజయలక్ష్మి వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమ వేడుకలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరవనున్నారని, ఆయనతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, తదితరులకు ఆహ్వానం పంపామని వెల్లడించారు.

జాతీయ హ్యాండ్‌బాల్ ఫైనల్లో తెలంగాణ


నిజాం కళాశాలలో పోటీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ మినీ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్లు ఫైనల్ చేరాయి. ఆదివారం నిజాం కళాశాలలో జరిగిన బాలికల సెమీస్‌లో తెలంగాణ జట్టు 17-11తో తమిళనాడుపై, బాలుర సెమీస్‌లో తెలంగాణ జట్టు 19-5తో ఉత్తరాఖండ్‌పై గెలుపొందాయి. సోమవారం జరిగే ఫైనల్‌లో హరియాణాతో తెలంగాణ బాలికల జట్టు, ఢిల్లీతో తెలంగాణ బాలుర జట్టు తలపడనున్నాయి. సెమీస్‌లో నెగ్గిన తెలంగాణ జట్లను జాతీయ హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి ప్రీత్‌పాల్ సింగ్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడు మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్యదర్శి పవన్ అభినందించారు.

టీడీసీఏకు గుర్తింపు ఇవ్వండి

● బీసీసీఐ పెద్దలకు వెంకటేశ్వర్ రెడ్డి వినతి


జైషాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న వెంకటేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ)కు గుర్తింపు ఇవ్వాలని బీసీసీఐ పెద్దలను టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. ఆదివారం ఐసీసీ చైర్మన్ జైషా, బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్‌ను వెంకటేశ్వర్ రెడ్డి కలిసి వినతి పత్రాన్ని అందించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అవినీతిలో కూరుకుపోయిందని, మాజీ క్రికెటర్లు శివ్‌లాల్ యాదవ్, అర్షద్ అయూబ్‌తో సహా 42 మంది హెచ్‌సీఏ కార్యవర్గ సభ్యులపై ఏసీబీ, సీబీఐ కేసులు ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. హెచ్‌సీఏలో వందల కోట్ల అవినీతి జరిగిందని, హెచ్‌సీఏ ప్రతినిధులకు డబ్బుపై తప్ప క్రికెట్ అభివృద్ధిపై శ్రద్ధ లేదని తెలిపారు. హైదరాబాద్‌ను మినహాయించి మిగిలిన 32 జిల్లాల క్రికెటర్ల కోసం తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘానికి గుర్తింపు ఇవ్వాలని కోరారు.



ఇందిరమ్మ క్యాంటీన్

నగరంలో నేడు రెండు ఇందిరమ్మ క్యాంటీన్‌లు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పేదలు, కార్మికులు, ఆటో డ్రైవర్లు, విద్యార్థుల భోజన భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా సోమవారం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కొత్త ఇందిరమ్మ క్యాంటీన్‌లు ప్రారంభం కానున్నాయి. మోతీనగర్, ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌ల వద్ద ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లను మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మేయర్ గద్వాల విజయలక్ష్మి ప్రారంభించనున్నారు. భోజనం రూ. 5 లకే అందించే ఇందిరమ్మ క్యాంటీన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలో ఇప్పటికే 150 నడుస్తుండగా రోజుకు సగటున 30 వేల మంది లబ్ది పొందుతున్నారు. మరో రెండు కొత్త క్యాంటీన్‌లను సోమవారం ప్రారంభించనున్నారు.

ప్రమాదవశాత్తూ టవర్ పైనుంచి పడి వ్యక్తి మృతి

హైదర్‌నగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడి టవర్ మెయింటెనెన్స్ కార్మికుడు మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పశ్చిమబెంగాల్‌కు చెందిన సాగర్ మండల్ (29) కుషాయిగూడలో ఉంటూ మూర్తి అనే కాంట్రాక్టర్ వద్ద టవర్ మెయింటెనెన్స్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా కేపీహెచ్‌బీ సర్దార్‌పటేల్‌నగర్‌లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తూ టవర్ పైనుంచి కిందపడిపోయాడు. గమనించిన కార్మికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మరణించాడని చెప్పారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే సాగర్ మండల్ మృతిచెందాడని అతడి స్నేహితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కేపీహెచ్‌బీ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

వరద తగ్గింది.. బురద మిగిలింది

(5వ పేజీ తరువాయి)

మురుగు నీరూ చేరడంతో ముంపు ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. చాదర్‌ఘాట్‌లోని శంకర్‌నగర్, మూసా నగర్, రసూల్‌పుర, వినాయక వీధి, అంబర్‌పేటలోని దుర్గానగర్, లంక తదితర ప్రాంతాల్లోని ఇళ్లలో భారీగా బురద పేరుకుపోయింది. రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. రోడ్లపై ఒకటి, రెండు అడుగుల మేర బురద ఉంది. వరద తగ్గడంతో ఇళ్లలోకి వస్తోన్న ముంపు బాధితులు బురద నుంచి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వయోధికుల బాధలు వర్ణనాతీతం.

బ్రిడ్జిలపై రాకపోకలు బంద్

వరద ప్రవాహం తగ్గినా చాదర్‌ఘాట్ కాజ్ వే బ్రిడ్జి, ముసారాంబాగ్ బ్రిడ్జిలను మూసి ఉంచారు. వరద ప్రవాహనికి కొట్టుకొచ్చిన చెత్తాచెదారం, బ్రిడ్జిలకిరువైపులా పేరుకుపోయిన బురదను తొలగించాల్సి ఉంది. దీంతో వాహనాల రాకపోకలను అనుమతించడం లేదు. బ్రిడ్జిలకు రెండు వైపులా ఫెన్సింగ్ కొట్టుకుపోవడంతో పనులు జరుగుతున్నాయి.

ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ వాయిదా వేయాలి: వీహెచ్‌పీ


మాట్లాడుతున్న రావినూతల శశిధర్

మంగళ్‌హాట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 29న జరగబోయే ఎన్నికల నిర్వహణ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) డిమాండ్ చేసింది. ఆదివారం గోషామహల్‌లో విలేకరుల సమావేశంలో వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి డా.రావినూతల శశిధర్, రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ మహిళలకు ఎంతో ఇష్టమైనదన్నారు. సద్దుల బతుకమ్మ సెప్టెంబరు 30న ఉన్నా.. ఈ ఏడాది అనేక ప్రాంతాల్లో 29, 30 తేదీల్లో వేడుకలు జరుగుతున్నాయన్నారు. మహిళలు ఊళ్లకు వెళ్లి సంప్రదాయంగా పాల్గొంటారని, ఇలాంటి సందర్భంలో శిక్షణ వల్ల అనేక మంది మహిళా ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. కావున 29వ తేదీన శిక్షణను రద్దు చేసి మరొక తేదీకి వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరుతున్నామన్నారు.

ఫలక్‌నుమా రైలులో విద్యార్థి మృతి


మహ్మద్ ఆలాం అన్సారీ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైలులో ప్రయాణం చేస్తున్న ఓ విద్యార్థి అనారోగ్యంతో మరణించాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి వివరాల ప్రకారం.. జార్ఖండ్ సహేబ్‌గంజ్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఆలాం అన్సారీ (27) హౌరా నుంచి సికింద్రాబాద్‌కు ఫలక్‌నుమాలో ప్రయాణిస్తుండగా మృతిచెందాడు. ఆదివారం స్టేషన్‌కు చేరుకున్న రైలులో నిద్రలో ఉన్నాడని భావించిన రైల్వే టీటీ నిద్ర లేపేందుకు ప్రయత్నించగా చనిపోయి ఉన్నాడు. వెంటనే జీఆర్‌పీ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భారీ వరదల కారణంగా పలు రైళ్లు రద్దు

హైదరాబాద్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పొంగి ప్రవహిస్తున్న వరద ప్రవాహంతో పలు చోట్ల రైల్వే ట్రాక్‌లు దెబ్బతినడంతో కొన్ని రైళ్లను రద్దు చేయగా మరికొన్నింటిని దారిమళ్లించి నడుపుతున్నట్టు దక్షిణ మధ్యరైల్వే అధికారులు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలియజేశారు. నాందేడ్ డివిజన్‌లో గంగాఖేర్-వాడ్గావ్‌నీలా సెక్షన్‌లో పూర్ణా-హైదరాబాద్, పండర్‌పూర్-నిజామాబాద్, హైదరాబాద్-పూణె, పర్లి- పూణే రైళ్లను ఆదివారం రద్దు చేసినట్టు తెలిపారు. ఆదిలాబాద్-పర్లి, అకోలా- పర్లి రైళ్లు పాక్షికంగా రద్దు కాగా, నాందేడ్-పన్వెల్, ఔరంగాబాద్- గుంటూరు, సాయినగర్ శిరిడీ- సికింద్రాబాద్, నాగపూర్-కొత్తపూర్, కాకినాడ పోర్టు - సాయినగర్ శిరిడీ ,అమరావతి-పూణే రైళ్లను దారి మళ్లించి నడిపినట్టు రైల్వే అధికారులు పేర్కొన్నారు. సోమవారం పూణే- హైదరాబాద్ దక్కన్ (నాంపల్లి) రైలు (17648)ను రద్దు చేసినట్టు అధికారులు వివరించారు.

జర్నలిస్టు కుటుంబాలకు నేడు చెక్కుల పంపిణీ

హైదరాబాద్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమనిధి నుండి18మంది జర్నలిస్టు కుటుంబాలకు సోమవారం పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి, స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయనున్నట్టు తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు తెలిపారు. అనారోగ్యం, ప్రమాదాలకు గురైన ఏడుగురు జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించనున్నట్టు వివరించారు. 'జర్నలిస్టుల సంక్షేమం-ప్రజా ప్రభుత్వప్రాధాన్యం' పేరిట రాష్ట్ర ప్రభుత్వం చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు, పనిచేయలేని, నిస్సహాయస్థితిలో ఉన్న జర్నలిస్టులకు, జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి వచ్చిన వడ్డీ మొత్తాన్ని ఆర్థికసాయంగా అందించ నున్నట్టు తెలిపారు. నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ సి.హెచ్.ప్రియాంక, జర్నలిస్టు నాయకులు పాల్గొంటారని తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

నందిగామ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడుకోవడానికి విరివిగా చెట్లను నాటి పరిరక్షించాలని, ఈ విషయంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ చేస్తున్న కృషి మరువలేనిదని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలపరిధిలోని కన్హా శాంతివనంలో రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గ్లోబల్ అధ్యక్షుడు, గురూజీ కమలేష్ పటేల్ జన్మదిన వేడుకలను కన్హాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

కాంగ్రెస్ మోసాలను బాకీ కార్డులతో ఎండగడతాం

(5వ పేజీ తరువాయి)

రూ. 2,500 ఇస్తామని చెప్పి ఒక్కో మహిళకు రూ. 55,000, వృద్ధులకు రూ.4000 పెన్షన్ ఇవ్వకుండా ఒక్కొక్కరికి రూ. 44,000 బాకీ ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు స్కూటీ ఇవ్వకుండా రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మోసాలన్నింటినీ గుర్తుచేయడానికే 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఉద్యమాన్ని ప్రారంభించామని తెలిపారు. బీఆర్‌ఎస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభ్యర్థి మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను గెలిపించాలని ఆయన కోరారు. 'ప్రజెంట్ సిటీ' వరదలతో మునుగుతూ, దోమలతో జనం ఇబ్బందులు పడుతుంటే, 'ఫ్యూచర్ సిటీ' కడతానని సీఎం రేవంత్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. జనం లేని ఫ్యూచర్ సిటీకి మెట్రో వేస్తాననడం రేవంత్‌రెడ్డి చావు తెలివితేటలకు నిదర్శనమని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ షేక్‌పేట డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగర్ పరిసరాలు పింక్ మయం


పింక్ రన్‌లో పాల్గొన్న కలెక్టర్ హరిచందన

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. పింక్ రన్‌ను వచ్చే ఏడాది నుంచి ఖండాంతరాలకు విస్తరిస్తామన్నారు సుధారెడ్డి.

విజేతలకు నగదు బహుమతులు

10కే విభాగంలో అంకిత్‌గుప్తా మొదటి స్థానం సాధించగా, రెండు, మూడు స్థానాల్లో కమలాకర్ దేశ్‌ముఖ్, శుభం సింధు నిలిచారు. మహిళల విభాగంలో సీమ, భారతి నైనా, సోనికాలు తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ప్రథమ బహుమతికి మూడున్నర లక్షల రూపాయలు, రెండో స్థానంలో నిలిచిన వారికి రెండున్నర లక్షల రూపాయలు, మూడో స్థానంలో నిలిచిన వారికి లక్షన్నర రూపాయలతోపాటు ట్రోఫీలు అందజేశారు. ఐదు కిలోమీటర్ల మారథాన్‌లో మొదటి, రెండు, మూడవ బహుమతి విజేతలకు రెండున్నర లక్షలు, లక్షన్నర, లక్ష రూపాయల నగదు బహుమతులు అందజేశారు.

బీసీ-ఏకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాగయ్య

బర్కత్‌పుర, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బీసీ-ఏ గ్రూప్‌నకు 12శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ బీసీ(ఏ) కులాల హక్కుల పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. బీసీ ఏ గ్రూప్‌లో ప్రస్తుతం 73కులాలు ఉన్నాయని, కేవలం 7శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలు చేస్తున్నారని, ఈ రిజర్వేషన్ల శాతాన్ని పెంచితేనే అన్ని కులాలకు న్యాయం జరుగుతోందన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు ప్రొఫెసర్ ఎం.బాగయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎస్.నరహరి, గౌరవ అధ్యక్షుడు గడప శ్రీహరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బయ్యా సాంబమూర్తి, కోశాధికారి అంబటి సుధాకర్, అధికార ప్రతినిధి కంటె రాంచందర్, లీగల్ అడ్వయిజర్ రామానందస్వామి తదితరులు మాట్లాడారు. ఆంధ్రాకు చెందిన 26 బీసీ కులాలను బీసీ జాబితాలో చేర్చవద్దని గత ప్రభుత్వం ఈ కులాలను బీసీ జాబితా నుంచి తొలగించిందన్నారు. స్థానికేతరులను బీసీ ఏ గ్రూప్‌లో చేర్చవద్దన్నారు. బీసీ ఏ గ్రూప్‌లో ప్రస్తుతం 73 కులాలు ఉండగా బీసీ బీ గ్రూప్‌లో 24, డీ గ్రూప్‌లో 37, ఈ గ్రూప్‌లో 14 కులాలు ఉన్నాయన్నారు. మొత్తం 148 కులాలు ఉన్నాయని తెలిపారు. బీసీ ఏ గ్రూప్‌లో 73 కులాలు ఉండడంవల్ల రిజర్వేషన్ల శాతాన్ని పెంచి న్యాయం చేయాలని వారు కోరారు. సమగ్ర కులగణన చేపట్టి రిపోర్టును విడుదల చేయాలని, దాని ఆధారంగా రిజర్వేషన్లలో మార్పులు చేయాలని వారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో 9 జారీ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవద్దు



మాట్లాడుతున్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు కుమారస్వామి

బర్కత్‌పుర, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో కల్పించిన 42 శాతం రిజర్వేషన్లను ఎవరూ అడ్డుకోవద్దని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి కోరారు. అడ్డుకున్న వారి కుట్రల వెనుక శక్తులకు ఓటుతో బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ మేదర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కేపీ మురళీకృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు అందాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం జీవో 9 జారీ చేసిందని, దీనిపై కొందరు కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్ల బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండడం ఈ రిజర్వేషన్లను అడ్డుకోవాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. రాజ్యాంగంలోని 243 డీ(6) 243 టీ(6) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి రిజర్వేషన్లు పెంచే హక్కు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం బీసీల ఆర్థిక, సామాజిక, రాజకీయ ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తోందన్నారు.

పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

బర్కత్‌పుర, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కల్పించిన 42 శాతం బీసీ రిజర్వేషన్లపై రెడ్డి జాగృతి పిటిషన్ బేషరతుగా ఉపసంహరించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు అడ్డుకునే కుట్రలను రెడ్డి సమాజం సహకరించవద్దన్నారు. ఆదివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే రెడ్డి జాగృతి నాయకులు పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, వెంకన్న, డేగల రమా, యమునారాణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతులకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న నరేందర్, శ్రీనివాస్

బర్కత్‌పుర, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జనాభా దామాషా ప్రకారం సంచార జాతి కులాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 10శాతం రిజర్వేషన్స్ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్ మాట్లాడుతూ.. విద్యా, ఉద్యోగాలు, రాజకీయాల్లో అవకాశం కల్పించాలని, సంచార జాతులను మోసం చేస్తే ఊరుకోమని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు పూర్తయినా రాష్ట్రంలో సంచార జాతి కులాలకు రాజకీయ రిజర్వేషన్స్ లేక పదవులు అందకుండా అన్యాయానికి గురవుతున్నామన్నారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ తిపిరిశెట్టి, ప్రధాన కార్యదర్శి సింగజోగి శ్రీనివాస్, కోశాధికారి సిద్దుల రవీందర్, ఉపాధ్యక్షులు పస్నీరు నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు కోట అనిత పాల్గొన్నారు.

బాలీవుడ్‌లో మెరిసిన గొప్ప నటుడు పైడి జయరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏనుగు నరసింహారెడ్డి

రవీంద్రభారతి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బాలీవుడ్‌లో మెరిసిన గొప్ప నటుడు పైడి జయరాజ్ అని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం పైడి జయరాజ్ జయంతి సందర్భంగా రవీంద్రభారతి ప్రివ్యూ థియేటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నరసింహా రెడ్డి మాట్లాడుతూ, హిందీ చిత్రపరిశ్రమలో మంచి నటుడిగా పేరు సంపాదించారన్నారు. తెలంగాణకు చెందిన మహానటుల్లో పైడి జయరాజ్ ఒకరని అన్నారు. కార్యక్రమంలో కాసారం రమేష్, ఆకుల రవీందర్, శ్రీనివాస్, సుధీర్, మల్లం రమేష్, డా.విజయ్ కుమార్, పి.నర్సింహులు, ఖాజా పాషా, తదితరులు పాల్గొన్నారు.

తిరునగరి దేవకీదేవి 'బతుకమ్మ' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కుటుంబ సంబంధాలను ప్రతిబింబిస్తూ బతుకమ్మ పేరిట పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమని ప్రముఖ కవి, రచయిత దేశపతి శ్రీనివాస్ అన్నారు. ప్రముఖ రచయిత్రి తిరునగరి దేవకీదేవి రచించిన కుటుంబ సంబంధ గేయ సంకలనం బతుకమ్మ పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దేవపతి శ్రీనివాస్ బతుకమ్మ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ, చక్కటి గేయాలతో బతుకమ్మ పుస్తకం రచించారని కొనియాడారు. కుటుంబ సంబంధాలను చక్కగా వివరించారున్నారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త సంగిశెట్టి శ్రీనివాస్, ప్రముఖ రచయిత్రి జూపాకసుభద్ర, ఉడయవర్లు, పైడిమర్రి గిరిజ, గణపురం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



హైదర్‌గూడ పోచమ్మ ఆలయంలో జరిగిన పూజలో పాల్గొన్న బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, నాయకులు



రాజేంద్రనగర్ శాంతినగర్‌లో కొలువుదీరిన దుర్గాదేవి పూజలో పాల్గొన్న బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, తదితరులు



యాఖుత్ పురాలోని చంద్రానగర్ మైసమ్మ ఆలయంలో నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమార్చన పూజలో పాల్గొన్న మహిళలు

దుర్గమ్మా.. కరుణించు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజేంద్రనగర్, చార్మినార్, చాంద్రాయణ గుట్ట, ఆబిడ్స్, మంగళ్‌హాట్, గోషామహల్ తదితర డివిజన్లలోని మండపాల్లో కొలువుదీరిన దుర్గాదేవి ఆదివారం వివిధ అలంకరణలో పూజలందుకొన్నారు. మండపాల నిర్వాహకులు, ప్రజా ప్రతినిధులు, భక్తులు దుర్గాదేవికి పూజలు చేసి నైవేద్యాలు స్పర్పించారు. అనంతరం భక్తులకు అనప్రసాదం పంపిణీ చేశారు.

- అబిడ్స్, చార్మినార్ జోన్ బృందం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి)



ఉస్మాన్‌గంజ్ భాగ్యనగర్ సేవా సమితి (బాస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి పూజలు చేస్తున్న అధ్యక్షుడు మేడిశెట్టి రాకేశ్, ప్రధాన కార్యదర్శి భద్రేశ్వర్, కోశాధికారి సీఏ అనిల్‌నాయర్, విజయభాస్కర్, విజయేందర్ రెడ్డి, రాజు



మీర్ ఆలం మండి మహాకాళేశ్వర ఆలయంలో ఆదివారం మహాచండీ దేవి అలంకరణలో అమ్మవారు



జంగమ్మెట్ జై దుర్గా అసోసియేషన్ ఏర్పాటు చేసిన అమ్మవారికి పూజలు చేస్తున్న టీపీసీసీ సంయుక్త కార్యదర్శి పర్వతాల రాజేందర్ తదితరులు



కోటి నల్లపోచమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, కమిటీ నిర్వాహకులు



ఇసామియా బజార్‌లోని కనకదుర్గాదేవికి జరిగిన పూజలో పాల్గొన్న కాంగ్రెస్ గోషామహల్ నియోజకవర్గ నాయకుడు సంతోష్ గుప్తా, ఆలయ కమిటీ నిర్వాహకులు



సామాజిక వేత్త జగదీష్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన మాతా విశాల్ జాగరణ పూజలో పాల్గొన్న బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్‌వీ మహేందర్ కుమార్, కళాకారులు, తదితరులు



మహా చండీ హోమం

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుద్వేల్ రైల్వేస్టేషన్ బస్తీలో ఆదివారం మహా చండీహోమం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వందల సంఖ్యలో పాల్గొని భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత ప్రభువు పూల వెంకటేశ్ దంపతులను బస్తీ పెద్దలు సన్మానించారు. **- రాజేంద్రనగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి)**

లలితాంబ ఆలయ ముఖద్వారం ప్రారంభం



ముఖద్వారం వద్ద పూజలు చేస్తున్న ప్రముఖులు

చాంద్రాయణగుట్ట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): లలితాబాగ్‌లోని లలితాంబ ఆలయ ముఖద్వారాన్ని ఆలయ చైర్మన్ పి.రాహుల్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గ ఇన్‌చార్జి బోయ నగేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజు యాదవ్, మహేశ్‌కుమార్ యాదవ్, బాలల హక్కుల కమిషన్ సభ్యుడు వచన్, ట్రస్టీ సభ్యులు అనిల్‌సింగ్, కిరణ్‌కుమార్, వెంకటేశ్, నందు, తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో ఉచిత వైద్య శిబిరం

గోషామహల్, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం ఆయుష్ యోజన పథకాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ అన్నారు. ఆదివారం గోషామహల్ డివిజన్‌లోని ఏకే భవన్‌లో ఐసీఏఆర్ డైరెక్టర్ బీజేపీ నాయకులు డి.గోపాల్‌జీ నేతృత్వంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఎమ్మెల్యే రాజాసింగ్ పాల్గొన్నారు. ఈ వైద్యశి బిరంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శశికళ, డాక్టర్ వి.రామచందర్, కె.రాజశేఖర్, టి.సంజయ్, బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దసరాకు ఊరెళ్తున్నారా? జాగ్రత్తలు తప్పనిసరి

పహాడిషరీఫ్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా ఊరికి వెళ్తున్న వారు దొంగతనాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు, మహేశ్వరం జోన్ డీసీపీ సునీతరెడ్డి, ఏసీపీ జానకి రెడ్డి, మార్గదర్శకాల మేరకు ఆయన భద్రతా సూచనలు విడుదల చేశారు. బంగారం, వెండి ఆభరణాలు, నగదు వంటివి ఇంట్లో వదిలేయకుండా బ్యాంకు లాకర్‌లో ఉంచడం లేదా వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఇంటి మెయిన్ డోరుకు తాళం వేసి, కర్టన్లు అడ్డంగా ఉంచాలని, ఇంట్లో లైట్లు ఆన్ చేసి, వరండాలో బట్టలు ఆరేసి ఉంచడం ద్వారా ఇల్లు ఖాళీగా లేదని చూపించవచ్చని చెప్పారు. పాలవారు, పేపర్ వేసేవారికి ముందుగానే సమాచారం ఇవ్వాలని ఇరుగుపొరుగు వారిని ఇంటిని గమనించమని చెప్పాలన్నారు.



● బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా క్రాంతికిరణ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బంగారు సుధీర్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సంజయ్ గనాటేల పుష్పగుచ్ఛంతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

- హిమాయత్‌నగర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి)



● భగత్‌సింగ్ జయంతి, మాజీ పీసీసీ అధ్యక్షుడు దివంగత డి.శ్రీనివాస్, మాజీ ముఖ్యమంత్రి దివంగత కోట్ల విజయభ్కార్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి మనీలాల్‌షా, జనరల్ సెక్రెటరీ భాస్కర్, నాయకులు రాములు, శంషుద్దీన్, అమర్‌నాథ్, కైలాష్ ఆనంద్ **- అఫ్జల్‌గంజ్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి)**

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



ప్రేమావతిపేట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న స్వయం సేవక్

రాజేంద్రనగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ రైల్వే స్టేషన్ బస్తీ, బుద్వేల్, ప్రేమావతిపేట్ ప్రాంతాల్లో ఆదివారం రాష్ట్రీయ స్వయక్ సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. బుద్వేల్ రైల్వే స్టేషన్ బస్తీ శ్రీ సాయి మోడల్ స్కూల్ ఆవరణలో ఆజాద్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో విశ్రాంత ఉద్యోగి ఎద్దుల ప్రభాకర్ రెడ్డి ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో చార్మినార్ బాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ రాచమల్ల నిఖిల్ రాజ్ హాజరయ్యారు.

● ప్రేమావతిపేట్‌బస్తీ ఆర్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయ దశమి ఉత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షాహిన్ జూనియర్ కళాశాల డైరెక్టర్ అనిల్ కుమార్ పాటిల్ హాజరయ్యారు.

● బుద్వేల్ ఆర్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన విజయదశమి ఉత్సవ కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ న్యాయవాది పాల్వాయి విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ పదోన్నతుల్లో విద్యాశాఖ కౌంటర్ దాఖలు చేయాలి'

గన్‌పార్క్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పదోన్నతుల్లో తనకు అన్యాయం జరిగిందని హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందనకు ఫిర్యాదు చేసినట్టు న్యాయవాది, ఉపాధ్యాయుడు బూర శ్రీనివాస్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయ పదోన్నతుల్లో ఇప్పటికే తాను హైకోర్టును ఆశ్రయించానని, అయితే కౌంటర్ దాఖలు చేయాలని విద్యాశాఖను కోర్టు ఆదేశించినప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదన్నారు. సత్వరమే సంబంధిత విద్యాశాఖ అఫ్‌డవిట్‌తో కౌంటర్ దాఖలు చేయాలని కోరారు. ఈ విషయంలో కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని జిల్లా విద్యాశాఖ అధికారులు కోర్టుకు కౌంటర్ దాఖలు చేసేలా చర్యలు చేపట్టాలని తాను కలెక్టర్‌కు విన్నవించినట్టు తెలిపారు. డీఈఓ అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తే అవినీతి బహిర్గతమవుతోందన్నారు.

రాజేంద్రనగర్‌లో భగత్ సింగ్‌కు నివాళి



బుద్వేల్‌లోని సీపీఐ కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు, ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు

రాజేంద్రనగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా బుద్వేల్‌లోని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ఆదివారం సీపీఐ, ఏఐఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీల నాయకులు కన్యగారి నర్సింహారెడ్డి, విద్యార్థి సంఘం నాయకులు జి.సత్యం, సయ్యద్ అబ్దుల్, నవాజ్ మహ్మద్, ఇస్మాయిల్, అంజనేయులు, కొండన్న, సురేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

● మైలార్‌దేవుపల్లి డివిజన్-2 అధ్యక్షుడు సూరెడ్డి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అడికె రాజు, బొమ్మరాజు నర్సింహ్మా, నెరుట్ల జగన్, సేడెం వెంకటరమణ గుప్తా, రామారావు, కిరణ్, శేఖర్, చంద్రశేఖర్, సోఫాన్ పాల్గొన్నారు.

'మోదీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి'

రాజేంద్రనగర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఆలోచన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి భారత్‌ను ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా దామోదర్‌రెడ్డి అన్నారు. బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం హైదర్‌గూడలో బీజేపీ నాయకురాలు మేకల వనితా దామోదర్‌రెడ్డి నివాసంలో ప్రధాని మన్ కీ బాత్‌ను తిలకించారు. యువమోర్చా నాయకులు బాల్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

అక్టోబరు 2న ఖాదీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలి



మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న శ్రీరాములు, నాయకులు

పహాడిషరీఫ్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ప్రజలు ఖాదీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు సూచించారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సుల్తాన్‌పూర్ గ్రామంలో ఆదివారం కన్వీనర్ ప్రవీణ్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మన్ కీ బాత్ 126వ ఎపిసోడ్‌ను గ్రామస్థులు, బీజేపీ నాయకులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణా రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/9CgoZaLలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు. నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

'వరద బాధితులను ఆదుకోవాలి'

చార్మినార్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మూసీ పరివాహిక ప్రాంతమైన మలక్‌పేట నియోజకవర్గంలోని శంకర్‌నగర్‌లోని ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు పెళ్లిళ్లు ఉన్న పదిహేను కుటుంబాలకు కల్యాణలక్ష్మి, విద్యార్థులకు బుక్స్ ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ హైదరాబాద్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ నాగు నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం టీడీపీ మలక్‌పేట్ నియోజకవర్గ నాయకులతో కలిసి శంకర్‌నగర్‌లో పర్యటించి మూసీ వరదలో సర్వం కోల్పోయిన కుటుంబ వివరాలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వరద బాధితుల విషయాన్ని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి టీడీపీ తరఫున సహాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మలక్‌పేట నియోజకవర్గ నాయకులు అనిల్ కుమార్, విజయ్ కుమార్ రాజేశ్, దినేష్, బీవై శ్రీకాంత్, జోగేందర్ సింగ్, అనిల్, సత్య క్రిష్ణ, అజయ్ పాల్గొన్నారు.

'వృద్ధుల సంరక్షణే లక్ష్యం'

పహాడిషరీఫ్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధుల సంరక్షణే లక్ష్యంగా గోల్డెన్ కేర్‌లో భాగంగా చర్యలు తీసుకుంటున్నామని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రకుంట, షాహీన్ నగర్, అల్ జబ్రీ కాలనీ, బాలాపూర్ మల్లాపూర్ ప్రాంతాలను సందర్శించి, అక్కడ ఒంటరిగా జీవిస్తున్న వృద్ధులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి ఆరోగ్య పరిస్థితులు అవసరాలను పరిశీలించి, వారికి తినే ఆహారం పానీయాలను నిత్యావసర వస్తువుల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో బాలాపూర్ పోలీస్ స్టేషన్ డీఎస్ఐ కోటేశ్వర్‌రావు, ఎస్ఐ కె.సుధాకర్, ఎస్ఐ ప్రసాద్ బాలాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సిబ్బంది కూడా పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

పహాడిషరీఫ్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉచితకంటి వైద్య శిబిరాలను ప్రజలు సదనివియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు కరీం ఖాద్రి అన్నారు. ఆదివారం రాయల్ కాలనీలో హైదరాబాద్ ప్రోగ్రెస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. దాదాపు 260 మందిని పరిశీలించి ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేశారన్నారు. కార్యక్రమం కంటి వైద్యులు డా. అసద్ సాత్రీ, హసన్ సాత్రీ, రియాన్ సాత్రీ, సయ్యద్ గౌస్ మోహియుద్దీన్, సిబంది, తదితరులు పాల్గొన్నారు.

పాత రేషన్ కార్డు దారులకు ఈ కేవైసీ తప్పనిసరి

చార్మినార్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పాత, కొత్త రేషన్ కార్డు దారులు ఈ కేవైసీ తప్పని సరి చేయించుకోవాలని సర్కిల్-2 పౌర సరఫరా శాఖ అధికారి సురేందర్ సూచించారు. ఈకేవైసీని కుటుంబ సభ్యులందరూ చేయించుకోవాలన్నారు. సర్కిల్-2లో ఏప్రిల్ వరకు 90828 రేషన్ కార్డులు ఉండగా, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో ఇప్పటి వరకు 14882 కార్డులు వచ్చాయని, మిగతా దరఖాస్తుదారులైన వారికీ రేషన్ కార్డులు వస్తాయన్నారు.

బతుకమ్మ నిమజ్జనాల ఏర్పాట్ల పరిశీలన

రాజేంద్రనగర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): హైదర్‌గూడ శివానగర్‌ను ఆనుకొని ఉన్న పెద్దతాళ్ల కుంటలో బతుకమ్మల నిమజ్జనానికి చేపట్టిన పనులను ఆదివారం స్థానిక నాయకులు పరిశీలించారు. పెద్ద తాళ్లకుంట వద్ద వీధి దీపాలు, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని నాయకులు హరినాథ్, నర్సింహ, మల్లారెడ్డి, విజయ్‌కుమార్, సాయియాదవ్, అశోక్ కోరారు.

ధూల్‌పేటలో గంజాయి విక్రేత అరెస్ట్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ధూల్‌పేటలో గంజాయి విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసి, 1.13 కిలోల గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ధూల్‌పేట జుంగూర్ బస్తీకి చెందిన ఆర్తీబాయి గంజాయి విక్రయాలు చేస్తోంది. సమాచారమందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ టీం లీడర్ అంజిరెడ్డి బృందం జుంగూర్‌బస్తీలోని ఆర్తీబాయి ఇంటిపై దాడి చేసి ఆమెను అరెస్ట్ చేశారు. మరో నిందితుడు శివాసింగ్ పరారీలో ఉన్నాడు.

31 మద్యం బాటిళ్లు స్వాధీనం

శంషాబాద్ ప్రాంతంలో డ్యూటీ ఫ్రీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయన్న సమాచారంతో నిఘా పెట్టిన ఎక్సైజ్ సిబ్బంది ఢిల్లీ, గోవాల నుంచి మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 31 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

కొత్త పోలీస్ బాసులు

నేడు బాధ్యతలు స్వీకరించనున్న పలువురు అధికారులు


సిటీ (క్రైమ్) అడిషనల్ సీపీగా శ్రీనివాసులు


వెస్ట్‌జోన్ డీసీపీగా చింతమనేని శ్రీనివాస్


మాదాపూర్ డీసీపీగా రితిరాజ్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కమిషనరేట్లకు కొత్త పోలీస్ బాసులు వచ్చారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం 23 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేయడం తెలిసిందే. నగర పోలీస్ కమిషనర్‌గా వీసీ సజ్జనార్‌ను, సీఐడీ ఐజీ ఎం.శ్రీనివాసులును హైదరాబాద్ సిటీ (క్రైమ్స్) అడిషనల్ సీపీగా నియమించింది. సీసీఎస్‌లో సిటీ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్‌ను ప్రభుత్వం టీఎస్‌పీఎస్‌సీ మెంబర్‌గా అవకాశం కల్పించింది. హైదరాబాద్ సిటీ కమిషనరేట్ లా అండ్ ఆర్డర్ జాయింట్ సీపీగా తఫ్సీర్ ఇక్బాల్, రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌ను హైదరాబాద్ సిటీ పశ్చిమ (వెస్ట్ జోన్) జోన్ డీసీపీగా నియమించింది. ఆయన స్థానంలో రాజేంద్రనగర్ డీసీపీ యోగేష్ గౌతమ్‌కు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఏసీబీ జాయింట్ డైరెక్టర్ హోదాలో కొనసాగుతున్న రితిరాజ్‌ను మాదాపూర్ జోన్ డీసీపీగా, ఎల్‌బీనగర్ డీసీపీగా డా. బి. అనురాధను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ డీసీపీగా కొనసాగుతున్న ప్రవీణ్‌కుమార్‌ను ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా పంపింది. సోమవారం పలువురు కొత్త బాసులు బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

(5వ పేజీ తరువాయి)

అన్నారు. గ్రూప్-1లో 43వ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యాడు. బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశానని, జగద్గిరిగుట్టలో వైష్ణవి స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ రోజూ 12 గంటలు ప్రిపేర్ అయ్యానని చెప్పాడు. తల్లిదండ్రులు కష్టమే తనకు ఉద్యోగం రావడానికి దోహదపడిందన్నాడు.

ఎస్‌ఐ కుమారుడు డీఎస్పీగా..

నార్సింగ్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాల్లో నార్సింగ్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ పి. వీరేశం కుమారుడు సాయి విశ్వంత్ డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యాడు. ప్రజలు, పోలీసు కుటుంబ సభ్యుల ఆదరణ పొందుతానని అన్నాడు విశ్వంత్.


సాయి విశ్వంత్‌తో తల్లిదండ్రులు

నాన్న కల నెరవేరింది : బి. శ్రేయ

చిలకలగూడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1కు మొదటి ప్రయత్నంలోనే సెలెక్ట్ కావడంతో నాన్న కల నెరవేరిందని అన్నారు బాలం శ్రేయ. సికింద్రాబాద్ ఈస్ట్ మారేడుపల్లికి చెందిన రాజ్యలక్ష్మి, జై కిషన్ కుమార్తె శ్రేయ గత డిసెంబర్‌లో గ్రూప్-4 పాసై శ్రీ భక్తరామదాసు ప్రభుత్వ సంగీత నృత్య కలాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ గ్రూప్-1కు ప్రిపేర్ అయి మొదటి ప్రయత్నంలోనే సెలెక్ట్ అయి 597వ ర్యాంకు సాధించింది. కోచింగ్ తీసుకోలేదని, రోజుకు 10 గంటలు ప్రిపేర్ అయ్యానని తెలిపారు.

హెచ్‌సీఎస్‌సీ సేవలు మరింత విస్తృతం

● సీపీ ఆనంద్


టీజీఐఐఐసీ భవనంలో హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీపీ ఆనంద్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీ ఎస్‌సీ) సేవలు మరింత విస్తృతం చేస్తున్నామని సీపీ ఆనంద్ అన్నారు. ఇది హైదరాబాద్ పోలీసులతో కలిసి పనిచేస్తుందన్నారు. ఆదివారం బంజారాహిల్స్ టీజీఐఐఐసీ భవనంలో హెచ్‌సీఎస్‌సీ కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ సీపీ విక్రంసింగ్ మాన్, జాయింట్ సీపీ జోయల్ డేవిస్, డీసీపీలు పుష్ప, కవిత, లావణ్యలతో పాటు హెచ్‌సీఎస్‌సీ ట్రాఫిక్ ఫోరం జాయింట్ సెక్రటరీ వి. రాజశేఖర్ రెడ్డి, ప్రవీణ్, ప్రశాంత్, సీఈ సభ్యులు, గీతా గోటి, సతీష్‌లు పాల్గొన్నారు..

బెస్ట్ థీం పార్క్ అవార్డు ప్రదానం


మంత్రి కృష్ణారావు నుంచి అవార్డు అందుకుంటున్న సంస్థ సభ్యులు

కార్వాన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైల్డ్ వాటర్ అండ్ అమ్యూజ్‌మెంట్ థీం పార్క్ సంస్థకు బెస్ట్ థీం పార్క్ అవార్డు ప్రదానం చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం శిల్పారామంలో ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పురస్కారాన్ని ప్రదానం చేశారు. కుమార వేళం, సోవానా మహాపాత్ర, సాయి కిరణ్‌రాజ్ యాదవ్‌లు దాన్ని అందుకున్నారు. థీం పార్క్‌ను సందర్శిస్తే ఒత్తిడి తగ్గి నూతనోత్సాహం పొందుతారని అవార్డు గ్రహీతలు అన్నారు.


యుతి క్లినిక్స్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు


క్లినిక్‌ను పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి తదితరులు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి) : యుతి క్లినిక్స్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. ఆదివారం కొండాపూర్‌లో ఏర్పాటుచేసిన యుతి క్లినిక్స్‌ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ మాజీ సభ్యుడు సీ సురేష్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం కేంద్రమంతి మాటాడాఆరు. ప్రతీ జిల్లాకో మెడికల్ కాలేజీ పెట్టడంతో పాటుగా ప్రస్తుతమున్న మెడికల్ కాలేజీలలో సీట్లను పెంచుతున్నామని చెప్పారు. ఇప్పటికే పీజీ సీట్లు కూడా పెంచామన్నారు. అయుష్మాన్ భారత్ పేరిట 5 లక్షల రూపాయల వరకూ ఉచిత వైద్యం అందిస్తున్నామని చెప్పారు. విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ యువ డాక్టర్లంతా ఒకే వేదిక మీదకు రావడం దేశానికి, రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. ఈ క్లినిక్స్ నగరవాసులకు మెరుగైన చికిత్సలను ఒకే చోట అందించనున్నాయని యుతి క్లినిక్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ పుష్పక్ రెడ్డి చాడ, డాక్టర్ ద్రోణంరాజు విభు, డాక్టర్ కంభంపాటి శ్రీనివాస్ , డాక్టర్ గోపాల్ కృష్ణ అన్నారు. 20కు పైగా స్పెషాలిటీ చికిత్సలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు.

'సుప్రీం'లో పిల్ వేయాలి

● బీసీలపై చిత్తశుద్ధి నిరూపించుకోవాలి
● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ


మాట్లాడుతున్న సత్యనారాయణ తదితరులు

నల్లకుంట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ ఆమోదించకపోతే బీసీలపై చిత్తశుద్ధి ఉన్నట్లయితే సుప్రీంకోర్టులో పిల్ వేయడంతోపాటు గవర్నర్ వ్యవస్థను ఎదుర్కొవాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ.. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెరిట్ గవర్నర్ పెండింగ్ ప్రొసీజర్ వంటి సవాళ్ల పై 42 శాతం బీసీ రిజర్వేషన్ల అంశం వివాదస్పదమైతే ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వల్ప రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ అంశాన్ని త్రిశంకు స్వర్గంలో వేలాడదీసి బీసీలను అయోమయానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు నాగులు శ్రీనివాస్‌యాదవ్, జక్కుల వంశీకృష్ణ, అరుణ్‌యాదవ్, నాగేశ్వరరావులతో కలిసి ఆయన ప్రసంగించారు.

జీవో పేరుతో సర్కారు మరో మోసం

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల జీవో పేరుతో కాంగ్రెస్ సర్కారు మరోసారి మోసం చేస్తోందని తెలంగాణ జాగృతి నేతలు అన్నారు. గవర్నర్, రాష్ట్రపతి వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయనే కారణంతో జీవోను కోర్టు కొట్టివేసే ఆస్కారం ఉందని పేర్కొన్నారు. ఆదివారం బంజారాహిల్స్ జాగృతి కార్యాలయంలో నవీనా చారి, రూప్‌సింగ్, ఎత్తరి మారయ్య, రాచమల్ల బాలకృష్ణ విలేకరులతో మాట్లాడారు. ఎవరూ కోర్టుకు వెళ్లొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ అడుగుతున్నారని, ప్రభుత్వం కోర్టు వెళ్లొద్దని అడగటం సరికాదన్నారు. కంటితుడుపు చర్యగా జీవో ఇచ్చి బీసీ రిజర్వేషన్లను విస్మరిస్తే జాగృతి పక్షాన పోరాడుతామని జాగృతి నేతలు హెచ్చరించారు.

రాజ్యాధికార సాధనకు నడుం బిగించాలి

● బీసీ నేతలు, మేధావుల పిలుపు

బేగంపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీలు రాజ్యాధికార సాధనకు నడుం బిగించాలని ప్రముఖ బీసీ నేతలు, మేధావులు అన్నారు. ఆదివారం బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ హాల్‌లో విశ్రాంత ఐఏఎస్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ టి. చిరంజీవులు రచించిన " హిస్సా- ఇజ్జత్ - హుకుమత్ " పుస్తకావిష్కరణ జరిగింది. మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, జస్టిస్ ఈశ్వరయ్య, పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, మాజీ ఎంపీ బూర నరసయ్యగౌడ్, వి. హనుమంతరావు, వకులాభరణం, కృష్ణమోహన్, జూలూరి గౌరిశంకర్ తదితర బీసీ నేతలు, మేధావులు, కవులు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయంగా, ఆర్థిక రంగాల్లో బీసీలు అణచివేతకు గురవుతున్నారనే వివరాలు గణాంకాలతో సహా పుస్తకంలో వివరించారన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, విశ్రాంత ఐపీఎస్ అధికారి పూర్ణచందర్‌రావు, బాలరాజ్‌గౌడ్, అయిలి వెంకన్న, గౌడ్, చామకూర రాజు, కేవీ గౌడ్, దుర్గయ్య గౌడ్‌తో పాటు బీసీ సంఘాల నేతలు, మేధావులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారిణులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

నవరాత్రి, బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా ఆదివారం రష్మీ సచితానంద శిష్య బృందం సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. బాల త్రిపుర సుందరి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన సైతం అలరించింది. మాదాపూర్ శిల్పారామంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మలను పేర్చి సందర్శకులతో కలిసి ఆడిపాడారు. ● మాదాపూర్, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి)

బెంగాలీ సంస్కృతి ఆదర్శం : గవర్నర్ జిష్ణుదేవ్


దుర్గాష్టమి వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తదితరులు

రెజిమెంటల్ బజార్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బెంగాలీ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బంగియా సాంస్కృతిక్ సంఘ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ కీస్ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సంఘ 60 ఏళ్ల దుర్గాష్టమి వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా సుమారు 8 లక్షల మంది బెంగాలీలు వివిధ రంగాల్లో పని చేస్తున్నారన్నారు, పర్యటనలో భాగంగా త్రిపురలో ఉన్నానని, అక్కడ దుర్గాష్టమి వేడుకల్లో పాల్గొనాలని కోరినా గాని తాను హైదరాబాద్‌లో నిర్వహించే బెంగాలీ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చానని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున బెంగాలీలు పాల్గొని దుర్గాష్టమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

ఆట స్థలాలను ఏర్పాటు చేయకుంటే ఆస్పత్రులను పెంచుకోవాలి

● రెయిన్‌బో హార్ట్ క్లినిక్ ప్రారంభోత్సవంలో పుల్లెల గోపీచంద్


బ్రోచర్ ఆవిష్కరణలో పుల్లెల గోపీచంద్, వైద్యులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆట స్థలం ఏర్పాటు చేయకుంటే ఆస్పత్రులను పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని భారత బ్యాడ్మింటన్ జాతీయ ప్రధాన కోచ్ పుల్లెల గోపీచంద్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఆట స్థలాలు, క్రీడల సామగ్రిపై దృష్టి పెట్టాలని, పిల్లలను ఆడాలని ప్రోత్సహించాలన్నారు. మెడల్స్ కోసమే కాదు కాని మంచి ఆరోగ్యవంతమైన యువకులుగా మారతారని తెలిపారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇనిస్టిట్యూట్ (ఆర్‌సీహెచ్‌ఐ)లో రెయిన్‌బో అథ్లెటిక్స్ హార్ట్ క్లినిక్ ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎస్‌ఎస్ ట్రస్టీ నాగరాణి చావా, బాలనటి సుకృతి వేణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం బ్రోచర్ ఆవిష్కరించారు. యువతలో గుండె సమస్యలు రాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమని గోపీచంద్ అన్నారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ దినేష్ చిర్ల మాట్లాడుతూ దేశంలో ప్రతి వెయ్యి మంది పిల్లల్లో తొమ్మిది మంది పుట్టుకతోనే కన్జెనిటల్ హార్ట్ డిఫెక్ట్ (సీహెచ్‌డీ) తో బాధపడుతున్నారన్నారు. జాతీయ ఉత్తమ బాలనటి పురస్కార గ్రహీత సుకృతి వేణి ప్రసంగించారు. కార్డియోపల్మనరీ ఎక్సర్‌సైజ్ టెస్టింగ్‌పై వర్క్ షాప్ నిర్వహించారు.

గ్రూప్-1 నిర్వహణలో టీజీపీఎస్సీ ఫెయిల్

● అవకతవకలు, అవినీతిపై సీబీఐతో విచారణ
● గ్రూప్-1 అభ్యర్థులు, నిరుద్యోగుల డిమాండ్

పంజాగుట్ట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) గ్రూప్-1 పరీక్ష నిర్వహణలో పూర్తిగా విఫలమైందని గ్రూప్-1 అభ్యర్థులు, నిరుద్యోగులు ఆరోపించారు. 563 పోస్టులతో వచ్చిన నోటిఫికేషన్ రద్దు చేసి యూపీఎస్సీతో నిర్వహించాలన్నారు. అవకతవకలు, అవినీతిపై సీబీఐతో పాటు జ్యుడిషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు డివిజన్ బెంచ్ ఫైనల్ తీర్పు ఆధారంగా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రూప్-1 పరీక్షల్లో తెలుగు మీడియం అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రీఎగ్జామ్ పెట్టాలని న్యాయస్థానం చెప్పితే సీఎం రేవంత్ రెడ్డి రీ నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. నోటిఫికేషన్ వచ్చినపటి నుంచి ఎన్నో అవకతవకలు జరిగాయన్నారు. కోఠి మహిళా కళాశాలలో రాసిన వారిలో 71 మందికి, 15వ సెంటర్‌లో 24, 17వ సెంటర్‌లో రాసిన 25 మందికి ర్యాంకులొచ్చి ఉద్యోగాలు సాధించారన్నారు. మిగతా కేంద్రాల్లో రాసిన వారికి ర్యాంకులు రాలేదన్నారు. జీవో 29తో 172 మంది ఓసీ అభ్యర్థులు ఎంపిక కావడం సామాజిక న్యాయానికి తూట్లు పొడవడమే అన్నారు. హైకోర్టు డివిజన్ బెంచ్ అంతిమ తీర్పు రాక ముందే ప్రభుత్వం రాత్రికి రాత్రే ఫైనల్ సెలక్షన్ లిస్ట్ పెట్టడం అనుమానాలకు తావు ఇస్తుందన్నారు. సమావేశంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్, ఓయూ జేఏసీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, జైల్ సింగ్, ఝూన్సీ రాణి, కరుణాకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గ్రూప్-1 అభ్యర్థులు, నిరుద్యోగులు

జంట జలాశయాలకు స్థిరంగా వరద

● గండిపేట 4 గేట్లు, హిమాయత్‌సాగర్ 2 గేట్ల ఎత్తివేత

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జంట జలాశయాలకు పై ప్రాంతాల నుంచి వరద ప్రవాహం స్థిరంగా వస్తోంది. శనివారం రాత్రి వరకు ఉస్మాన్‌సాగర్ 8 గేట్లు, హిమాయత్‌సాగర్ 4 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఆదివారం రాత్రి 7 గంటల సమయానికి ఉస్మాన్‌సాగర్ (గండిపేట) 4 గేట్లు 2 అడుగులు , హిమాయత్‌సాగర్ నుంచి 2 గేట్లను 3 అడుగుల వరకు ఎత్తి దిగువకు వరద వదులుతున్నామని జలమండలి అధికారులు తెలిపారు. 'గండిపేట పూర్తి స్థాయి నీటి మట్టం 1,790 అడుగులు ఉండగా, ప్రస్తుతం 1789.25 అడుగుల వరకు చేరింది. ఎగువ ప్రాంతం నుంచి 1,200 క్యూసెక్కుల వరద వస్తున్నది. దిగువకు 920 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. హిమాయత్‌సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 1,763.50 అడుగులు కాగా, 7 గంటల సమయంలో 1,762.55 అడుగులు ఉంది. ఎగువ ప్రాంతం 3 వేల క్యూసెక్కుల వరద వస్తున్నది. దిగువకు 1,981 క్యూసెక్కుల నీటిని వదులుతున్నాం' అని వారు తెలిపారు.

మోదీ జీవిత చరిత్ర ప్రదర్శన ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లపై నాయకులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గచ్చిబౌలి, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినం పురస్కరించుకుని ఈనెల 30న మోదీ జీవిత చరిత్రపై హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించనున్నారు. ఆ మేరకు ఆదివారం ఈ ఏర్పాట్లను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ పరిశీలించారు. మోదీ రాజకీయ ప్రస్థానంలో ఎవరికీ తెలియని స్ఫూర్తిని కలిగించే విషయాలెన్నో ఉన్నాయన్నారు. పార్టీలకతీతంగా అందరూ ప్రదర్శనలో పాల్గొన్నాలని కోరారు.

మెట్రో ఫ్యూచర్ ముందుకు..

(5వ పేజీ తరువాయి)

ప్రతిపాదించారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ను తయారు చేసి అందించాలని అప్పట్లోనే హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఏఎంఎల్) అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ప్రతిపాదిత 40 కిలోమీటర్ల పనుల డీపీఆర్‌ను రూపొందించి అందించారు. తమ ప్రాంతంలో కూడా మెట్రో రైలును నిర్మించి ట్రాఫిక్ ఇబ్బందులను నుంచి కాపాడాలని నార్త్‌సిటీ ప్రజలు పట్టుపట్టారు. దీంతో ప్రభుత్వం జేబీఎస్ మెట్రోస్టేషన్ నుంచి మేడ్చల్ వరకు (24.5 కిలోమీటర్లు), జేబీఎస్ మెట్రోస్టేషన్ నుంచి శామీర్‌పేట్ వరకు (22 కిలోమీటర్లు)ను కూడా పార్ట్-బీ కిందనే తీసుకోవాలని సూచించింది. ఈ క్రమంలో హెచ్‌ఏఎంఎల్ అధికారులు ఫ్యూచర్ సిటీతో కలుపుకుని మొత్తం 86.5 కిలోమీటర్ల డీపీఆర్‌ను తయారు చేసి ఈ ఏడాది జూన్‌లో కేంద్రానికి పంపించారు.

గ్రీన్‌ఫీల్డ్‌పై 18 కిలోమీటర్ల ట్రాక్

పార్ట్-ఏలోని 5 కారిడార్లలో కిలోమీటరుకు సుమారు రూ.318కోట్లతో అంచనాతో డీపీఆర్‌ను తయారు చేయగా.. పార్ట్-బీలోని కారిడార్లకు కిలోమీటరుకు రూ.227.39 కోట్లతోనే రూపొందించారు. భారత్ ఫ్యూచర్ సిటీ మార్గంలో భూసేకరణ సమస్య పెద్దగా లేకపోవడంతో ఆ మార్గంలో ఖర్చు తగ్గుతున్న పరిస్థితి కనిపిస్తోంది. జేబీఎస్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట్‌లో ఖర్చు పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు-భారత్ ఫ్యూచర్‌సిటీ(స్కిల్ యూనివర్సిటీ) వరకు చేపడుతున్న 40 కిలోమీటర్లలో భాగంగా ఎయిర్‌పోర్టు నుంచి 2 కిలో మీటర్లు భూగర్భ మార్గంలో ట్రాక్ ఉండనుంది. 20 కిలోమీటర్లు ఎలివేటెడ్ (ఆకాశ మార్గంలో), 18 కిలోమీటర్లు ఎట్ గ్రేడ్ (భూమిపై) ట్రాక్ ఉండనుంది. 14 కిలోమీటర్లు ఔటర్‌రింగ్ రోడ్డు వెంట ఉండనుంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పెద్ద గోల్కొండ, రావిర్యాల్ మీదుగా స్కిల్స్ యూనివర్సిటీ వరకు కారిడార్‌ను నిర్మించనున్నారు.

40 నిమిషాల్లో భారత్ ఫ్యూచర్‌సిటీకి..

శంషాబాద్ విమానాశ్రయం మీదుగా భారత్ ఫ్యూచర్‌సిటీ మార్గంలో ప్రయాణించే వారి కోసం మెట్రోను అద్భుతంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్‌సిటీకి కేవలం 40 నిమిషాల్లో చేరుకునే విధంగా కారిడార్‌ను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఎయిర్‌పోర్టు నుంచి ప్రారంభమయ్యే కారిడార్ రావిర్యాల మీదుగా, ఓఆర్‌ఆర్ వెంట వెళ్లేలా డిజైన్ చేశారు. ఫ్యూచర్‌సిటీకి అనువుగా గ్రీన్ కారిడార్లను అభివృద్ధి చేసి, అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి త్వరితగతిన ఫ్యూచర్ సిటీకి చేరుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.


మాట్లాడుతున్న డా.మందాల భాస్కర్, చిత్రంలో బేర బాలకిషన్ తదితరులు

ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సత్వరమే సవరిం

గన్‌పార్క్, సెప్టెంబరు, 28, (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సత్వరమే సవరించాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ మందాల భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌ కాంప్లెక్స్‌లో 33 జిల్లాల మాల సంఘాల నేతలతో కలిసి ఆయన.. రాష్ట్ర మాల సంఘాల జేఏసీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టంలో జీవో 99 వల్ల మాల కులాలకు విద్య, ఉద్యోగాల్లో తీరని నష్టం జరుగుతోందన్నారు. తమ సామాజిక వర్గాన్ని అణచివేసేందుకు సీఎం కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీల్లో రెండో అత్యధిక జనాభా కలిగిన తమకు అన్యాయం చేస్తే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. మాల సంఘాల జేఏసీ గ్రేటర్ చైర్మన్ బేర బాలకిషన్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని హెచ్చరించారు. సమావేశంలో కన్వీనర్ కనకరాజు, వర్కింగ్ చైర్మన్ మంత్రి నర్సింహయ్య, నేతలు వీవీ స్వామి, రావుల అంజన్న, వేణుగోపాల్, ప్రహ్లాద్, అనంతయ్య, డానియేల్ తదితరులు పాల్గొన్నారు.


కళాకారిణి నృత్యం


బతుకమ్మ వేడుకల్లో మహిళలు

ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలు.. ఎనిమిదో రోజైన ఆదివారం సంబరంగా జరిగాయి. పలువురు కళాకారులతో పాటు క్లిక్ సంస్థకు చెందిన మహిళలు పాల్గొన్నారు. రాష్ట్ర విశ్వకర్మ మహాసభ నిర్వహణలో జరిగిన వేడుకల్లో ఇతర రాష్ట్రాల మహిళలు బతుకమ్మ ఆడిపాడారు. కూచిపూడి, భరతనాట్య కళాకారులు సైతం బతుకమ్మ ఆడుతూ నాట్యం చేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంప్రదాయాలు, ఆచారాలు, ఆత్మీయతకు ప్రతిబింబమని సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. - రవీంద్రభారతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి)



'బతుకమ్మ'... సమానత్వానికి ప్రతీక

సామాన్యుల ఇళ్ల ముంగిళ్ల నుంచి బతుకమ్మను విశ్వవిద్యాలయం మెట్లు ఎక్కించిన మొట్టమొదటి పరిశోధకురాలు బండారు సుజాతా శేఖర్. ఊరూరా తిరిగి గ్రామీణ మహిళల నాలుక మీద లిఖితమైన కొన్నివందల బతుకమ్మ పాటలను ఆమె సేకరించారు. వాటిలోని పౌరాణిక, సామాజిక, సాంస్కృతిక, భాషా విశేషాల స్ఫూర్తిని ఎలుగెత్తి చాటారు. కనుమరుగవుతున్న మరికొన్ని పాటలకు పునర్జీవం పోశారు. బతుకమ్మ సంబురంలోని సామాజిక దీప్తిని తన పరిశోధనతో లోకానికి చాటిన ఆమెను 'నవ్య' పలకరించింది.

"తెలంగాణ అంతటా ఇప్పుడు బతుకమ్మ ఆడుతున్నారని సంతోషపడాలా? ఆ పేరుతో చాలామంది డీజే పాటలతో, దాండియాలతో పిచ్చి గంతులేస్తున్నారని బాధపడాలా? అనేది తెలియడం లేదు. ఇవాళ కొన్ని వందల మంది పాడుతున్న 'చిత్తు చిత్తుల బొమ్మ...' లాంటి పాటలెన్నింటినో నా పరిశోధన ద్వారా పాతికేళ్ల కిందట వెలుగులోకి తెచ్చాను. మా సొంతూరు నల్గొండ జిల్లా దేవరకొండ. మా అమ్మ బండారు అనసూయమ్మ నోట బతుకమ్మ పాటలు వింటూ పెరిగిన నాకు ఆ పాటలంటే ప్రాణం. పరిశోధనంటూ చేస్తే... బతుకమ్మ మీదే చేయాలని అనుకున్నాను. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ అడ్మిషన్ ఇచ్చేముందు ఎనిమిదితో కూడిన ప్యానల్ నన్ను ఇంటర్వ్యూ చేశారు. అప్పటికే దేవరకొండ దగ్గర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నాను. "బతుకమ్మ మీద పరిశోధన చేస్తాను" అని నేను అనగానే... "భుజాన సంచి తగిలించుకొని ఊరూరా తిరుగుతావా?" అని అడిగారు. "ఊర్లో కూర్చొంటే పీహెచ్‌డీ సీట్లు వస్తాయా?" అన్నారు. అదృష్టవశాత్తూ నాకు పాటలు వచ్చు కనుక అవి పాడి వినిపించాను. బతుకమ్మ పాటలపై నా పరిశోధన ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ రాసిన 30 పేజీల సినాప్సిస్ కూడా ఇచ్చాను. అది ప్యానల్‌కు బాగా నచ్చడంతో పీహెచ్‌డీలో ప్రవేశం కల్పించారు. తెలుగు జానపద సాహిత్యం పురాగాథ పరిశోధకురాలు రావి ప్రేమలత మేడమ్‌ను పర్యవేక్షకురాలిగా నియమించారు. అలా బతుకమ్మ పాటలు - పౌరాణిక, సామాజిక, సాంస్కృతిక, భాషా విశేషాలపై 1998లో పరిశోధన ప్రారంభించాను. నాలుగేళ్లలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నాను.

ఊరూరా తిరిగి...

బతుకమ్మ పాటల సేకరణ అంత సులువుగా సాగలేదు. దసరా, సంక్రాంతి, వేసవి సెలవుల్లోనే కాదు... కొన్నిసార్లు ప్రత్యేకంగా స్కూలుకు సెలవుపెట్టి మరీ పాటల కోసం తెలంగాణ ఉమ్మడి పది జిల్లాలలోని చాలా గ్రామాలు తిరిగాను. బతుకమ్మకు ఇప్పుడున్నంత ప్రాచుర్యం ఆనాడు లేదు. తెలంగాణ ఉద్యమం పుణ్యమా అని ఇప్పుడు ఊరూ - వాడా బతుకమ్మ పండుగను ఘనంగా చేస్తున్నారు. చిన్న, పెద్ద అంతా కలసి ఉత్సాహంగా ఆడుతున్నారు. ఆ రోజుల్లో ఇంత సందడి లేదు. పాటలు వచ్చిన కొద్దిమంది పెద్దవాళ్ళకు తోడుగా గృహిణులు కొంతమంది చేరి, తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ ఆడుతుండేవారు. అమ్మాయిలైతే తమకు సంబంధం లేదన్నట్టు దూరంగా ఉండేవారు. బతుకమ్మ పాటలు పాడే వారిని వెతుక్కుంటూ ఎన్నో గ్రామాలకు వెళ్లాను. "పాటలు రికార్డు చేసుకుంటాను, పాడండి" అని అడిగితే, "నుడుగులు' (పాటలు) ఏమి చేసుకుంటావమ్మా!" అని విసుక్కునే వారు. కొంతమంది అయితే "పో పోవమ్మా! పనిపాటలేదా?" అని చిరాకుపడేవాళ్లు. ఇంకొంతమంది సిగ్గుపడేవారు. అలా రకరకాల అనుభవాలు. ఒక్కొక్కరి దగ్గర కొన్ని గంటల తరబడి కూర్చొని, పాటలు సేకరించాను. అక్షరం ముక్క రాని ఆడవాళ్లు అలవోకగా పాటలు అల్లి లయబద్ధంగా పాడుతుంటే అవన్నీ రాసుకున్నాను. పండితులకు ఎంత మాత్రం తీసిపోని విధంగా వారంతా కొన్ని వందల పాటలు ఆశువుగా పాడడం ఒక అద్భుతం. ప్రతి మహిళ నాకు ఒక వాగ్దేవిగా కనిపించేది. ఊరూరా తిరిగి సెల్‌ఫోన్లు లేని ఆ రోజుల్లో 700కుపైగా పాటలు సేకరించాను.

బతుకమ్మ పాటలు...

ఈ తొమ్మిది రోజులూ ఆడవాళ్లందరూ కలిసి సాధక బాధకాలను, కష్టసుఖాలను పాటగా అల్లి పాడుకోవడం ఈ పండుగలో చూస్తుంటాం. అత్తకోడళ్లు, యారాళ్లు, అన్నాచెల్లెళ్లు ఇలా... నిత్యజీవితంలో ఎదుర్కొనే కడగండ్ల మీదా బోలెడు బతుకమ్మ పాటలున్నాయి. సాంఘిక ఆచారాలు, వస్తు సంస్కృతి, కళలు, జానపద విజ్ఞానం కలగలసిన బతుకమ్మ పాటలలో కథా గేయాలు, అలాగే కథారహితమైన గేయాలు కనిపిస్తాయి. జానపదుల నోళ్లలో జీవం పోసుకున్న ఆ పాటల్లోని ఛందస్సు, అలంకారాలు, నవరస పోషణ అబ్బురపరుస్తుంది. దుర్మార్గుల ఆకృత్యాలకు బలైన ఒక మహిళ గాథను 'అండాలమ్మ పాట'గా నేటికీ భువనగిరి జిల్లాలో బతుకమ్మ పండుగ నాడు పాడుతున్నారు. 'పంద్రాగస్టుని ఉయ్యాలో, పండుగొచ్చిందమ్మ ఉయ్యాలో' అంటూ దేశ స్వాతంత్ర్యానంతరం హైదరాబాద్ రాష్ట్రంలో తలెత్తిన అరాచకాలు ఇతివృత్తంగా మరొకచోట పాడతారు. నల్గొండ జిల్లాలోని జాన్‌పహాడ్‌హాలోని ఉరుసు ఉత్సవాన్ని వర్ణిస్తూ మతసామరస్యాన్ని కొనియాడుతూ ఇంకో పాట ఆలపిస్తారు. ఇలా మహిళల భావాలు, స్వభావాలు, రామాయణ, మహాభారత గాథలు, స్థానిక చరిత్ర, ఇంట, బయట ఆడవాళ్లకు ఎదురయ్యే ఒడుదొడుకులు, వాటిని ఎదుర్కొనే ఉపాయాలు ఇతివృత్తంగా 'కోల్', 'ఉయ్యాలో', 'వలలో' లాంటి మకుటాలతో సాగే బతుకమ్మ పాటలలోని పౌరాణిక, సామాజిక, భాషా, సాంస్కృతిక విలువలను నా పరిశోధనలో వివరించాను. అది పుస్తకంగానూ వచ్చింది. ఇప్పటికి మూడు ముద్రణలు అయ్యాయి.

ఒక్కోచోట ఒక్కోలా ఆట...

బతుకమ్మ పండుగ చేసుకునే తీరు తెలంగాణ అంతటా దాదాపుగా ఒక్కటే. అయినా, పాటల రూపాంతరాలు, ఆటలో అడుగులు మాత్రం ఒక్కోచోట ఒక్కోలా ఉంటాయి. ఒక పాట ఒకచోట సానుకూల దృక్పథంతో సాగితే మరొక చోట హితబోధ రీతిలో పాడతారు. వరంగల్, కరీంనగర్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో వలయాకారంలో తిరుగుతూ కోలాటం ఆడుతూ బతుకమ్మను కొలుస్తారు. చప్పట్లు కొట్టేప్పుడు శరీర కదలికల్లోనూ శ్రామిక మహిళలకు, గృహిణులకు మధ్య తేడా స్పష్టంగా కనిపిస్తుంటుంది. మరికొన్ని గ్రామాలలో మహిళలు బతుకమ్మను వాయినంగా ఇచ్చిపుచ్చుకుంటారు. కొన్ని ఊర్లలో మగవాళ్లు బతుకమ్మను పేర్చడం చూశాను. వాళ్లే నెత్తినపెట్టుకొని చెరువుకు తీసుకెళతారు. మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలలో బాలికలతో బొడ్డెమ్మ పండుగ బాగా జరుపుతారు. హన్మకొండ, నల్గొండ ప్రాంతాలలోని కొన్ని గ్రామాలలో భూస్వాముల అరాచకరాలు భరించలేక బతుకమ్మ పండుగ చేయరు. ఇంకొందరు కలిసిరాలేదని ఈ పండుగ చేసుకోరు. మలిదశ తెలంగాణ ఉద్యమ కాలం నుంచి మాత్రం ప్రతి ఇల్లు బతుకమ్మకు లోగిలిగా మారింది. సకల జనుల పండుగ అయింది.

మహిళల వల్లే బతికింది...

బతుకమ్మను బతికించింది ముమ్మాటికి గ్రామీణ మహిళల మౌఖిక సాహిత్యమే. కొన్నివందల ఏళ్లనాటి బతుకమ్మ పండుగ సంప్రదాయం ఈనాటికి కొనసాగిస్తున్నామంటే అదంతా అమ్మల పుణ్యమే. ఒకనాడు తెలంగాణ బిడ్డల పలకరింపునకు పెద్దగా నోచుకోని బతుకమ్మను ఇవాళ దేశ దేశాలలోని తెలంగాణ వారంతా కలసి ఘనంగా ఆడుతున్నారు. రెండు దశాబ్దాల కిందట ముంబయిలోని మన వలస శ్రామికుల వీధిలో ఇద్దరు లేదా ముగ్గురు మహిళలు మాత్రమే బతుకమ్మ ఆడేవారు. ఇప్పుడు అక్కడ పండుగ నాడు వందలమంది మహిళలు జమవుతున్నారు. బతుకమ్మ ఆడుతున్నారు. నేను 'బతుకమ్మ' సినిమాకు ఆరుపాటలు అందించాను. నా భర్త శేఖర్ సహకారంతో 'బతుకమ్మ ఫౌండేషన్' నెలకొల్పాను. మా స్తోమత మేరకు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రధానోపాధ్యాయురాలిగా నిరుడు ఉద్యోగ విరమణ చేసిన నాటి నుంచి పూర్తి సమయం సాహిత్య సృజనకు కేటాయిస్తున్నాను. అణాగ్రంథమాల వ్యవస్థాపకులలో ఒకరైన తెలంగాణ వైతాళికుడు కేసీగుప్త జీవిత జీవిత చరిత్ర రాయడం నాకు దక్కిన మరొక అరుదైన అవకాశం. తీజ్ పండుగకు, బొడ్డెమ్మకు సారుప్యత ఉన్నా... బతుకమ్మ మన నేల సాహిత్య, సాంస్కృతిక, జీవన విధానానికి ప్రతీక. అది మన అస్తిత్వం. దాండియా, డీజేలకు దూరంగా సహజసిద్ధంగా బతుకమ్మను ఆడుదాం."

• సాంత్వన్

అంతరాల దొంతరలకు అతీతం

పూలు అంగట్లో కొని పేర్చమని బతుకమ్మ అడగలేదు. పెద్ద బతుకమ్మను పేర్చాలని పోటీలుపడి మరీ పేర్చడం, అందులో కృత్రిమపూలు వాడడం పండుగ స్ఫూర్తికి విరుద్ధం. పొలాలవెంట సులువుగా దొరికే తంగెడు, గునుగు, బీర, కాకర, జిల్లేడు, గుమ్మడి, బంతి, చామంతి, ముత్యపు పూలతో పూజించడమే అమ్మకు అసలైన ఆరాధన. బతుకమ్మను పేర్చడం, మధ్యలో నింపడంలోనూ కళాత్మకత ఉట్టిపడుతుంది. తెలంగాణ తల్లి సిగలో పూసే తీరొక్క పూలన్నీ ఒకచోట ఆలయ గోపురంగా కొలువుదీరినట్టుగా 'మనుషులంతా ఒక్కటే' అన్నది బతుకమ్మ సందేశం. రకరకాల పూల పేర్పు సమానత్వానికి ప్రతీక. రంగురంగుల పుష్పాల రాశి... ఐకమత్యానికి నిదర్శనం. బతుకమ్మ అందరికీ అమ్మ. బతుకమ్మ ఆటకు కులభేదాలు లేవు. మహిళలందరూ అంతరాల దొంతరలకు అతీతంగా... అంతా కలసి మెలసి సంతోషంగా ఆట, పాటలతో చేసుకునే పండుగ బతుకమ్మ.



వేడుక


నేడు సద్దుల బతుకమ్మ



బతుకమ్మ వేడుకల్లో చివరి రోజున 'సద్దుల బతుకమ్మ' లేదా 'పెద్ద బతుకమ్మ'గా గౌరమ్మను ఆరాధిస్తారు. ఈ ఏడాది ఆశ్వయుజ శుద్ధ అష్టమి (దుర్గాష్టమి) తిథి సోమ, మంగళవారాల్లో ఉండడడంతో... కొన్ని ప్రాంతాల్లో సోమవారం, మరికొన్ని చోట్ల మంగళవారం సద్దుల బతుకమ్మను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పెద్ద పళ్ళెంలో గుమ్మడి ఆకులు, రంగులు అద్దిన గునుగు పూలు, తంగేడు, ఇతర రంగురంగుల పూలతో బతుకమ్మను పేరుస్తారు. సద్దులను నైవేద్యం పెట్టి, పూజలు చేస్తారు. అనంతరం రాత్రి వరకూ ఆటపాటలతో అమ్మవారిని కొలిచి, బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు.

నైవేద్యం: మలీద ముద్దలు (లడ్లు), చింతపండు పులిహోర, కొబ్బరి అన్నం. నువ్వుల అన్నం, పెరుగన్నం తదితరాలు

దుర్గా నవరాత్రులు



నేటి అలంకారం
శ్రీ సరస్వతీ దేవి

శ్రీ సరస్వతీ దేవి (మూలా నక్షత్రం)
ఆశ్వీయుజ శుద్ధ సప్తమి, సోమవారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఈ రోజున శ్రీ సరస్వతీ దేవిగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. ఈ శరన్నవరాత్రుల్లో మూలా నక్షత్రానికి అధిక ప్రాముఖ్యం ఉంది. మూలా నక్షత్రం అమ్మవారి జన్మ నక్షత్రం. దుర్గాదేవి చదువుల తల్లి సరస్వతీదేవి రూపంలో దర్శనమిచ్చే రోజు ఇది. బ్రహ్మ చైతన్య స్వరూపిణిగా సరస్వతీదేవిని పురాణాలు వర్ణించాయి. ఆసనంగా శ్వేతపద్మాన్ని అధిష్ఠించి, వీణ, దండ, కమండలాలు, అక్షమాల ధరించి, అభయముద్రతో భక్తుల అజ్ఞాన తిమిరాలను ఆమె దూరం చేస్తుందని విశ్వాసం. నవరాత్రుల్లో మూలా నక్షత్రం నుంచి విజయదశమి వరకు విశేష పుణ్యదినాలుగా భక్తులు పరిగణించి, అమ్మను ఆరాధిస్తారు. మహాకాళి, మహాలక్ష్మీ, మహాసరస్వతిగా త్రిశక్తి స్వరూపిణి అయిన దుర్గాదేవి తన అంశలోని నిజస్వరూపాన్ని సాక్షాత్కరింపచేయడమే ఈ రోజు చేసే అలంకార ప్రత్యేకత. త్రిశక్తుల్లో సరస్వతి మూడో శక్తి రూపం. సంగీత సాహిత్యాలకు అధిష్ఠాన దేవత. ఈ తల్లిని ఆరాధించడం వల్ల బుద్ధి వికాసం, విద్యాలాభం, కలుగుతాయి. చింతామణి, జ్ఞాన, నీల, ఘట, కిణి, అంతరిక్ష, మహాసరస్వతులుగా సప్తనామాలతో అలరారే వాగ్దేవి ప్రాణుల నాలుకపై నర్తించే బుద్ధిప్రదాయిని. ఆమెను కొలిస్తే విద్యార్థులకు చదువు బాగా వస్తుందనీ, జ్ఞానజ్యోతులను ఆమె ప్రసాదిస్తుందనీ, వాక్శుద్ధి, మంచి బుద్ధీ ఇస్తుందనీ నమ్మిక.

నైవేద్యం: దధ్యోదనం, పాయసం, ఇతర తీపి పదార్థాలు
అలంకరించే చీర రంగు: తెలుపు, **అర్చించే పూలు:** కలువ పూలు
పారాయణ చెయ్యాల్సింది: సరస్వతీ స్తోత్రాలు

స్విట్జర్లాండ్‌లో రుద్రాక్షకు భలే డిమాండ్



న్యూఢిల్లీ: భారతీయ ఆధ్యాత్మికతకు ప్రతీక అయిన రుద్రాక్షలు ఇప్పుడు అంతర్జాతీయ వెల్‌నెస్ మార్కెట్‌లో కీలక స్థానం ఏర్పడింది. ప్రధానంగా స్విట్జర్లాండ్‌లో భారతీయ ప్రవాసులే కాకుండా, స్థానిక ప్రజలు కూడా రుద్రాక్షల కోసం విపరీతమైన ఆసక్తి కనబరుస్తున్నారు. ఇదిభారత ఎగుమతిదారులకు అద్భుతమైన అవకావమని అధికారులు చెబుతున్నారు. వచ్చే నెల 1 నుంచి అమలులోకి రానున్న ఇండియా-ఈఎఫ్‌టీఏ వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టీఈపీఏ).. ఇందుకు ప్రధాన దోహదకారి కానుందని అధికారులంటున్నారు. 2024-25లో భారత్ రూ.0.97 కోట్ల విలువైన రుద్రాక్షను ఎగుమతి చేసింది. ప్రవాస భారతీయులే కాకుండా స్థానిక స్విస్ ప్రజల్లో వెల్‌నెస్, యోగాపై పెరుగుతున్న ఆసక్తిని ఆసరా చేసుకుని జ్యూరిచ్‌లోని యోగా ఆన్‌లైన్ స్టోర్లు, వెల్‌నెస్ దుకాణాలు శరీరాన్ని చల్లబరిచే శక్తి కలిగిన ఉత్పత్తులుగా రుద్రాక్షకు ప్రచారం కల్పిస్తున్నాయి. ఒక్కో మాలను 50 స్విస్ ఫ్రాంకులకు (దాదాపు రూ.4,659) విక్రయిస్తున్నాయి.

రూ.2,000 కోట్లతో చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు

దేశవ్యాప్తంగా 72,300 స్టేషన్లు; నోడల్ ఏజెన్సీగా భెల్.. కేంద్రం మార్గదర్శకాలు జారీ

న్యూఢిల్లీ: విద్యుత్ వాహనాల వ్యాప్తికి సమస్యగా మారిన చార్జింగ్ స్టేషన్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రభుత్వ నిర్వహణలో రూ.2,000 కోట్ల పెట్టుబడితో దేశవ్యాప్తంగా 72,300కు పైగా చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. పీఎం-ఈ డ్రైవ్ కింద ఏర్పాటు చేసిన రూ.10,900 కోట్ల ప్రత్యేక నిధి నుంచి ఈ పథకానికి అవసరమైన రూ.2,000 కోట్లు ఖర్చు చేస్తారు. భెల్‌ను ఈ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు నోడల్ ఏజెన్సీగా నియమించారు.



ప్రధాన మార్గదర్శకాలు

- ప్రభుత్వ కార్యాలయాలు, నివాస సముదాయాలు, ఆస్పత్రులు, విద్యా సంస్థల్లో ఏర్పాటు చేసే ఈవీ చార్జింగ్ స్టేషన్లకు పూర్తి సబ్సిడీ.
- కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణ కింద నగరాలు, రహదారులు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, ఓడ రేవులు, పెట్రోల్ బంకుల వద్ద ఏర్పాటు చేసే చార్జింగ్ స్టేషన్ల యంత్ర పరికరాలపై 70% నుంచి 80% సబ్సిడీ.
- నగరాల్లోని రోడ్లు, షాపింగ్ మాల్స్ మార్కెట్ కాంప్లెక్స్‌ల వద్ద ఏర్పాటు చేసే చార్జింగ్ స్టేషన్ల పరికరాల ధరపై 80% వరకు సబ్సిడీ.
- బ్యాటరీ స్వాపింగ్, బ్యాటరీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు 80% వరకు సబ్సిడీ.
- నిబంధనల అమలు, పనితీరు ఆధారంగా సబ్సిడీ విడుదల.
- పది లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలు, స్మార్ట్ నగరాలు, మెట్రోతో అనుసంధానమైన పట్టణాలు, రాష్ట్రాల రాజధానులు, జాతీయ, రాష్ట్ర రహదారులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రాధాన్యత.

మరో పావు శాతం రెపో కోత?

- ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా
- నేటి నుంచి ద్రవ్య విధాన కమిటీ భేటీ
- బుధవారం ఆర్‌బీఐ పాలసీ



ముంబై: ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) నేటి నుంచి మూడు రోజుల పాటు భేటీ అవుతోంది. వచ్చే రెండు నెలల పాటు అమలులో ఉండే ద్వైమాసిక ద్రవ్య, పరపతి విధానాన్ని బుధవారం మల్హోత్రా ప్రకటించనున్నారు. అయితే ఈ సారి కూడా కీలక రెపోరేటును ఎంపీసీ యథాతథంగా ప్రస్తుత 5.5 శాతం వద్దే ఉంచుతుందా లేక మరో పావు శాతం తగ్గిస్తుందా అనే అంశంపై ఆర్థిక నిపుణుల్లో భిన్నాభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఎస్‌బీఐ రీసెర్చి మాత్రం రెపోరేటును ప్రస్తుత 5.5 శాతం నుంచి 5.25 శాతానికి కుదించే అవకాశం ఉందని అంచనా వేసింది. రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం 4% కన్నా దిగువనే ఉండడం ఇందుకు ప్రధానంగా దోహదం చేస్తుందని తెలిపింది. క్రిసిల్ ప్రధాన ఆర్థికవేత్త ధర్మకీర్తి జోషి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

మళ్లీ యథాతథ స్థితే !

రిటైల్ ద్రవ్యోల్బణం అదుపులోనే ఉన్నప్పటికీ ఈ సారి కూడా రెపోరేటును యథాతథంగా 5.5 శాతం వద్ద కొనసాగించే అవకాశమే ఎక్కువనే వాదన కూడా వినిపిస్తోంది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ట్రంప్ సుంకాల ప్రభావంపై ఇంకా ఒక అంచనాకు రాలేకపోవడం ఇందుకు కారణమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. 'అక్టోబరు 1న వెలువడే భేటీలోనూ ఎంపీసీ రెపోరేటులో మార్పులు చేసే అవకాశం తక్కువ. ప్రస్తుతం అంత అవసరం సైతం లేదు' అని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ప్రధాన ఆర్థికవేత్త మదన్ సబ్నవిస్ అభిప్రాయం వ్యక్తం చేశారు. జీఎస్‌టీ 2.0 నేపథ్యంలో రిటైల్ ద్రవ్యోల్బణం పెద్దగా పెరిగే ప్రమాదం లేకపోవడం, జీడీపీ వృద్ధి రేటుకూ ఢోకా లేకపోవడం కూడా ఆర్‌బీఐ నిర్ణయాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆటుపోట్లకు అవకాశం

దేశీయ స్టాక్ మార్కెట్ ఈ వారం తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యే అవకాశముంది. ఇప్పటికే ఏడు వరుస సెషన్లలో ప్రధాన సూచీలు పతనమవుతూ వచ్చాయి. ఒకవైపు ట్రంప్ టారిఫ్ ప్రకటనలు, మరోవైపు ఎఫ్ఐఐలు వెళ్లిపోతుండడం, భౌగోళిక-రాజకీయ పరిణామాలు ఇందుకు కారణం. సానుకూల సెంటిమెంట్ నెలకొంటే మళ్లీ కొనుగోళ్లు పెరగొచ్చు. ప్రస్తుతం నాన్ ఫెర్రస్ మెటల్స్, ఐరన్ అండ్ స్టీల్, ఇన్‌ఫ్రా, ఆటోమొబైల్, పవర్ సెక్టార్లో కాస్త మూమెంటమ్ కనిపిస్తోంది.

స్టాక్ రికమెండేషన్స్

గోద్రేజ్ అగ్రో: ఈ ఏడాది జూలై నుంచి ఈ షేర్ డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తూ మరోసారి కీలక మద్దతు స్థాయికి చేరుకుంది. గత శుక్రవారం 4.09% లాభంతో రూ.715 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు స్వల్పకాల వ్యూహంతో రూ.700పై స్థాయిలో కొనుగోలు చేయవచ్చు. రూ.825 టార్గెట్ పెట్టుకోవాలి. స్టాప్‌లాస్ :రూ.675.

టీవీఎస్ మోటార్స్: కొన్ని నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం పుల్‌బ్యాక్ అయింది. కీలక 20 ఈఎంఏ వద్ద కదలాడుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. ఈ సెక్టార్‌పై సానుకూల ప్రభావం ఉంది. గత శుక్రవారం రూ.3,414 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.3,550 టార్గెట్ ధరతో రూ.3,400 శ్రేణిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.3,370.

మ్యాక్స్ హెల్త్: జీవితకాల గరిష్ఠానికి చేరాక ఈ షేర్లలో దిద్దుబాటు మొదలై ఇప్పటికే 15% మేర పతనమైంది. పరిస్థితులు అనుకూలిస్తే మళ్లీ పుంజుకోవచ్చు. గత శుక్రవారం రూ.1123 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు స్వింగ్ ట్రేడ్ చేయొచ్చు. రూ.1250/1300 టార్గెట్ ధరతో రూ.1100 శ్రేణిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ. 1070.

మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్స్: కొన్ని నెలలుగా సైడ్‌వేస్‌లో చలిస్తున్న ఈ షేర్లలో రిలేటివ్ స్ట్రెంత్ పుంజుకుంటోంది. గత శుక్రవారం రూ.279 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.340 టార్గెట్ ధరతో రూ.270 స్థాయిలో ప్రవేశించవచ్చు. స్టాప్‌లాస్ : రూ.250.

ఏయూ బ్యాంకు: జూలై నుంచి క్రమంగా దిద్దుబాటుకు లోనైన ఈ షేర్లు ప్రస్తుతం పుంజుకుంటున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.743 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.840 టార్గెట్ ధరతో రూ.740/720 శ్రేణిలో పెట్టుబడి పెట్టవచ్చు. స్టాప్‌లాస్ : రూ. 700.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



24,600 దిగువన మరింత బలహీనం


వి. సుందర్ రాజా

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం మొత్తం ఐదు రోజులూ ఎడతెరిపి లేని డౌన్‌ట్రెండ్‌లో ట్రేడయి 670 పాయింట్ల నష్టంతో గత శుక్రవారం 24,650 వద్ద ముగిసింది. ర్యాలీ అనంతరం మూడు వారాలుగా బలమైన కరెక్షన్‌లో ట్రేడవుతుండడం మరింత అప్రమత్త సంకేతం. గత వారం ఊహించిన దాని కన్నా ఎక్కువ కరెక్షన్ సాధించడమే కాకుండా కీలక స్థాయి 25,000 కన్నా దిగజారింది. భారీ అమ్మకాల ఒత్తిడి కారణంగా మిడ్‌క్యాప్-100 సూచీ 2,700 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 సూచీ 940 పాయింట్ల మేరకు నష్టపోయాయి. మార్కెట్లో ప్రధాన ట్రెండ్ బలహీనంగానే ఉంది. గత వారం నిట్టనిలువుగా పతనమైనందు వల్ల టెక్నికల్ రికవరీకి ఆస్కారం ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ముందుగా మార్కెట్ స్థిరపడాలి. కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: మైనర్ రికవరీ బాట పట్టినట్టయితే భద్రత కోసం మైనర్ నిరోధం 24,800 వద్ద నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 25,000. ఇదే స్వల్పకాలిక నిరోధం కావడం వల్ల ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 24,600 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలం కావడం మరింత బలహీనత సంకేతం. ప్రధాన మద్దతు స్థాయి 24,300. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనత ప్రదర్శిస్తుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 24,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారంలో డౌన్‌ట్రెండ్‌లో ట్రేడయి ఈ నెలకు కనిష్ఠ స్థాయి 54,400 వద్ద ముగిసింది. ప్రధాన నిరోధ స్థాయి 55,000. ప్రధాన మద్దతు స్థాయి 54,000. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. అప్రమత్తత తప్పదు.

పాటర్న్: మార్కెట్ దీర్ఘకాలిక సైడ్‌వేస్ ట్రెండ్‌లో ఉంది. గత కొద్ది నెలలుగా స్వల్పకాలిక ఎగుడు దిగుడులు, డౌన్‌ట్రెండ్ పాటర్న్‌లు ఏర్పడ్డాయి. సానుకూలత కోసం 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్ : ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,800, 24,860
మద్దతు	24,600, 24,520

బిజినెస్

ఈ వారంలో రెండు ఐపీఓలు

న్యూఢిల్లీ: ఈక్విటీ మార్కెట్లో ఈ వారం రెండు ప్రాథమిక పబ్లిక్ ఇష్యూలు (ఐపీఓ) విడుదల కానున్నాయి. అహ్మదాబాద్‌కు చెందిన సుబా హోటల్స్ ఇష్యూ సోమవారం ప్రారంభమై బుధవారం ముగుస్తుంది. కోవర్కింగ్ విభాగంలోని వియ్ వర్క్ ఇష్యూ వచ్చే శుక్రవారం ప్రారంభమై అక్టోబరు 7వ తేదీన ముగుస్తుంది. రూ.75.47 కోట్ల సమీకరణ లక్ష్యంగా మార్కెట్లోకి వస్తున్న సుబా హోటల్స్ షేరు ధర శ్రేణిని రూ.105-111గా ప్రకటించింది.

- వియ్ వర్క్ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ఇష్యూ జారీ చేస్తోంది. ఈ కంపెనీ బెంగళూరు, పుణె, హైదరాబాద్, గురుగ్రామ్, నోయిడా, ఢిల్లీ, చెన్నై నగరాల్లో కార్యాలయాలు నిర్వహిస్తోంది.
- స్పిరిట్ తయారీ కంపెనీ ఆల్కోబ్రూ డిస్టిలరీస్, ఫిన్‌టెక్ కంపెనీ పే నియర్‌బై, ప్రెసిషన్ కాంపోనెంట్స్ తయారీదారు ఎంఐఎం, కేబుల్ తయారీలోని లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా, డిజిటల్/ఐటీ కన్సల్టింగ్ రంగంలోని సీఎస్ఎం టెక్నాలజీస్‌తో పాటు బిహారీ లాల్ ఇంజనీరింగ్ కంపెనీలు ఐపీఓల జారీకి అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తు సమర్పించాయి.

25000 పైన బుల్లిష్

(సెప్టెంబరు 29-అక్టోబరు 3 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి


గ్రహ విశ్లేషణ

నిఫ్టీ గతవారం 25201-24629 పాయింట్ల మధ్యన కదలాడి 672 పాయింట్ల నష్టంతో 24655వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25000 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24974, 24864, 24932, 24162 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి : 25000 బ్రేక్‌డౌన్ స్థాయి : 24300
నిరోధ స్థాయిలు : 24850, 24950, 25050 (24750 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 24450, 24350, 24250 (24550 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (వెక్ 100 గుడ్లు)



29వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	550
వరంగల్	502	గోదావరి	540
చిత్తూరు	543	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	117
వరంగల్	105	గుంటూరు	120
కరీంనగర్	105	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	97
కర్నూలు	105	నెల్లూరు	102
విశాఖపట్నం	122	అనంతపురం	102
గోదావరి	117		

గ్రూప్-2 ఫలితాలు విడుదల

పురుషుల్లో టాపర్ హర్షవర్ధన్.. మహిళల్లో వినీషారెడ్డి.. 783 పోస్టులకు గాను 782 మంది ఎంపిక



తుది జాబితా ప్రకటిస్తున్న టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 తుది ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆదివారం విడుదల చేసింది. మొత్తం 783 పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా.. 782 పోస్టులకు ఎంపికైనవారి జాబితాను వెబ్‌సైట్లో ఉంచింది. విజేతలు కోరిన విధంగా వారికి శాఖలు కేటాయించామని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. పురుషుల్లో హర్షవర్ధన్ టాపర్‌గా నిలవగా.. సచిన్, మనోహర్ రావు, శ్రీరామ్ మధు, ప్రీతం రెడ్డి తర్వాతి స్థానాల్లో ఉన్నారు. మహిళల్లో వినీషారెడ్డి టాపర్‌గా నిలవగా, సుస్మిత, శ్రీదేవి, శ్రీలత, స్నేహ తొలి ఐదు స్థానాలు సాధించారని చైర్మన్ వెల్లడించారు. పురుషుల్లో మొదటి ర్యాంకర్ హర్షవర్ధన్ సచివాలయంలోని సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లో ఏఎస్‌వో పోస్టును సాధించగా, మిగతా నలుగురూ రిజిస్ట్రేషన్ శాఖలో సబ్ రిజిస్ట్రార్ పోస్టులను ఎంచుకున్నారు. మహిళల్లో నాలుగో ర్యాంకరు శ్రీలత మునిసిపల్ కమిషనర్, మిగతా నలుగురూ రెవెన్యూ శాఖలో నాయబ్ తహసీల్దార్ పోస్టులను ఎంచుకున్నారు. మొత్తం పోస్టుల్లో క్రీడా కోటాలో 7 రిజర్వేషన్లు ఉండగా, అర్హులైనవారు కేవలం ఒక్కరే నియమితులయ్యారు. మిగతా 6 పోస్టులను నోటిఫికేషన్‌లో పేర్కొన్నవిధంగా ప్రతిభ ఆధారంగా ఓసీ విభాగం నుంచి ఎంపిక చేశారు.

శిక్షణలో గ్రూప్-1 విజేతలు..

టీజీపీఎస్సీ ఫలితాలు విడుదల చేయడమే ఆలస్యం.. నియామక పత్రాల అందజేత, పోస్టింగుల కేటాయింపులు ఇలా అన్నీ వెంటవెంటనే జరిగిపోతున్నాయి. భర్తీ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు.. గ్రూప్-1కు ఎంపికైన వారికి శిక్షణ కోసం పోస్టింగులను ఆదివారమే కేటాయించేశారు. శనివారం రాత్రి శిల్పారామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్, సీఎస్ రామకృష్ణారావు విజేతలకు నియామక పత్రాలు అందించిన సంగతి తెలిసిందే. రెవెన్యూ శాఖ పరిధిలోని డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు ఎంపికైన వారికి శిక్షణ కోసం పోస్టింగులు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి లోకేశ్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. మొత్తం 45మందిలో మల్టీజోన్-1లో 20 మందికి, మల్టీజోన్-2లో 25 మందికి కేటాయించారు. వీరంతా కేటాయించిన జిల్లాల్లో కలెక్టర్లకు రిపోర్టింగ్ చేయాలని లోకేశ్ కుమార్ కోరారు. మొదటి రెండేళ్లు శిక్షణకాలంగా పరిగణిస్తారు.

ఎఫ్-1, ఓపీటీ విద్యార్థులు హెచ్-1బీ కోసం..

లక్ష డాలర్లు కట్టనక్కర్లేదు

- ఇప్పటికే అమెరికాలో ఉద్యోగం చేస్తున్నవారు మరో ఉద్యోగానికి మారినా మినహాయింపు
- హెచ్4 (డిపెండెంట్) వీసాపై ఉన్నవారికీ వర్తించదు
- కొత్తగా హెచ్-1బీ వీసా జారీ కోసమే లక్ష డాలర్ల ఫీజు
- స్పష్టత ఇచ్చిన అమెరికా ఇమిగ్రేషన్ నిపుణులు
- ప్రజాభవన్‌లో అవగాహన కార్యక్రమం

బేగంపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఎఫ్-1 వీసాతో చదువుతున్న విద్యార్థులు, ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)లో ఉన్న అభ్యర్థులు హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే లక్ష డాలర్ల ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని అమెరికా ఇమిగ్రేషన్ నిపుణులు వెల్లడించారు. కొత్తగా హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రమే ఆ ఫీజు వర్తిస్తుందని స్పష్టం చేశారు. శనివారం రాత్రి హైదరాబాద్ బేగంపేటలోని ప్రజాభవన్‌లో 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' కార్యక్రమంలో భాగంగా హెచ్-1బీ ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్-1బీ వీసాల కొత్త ఫీజుపై సందేహాలను యూఎస్‌ఏ ఇమిగ్రేషన్ నిపుణులు నివృత్తి చేశారు. భారత్ సహా ఇతర దేశాల నుంచి కొత్తగా అమెరికా హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారికి మాత్రమే లక్ష డాలర్ల ఫీజు వర్తిస్తుందని వారు స్పష్టత ఇచ్చారు. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగం చేస్తూ ఇతర సంస్థలకు మారితే ఈ ఫీజు వర్తించదని తెలిపారు. హెచ్-4 (డిపెండెంట్) వీసాపై ఇప్పటికే అమెరికాలో ఉన్న వారు హెచ్-1బీ కోసం దరఖాస్తు చేసుకుంటే లక్ష డాలర్ల ఫీజు నుంచి మినహాయింపు ఉంటుందని వివరించారు. అమెరికా హెచ్-1బీ వీసా దరఖాస్తు అంశంలో ఎవరికి, ఎలాంటి సందేహాలు ఉన్నా 'సీఎం ప్రవాసీ ప్రజావాణి'లో సంప్రదిస్తే నివృత్తి చేస్తామని స్టేట్ కో-ఆర్డినేటర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అమెరికా నుంచి జూమ్ ద్వారా వర్జీనియా స్టేట్ సెన్సస్ కమిషనర్ శ్రీధర్ నాగిరెడ్డి, అమెరికా రిపబ్లికన్ పార్టీ నాయకుడు బంగారు రెడ్డి పాల్గొనగా.. ప్రజాభవన్‌లో అమెరికా ఇమిగ్రేషన్ అటార్నీ జాష్ డార్లింపెల్, ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ వినోద్ కుమార్, ఇమిగ్రేషన్ నిపుణుడు హరికృష్ణ, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గంగనీళ్ల జాతర



నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో అశేష భక్తజనం మధ్య గంగనీళ్ల జాతర ఘనంగా జరిగింది. శనివారం రాత్రి సాంగ్వి చేరుకున్న పోచమ్మ తల్లి గ్రామంలోని గంగపోచమ్మ చెంత నిద్దరోయింది. ఆదివారం తెల్లవారు జామున గోదావరి నదీమ తల్లి చెంతకు చేరింది. శుద్ధి అనంతరం భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆభరణాల మూటతో సారంగాపూర్ మండలంలో ప్రవేశించిన అమ్మవారు తిరిగి తన సన్నిధి అడెల్లికి బయలెల్లింది. - దిలావర్‌పూర్

అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా.. ఆర్ఎస్ఐ


పుల్ల సాయిచరణ్ గౌడ్

రఘునాథపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన పుల్ల రవి-పద్మ దంపతుల చిన్న కుమారుడు పుల్ల సాయిచరణ్ గౌడ్ గ్రూపు-2లో సత్తా చాటి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లో ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ గ్రూపు-2 పరీక్షలు రాసి రాష్ట్రస్థాయిలో 92వ ర్యాంకు సాధించారు. సాయిచరణ్ అన్న సాయికిరణ్ మంచిర్యాల బెటాలియన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. తన అన్న, భార్య అక్షిత ప్రోత్సాహంతోనే ర్యాంకు సాధించానని సాయిచరణ్ తెలిపారు.

వ్యవసాయ కూలీ.. ఎక్సైజ్ ఎస్సైగా..


భూక్య యాకూబ్

కొత్తగూడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించి.. వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ చదువుకున్న యువకుడు ఎక్సైజ్ ఎస్సై పోస్టు కొట్టాడు. ఆ యువకుడి పేరు.. భూక్య యాకూబ్. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పోలారం గ్రామానికి చెందిన భూక్య భిక్షం, భిచ్చని దంపతులు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు యాకూబ్, శ్రీనివాస్, కూతురు గౌషా ఉన్నారు. కష్టపడి పీజీ దాకా చదువుకున్న యాకూబ్.. తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేందుకు వ్యవసాయకూలీగా వెళ్తుండేవారు. ఎటువంటి కోచింగ్ తీసుకోకుండానే.. హైదరాబాద్ చిక్కడపల్లిలోని సెంట్రల్ లైబ్రరీలో చదువుకుని గ్రూప్-2లో ఎస్టీ కేటగిరీలో 27వ ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 752వ ర్యాంకు సాధించి ఎక్సైజ్ ఎస్సైగా ఉద్యోగం సాధించారు. గ్రూప్-3లో సైతం ఎస్టీ కేటగిరీలో 8వ ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 644 ర్యాంకు సాధించారు.


కొమ్మనబోయిన నరేందర్, సురేశ్‌రెడ్డి, గుగులోతు కుమార్

గ్రూప్-2లో మెరిసిన పంచాయతీ కార్యదర్శులు
ఉన్నత ఉద్యోగాలు సాధించిన ఇద్దరు ఎస్జీటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, మహబూబాబాద్ రూరల్, చెన్నారావుపేట, పర్వతగిరి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు సత్తా చాటారు. జిల్లా కేంద్రమైన మహబూబాబాద్ మండలం సంద్రాలగూడెం పంచాయతీ కార్యదర్శి కొమ్మనబోయిన నరేందర్ రాష్ట్ర స్థాయిలో 201వ ర్యాంకుతో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సాధించారు.వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్ర పంచాయతీ కార్యదర్శి కాసర్ల సురేశ్‌రెడ్డి .. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం పెద్ద తండా గ్రామపంచాయతీ కార్యదర్శి గుగులోతు కుమార్ కూడా ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికయ్యారు. రాయపర్తి మండలం సన్నూరు జయరాం తండా గుగులోతు జీజా కీమా దంపతుల కుమారుడైన కుమార్ సన్నూరులో పదో తరగతి వరకు చదువుకున్నారు. తొర్రూరులో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ గ్రూప్-2 లో ఎక్సైజ్ ఎస్సైగా ఉద్యోగం సాధించారు. శాయంపేట మండలం నేరుడుపల్లికి చెందిన కొమురమ్మ, సమ్మయ్య దంపతుల కుమారుడు రాచమల్ల తిరుపతి 2008లో డీఎస్సీ రాసి 2010లో ఎస్జీటీగా ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. ఉన్నత ఉద్యోగంపై తపనతో గ్రూప్-2 రాసి చేనేత జౌళి శాఖలో అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. జనగామ జిల్లా చిల్పూరు మండలం శ్రీపతిపల్లెకు చెందిన సిద్ధయ్య, ఎల్లమ్మ దంపతుల కుమారుడైన రొడ్డ మహేందర్ కూడా 2008 డీఎస్సీలో ఎంపికై ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. గ్రూప్-2 పరీక్షల్లో సత్తా చాటి రాష్ట్ర సచివాలయంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు.

పట్టుపట్టి సాధించారు!

గ్రూప్ 2లో 2, 3 ర్యాంకులు సాధించిన ఉమ్మడి మెదక్ జిల్లావాసులు


వడ్లకొండ సచిన్, మనోహర్‌రావు

సిద్దిపేట కల్చరల్/నారాయణఖేడ్ సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీటెక్ చదివి ఐటీ ఉద్యోగం చేసి, పోటీపరీక్షలపై దృష్టి సారించి పట్టుదలతో ఉద్యోగం సాధించిన వ్యక్తి ఒకరు.. డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తూనే మరోసారి గ్రూప్-2 పరీక్షలు రాసి మెరుగైన ఉద్యోగం సాధించిన ప్రతిభావంతుడు మరొకరు!! ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వీరిద్దరూ ఎన్నో కష్టాలను తట్టుకుని గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 2, 3 ర్యాంకులు సాధించి సత్తా చాటారు. వీరిలో రెండో ర్యాంకరు వడ్లకొండ సచిన్ గ్రూప్-1, గ్రూప్-3 పరీక్షల్లోనూ అద్భుత ప్రతిభ కనబరిచి కొలువులు సాధించడం గమనార్హం. సిద్దిపేట వాసి సచిన్ ఢిల్లీలోని బీఎంఎల్ యూనివర్సిటీలో బీటెక్ పూర్తయ్యాక 2019లో ఓ ఐటీ కంపెనీలో చేరి ఏడాది ఉద్యోగం చేశారు. కొవిడ్ లాక్‌డౌన్‌లో ఇంటి నుంచి పని చేస్తున్నప్పుడు సివిల్స్‌పై దృష్టి సారించారు. ఆ పరీక్షల కోసం సొంతంగానే సిద్ధమయ్యారు. 2021, 22లో రెండుసార్లు సివిల్స్ రాసినా క్వాలిఫై కాలేదు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి నోటిఫికేషన్లు రావడంతో గ్రూప్స్‌కు దరఖాస్తు చేశారు. గ్రూప్ 3 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 23వ ర్యాంకు సాధించారు. గ్రూప్ 1 ఫలితాల్లో 360వ ర్యాంకు సాధించి ఎంపీడీవో పోస్టుకు ఎంపికై, ఈ నెల 27న నియామకపత్రం కూడా అందుకున్నారు. ఆదివారం విడుదలైన గ్రూప్ 2 తుది ఫలితాల్లో.. సచిన్ సబ్ రిజిస్ట్రార్ పోస్టుకు ఎంపికయ్యారు. అపాయింట్‌మెంట్ ఆర్డర్ రాగానే ఈ పోస్టులో జాయిన్ అవుతానని తెలిపారు. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్ గ్రామ వాసి మనోహర్‌రావు గ్రూప్ 2 ఫలితాల్లో సత్తాచాటి సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగాన్ని సాధించారు. మారుమూల గ్రామమైన ఉజలంపాడ్ గ్రామ వాసి బి.పండరినాథ్, కమలమ్మ దంపతుల రెండో కుమారుడైన మనోహర్‌రావు గతంలో పీజీటీ, టీజీటీలో ఉద్యోగాలు సాధించారు. గ్రూప్-2లో కూడా సత్తా చాటి, డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. అనంతరం స్కూల్ అసిస్టెంట్‌గా, జేఎల్‌గాను అవకాశాలు దక్కించుకున్నప్పటికీ, ఉన్నతమైన ఉద్యోగం కోసం మరోసారి గ్రూప్-2 పరీక్షలు రాసి తన ప్రతిభను నిరూపించుకున్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

వినయ విధేయ రామ



రామ్‌చరణ్ ఇండస్ట్రీలో హీరోగా 18 ఏళ్ల కెరీర్‌ను పూర్తిచేసుకున్నారు. 2007లో పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'చిరుత' సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు చరణ్. 'మగధీర', 'రంగస్థలం', 'ఆర్ఆర్ఆర్' లాంటి సినిమాలతో బాక్సాఫీసు దగ్గర సత్తాచాటారు. ప్రస్తుతం ఆయన బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' సినిమాలో నటిస్తున్నారు. ఇందులో చరణ్ ఊరమాస్ లుక్‌లో కనిపించనున్నారు. ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్ "మా 'పెద్ది' 18 ఏళ్ల సినీ కెరీర్‌ను పూర్తిచేసుకోవడం ఎంతో సంతోషకరం. తెరపై ఘనమైన వారసత్వాన్ని కొనసాగిస్తూనే, బయట వినయ విధేయతలు కలిగి ఉండడం చరణ్ ప్రత్యేకత. నటుడిగా తనకంటూ ఓ ప్రత్యేకమైన పంథాను ఏర్పాటు చేసుకున్నాడు. 'పెద్ది' నుంచి త్వరలోనే మరిన్ని సర్‌ప్రైజులు ఉండబోతున్నాయి' అని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



గొప్ప బ్లాక్‌బస్టర్‌గా నిలుస్తుంది

ఎన్టీఆర్

'నా బాల్యంలో మా అమ్మమ్మ కొన్ని కథలు చెప్పారు. అవి నా కెంతో బాగా నచ్చేవి. ఆ కథల నుంచి ఓ దర్శకుడు 'కాంతార' లాంటి గొప్ప 'సినిమా తీస్తాడని నేను ఏ రోజూ ఊహించలేదు. నా సోదరుడు రిషబ్‌శెట్టి అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. 'కాంతార: ఛాప్టర్ 1' కోసం ఆయన పడిన కష్టం నేను కళ్లారా చూశాను. ఇలాంటి సినిమా తీయడం మామూలు విషయం కాదు. ఒక గొప్ప బ్లాక్‌బస్టర్‌గా నిలుస్తుంది' అని జూనియర్ ఎన్టీఆర్ అన్నారు. రిషబ్‌శెట్టి కథానాయకుడిగా నటించిన 'కాంతార: ఛాప్టర్ 1' చిత్రం అక్టోబర్ 2న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రీలీజ్ ఈవెంట్‌కు ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రిషబ్ అరుదైన నటుడు, దర్శకుడు. 24 విభాగాలను డామినేట్ చేయగల ప్రతిభా పాటవాలు ఆయన సొంతం. ఈ చిత్రం మనందరినీ రంజింపచేస్తుంది. ఈ సినిమాను ఆదరించి, రిషబ్ కష్టానికి మీ ఆశీర్వాదాలు అందజేయండి' అని అభిమానులను కోరారు. రిషబ్‌శెట్టి మాట్లాడుతూ 'ఎన్టీఆర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవ్వడం సంతోషాన్నిచ్చింది. 'కాంతార' చిత్రానికి గొప్ప విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులకు రుణపడి ఉంటాను. ఈ చిత్రాన్ని కూడా అదే స్థాయిలో విజయవంతం చేయాలి' అని ప్రేక్షకులను కోరారు. 'కాంతార 1'లో కీలకమైన పాత్ర పోషించాను, ఈ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటుంది అని కథానాయిక రుక్మిణీ వసంత్ తెలిపారు.

ముగ్గురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్

- మృతుల్లో ఒకరు మహిళా మావోయిస్టు... ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఘటన

చింతూరు/చర్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఒక మహిళా మావోయిస్టు సహా ముగ్గురు మావోయిస్టులను భద్రతా దళాలు ఎన్‌కౌంటర్ చేశాయి. ఛత్తీస్‌గఢ్‌లోని అడవుల్లో ఆదివారం జరిగిందీ ఎన్‌కౌంటర్. విశ్వసనీయ సమాచారం మేరకు కాంకేర్, గరియాబంద్ జిల్లాల సరిహద్దులోని చిండ్‌ఖడక్ గ్రామ సమీప కొండలపై మావోయిస్టులు ఉన్నారని కాంకేర్ ఎస్పీ ఇందిరా కల్యాణ్‌కు సమాచారం అందింది. దీంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ), సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్), కోబ్రా, ఎస్టీఎఫ్ బలగాలను ఆ కొండ వద్దకు పంపించారు. వీరికి మావోయిస్టులు తారసపడటంతో ఎదురు కాల్పులు జరిగాయి. మృతులను సీతానది ఏరియా కమిటీ కార్యదర్శి సర్వన్ మఢ్కం అలియాస్ విశ్వనాథ్, నగిరి ఏరియా కమిటీ సభ్యుడు రాజేశ్ అలియాస్ రాకేశ్ హేమ్లా, మెయిన్‌పూర్-నువాపాడ రక్షణ బృందం సభ్యురాలు బసంతి కుంజాం అలియాస్ హిడ్మేగా గుర్తించారు. ఘటనా స్థలంలో పలు ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతులు ముగ్గురిపై మొత్తంగా రూ.14 లక్షల రివార్డు ఉందని బస్తర్ రేంజ్ ఐజీ సుందరరాజ్ చెప్పారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం కూంబింగ్ కొనసాగుతోందన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో 252 మంది మావోయిస్టులు మృతి చెందారని, వీరిలో 223 మంది కాంకేర్ జిల్లాతో సహా బస్తర్ డివిజన్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో చనిపోయారని పేర్కొన్నారు. కాగా, యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో భాగంగా ఆదివారం కేంద్ర బలగాలు తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మీదుగా పూజారి కాంకేర్ అడవుల్లోకి ప్రవేశించాయి.

గురుకుల నిత్యావసర బిల్లుల పెండింగ్ సిగ్గుచేటు: హరీశ్

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలకు నిత్యావసరాలు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు 6 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్‌రావు దుయ్యబట్టారు. గురుకులాల నిత్యావసరాల సరఫరా కాంట్రాక్టర్లు ఆదివారం హరీశ్‌ను ఆయన నివాసంలో కలుసుకుని తమ గోడు వెల్లబోసుకున్నారు. బకాయిల చెల్లింపు విషయమై తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. నెలల తరబడి బిల్లులు పెండింగ్ పెడితే కాంట్రాక్టర్లు గురుకుల పాఠశాలలకు నిత్యావసర వస్తువులెలా సరఫరా చేస్తారని, విద్యార్థులకు నాణ్యమైన భోజనమెలా అందుతుందని ప్రశ్నించారు. విద్యార్థులు పస్తులుండొద్దన్న బాధ్యతతో కాంట్రాక్టర్లు అప్పు చేసి మరీ నిత్యావసరాలు సరఫరా చేస్తున్నారని.. సకాలంలో బిల్లులు రాక వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కల్తీ ఆహారంతో గురుకుల పాఠశాలల విద్యార్థులు ఆస్పత్రుల పాలై ప్రాణాలు కోల్పోతున్నా.. ప్రభుత్వానికి పట్టింపు లేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా సర్కారు కళ్లు తెరిచి.. కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు చెల్లించి.. విద్యార్థులకు నాణ్యమైన భోజనమందేలా చూడాలని హరీశ్ డిమాండ్ చేశారు.

ఇంటింటికీ 'కాంగ్రెస్ బకాయిల' కార్డు!

- ఆ పార్టీ మోసాలే స్థానిక ఎన్నికల్లో మా ప్రచారాస్త్రం: కేటీఆర్

నాగర్‌కర్నూల్/అచ్చంపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నడుస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని.. జాయింట్ వెంచర్ సర్కారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు పరస్పర అవగాహనతో ప్రభుత్వాన్ని నడుపుతున్నాయని ఆరోపించారు. ఆ రెండు పార్టీల మధ్య రహస్య అవగాహన ఉందన్నారు. ఆరు గ్యారెంటీల పేరిట రాష్ట్ర ప్రజల్ని తప్పుదోవ పట్టించిన కాంగ్రెస్ ప్రభుత్వ ధోరణికి నిరసనగా ఇంటింటికీ కాంగ్రెస్ బకాయి కార్డులను అందించనున్నట్లు తెలిపారు. పులి బిడ్డనని చెప్పుకొనే రేవంత్‌రెడ్డికి దమ్ముంటే కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారు ఆల్మట్టి డ్యాం ఎత్తును పెంచకుండా అడ్డుకోవాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ తరపున అచ్చంపేట నుంచి రెండు సార్లు గెలిచిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఇటీవల బీజేపీలో చేరిన నేపథ్యంలో అచ్చంపేటలో జనగర్జన సభ నిర్వహించారు. ఇందులో కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారని.. ఆరు గ్యారెంటీలను మాత్రం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 8 లక్షల పెళ్లిళ్లు జరిగాయని, ఆడబిడ్డలకు ఇవ్వాల్సిన 8 లక్షల తులాల బంగారం ఎక్కడికి పోయిందని నిలదీశారు. కాంగ్రెస్ ప్రజలకు చేసిన మోసాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో అస్త్రంగా వాడుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మోసాలను ఇంటింటికీ తీసుకెళ్లి, వారికి ఉన్న బకాయి కార్డులను అందజేయాలని సూచించారు. రేవంత్ శరీరంలో అపరిచితుడు ఉన్నాడని.. ఉదయం 'రాము'లా ఉండే ఆయన సాయంత్రం 'రెమో'గా మారుతున్నాడని దుయ్యబట్టారు. కాగా, రేవంత్ అసమర్థత వల్లే తెలంగాణ అభివృద్ధి గాడి తప్పిందని కేటీఆర్ ఎక్స్‌లో మండిపడ్డారు. ఎల్‌అండ్‌టీ నుంచి మెట్రోను ప్రభుత్వం తీసుకోవడం వల్ల రూ.15 వేల కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. సీఎం తన రియల్ ఎస్టేట్ అవసరాల కోసం.. ఉనికిలో లేని ఫోర్త్‌సిటీ వైపు మళ్లించే నెపంతో ఏకపక్షంగా ఎయిర్‌పోర్ట్ మెట్రో మార్గాన్ని రద్దు చేశారని విమర్శించారు.

పదేళ్లల్లో ఇవ్వని ఉద్యోగాలను
ఇందిరమ్మ రాజ్యంలో ఇచ్చాం

- ఉనికి కోసమే కొందరి యాత్రలు: భట్టి



బోనకల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వకుండా ఇబ్బంది పెడితే, తాము అధికారంలోకి రాగానే గ్రూప్-1, 2 పరీక్షలను నిర్వహించి వేలాది మందికి ఇందిరమ్మ రాజ్యంలో ఉద్యోగాలిచ్చామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ దశల వారీగా అందరికీ ఇళ్లను ఇస్తున్నామన్నారు. ఆదివారం రాత్రి ఖమ్మం జిల్లా బోనకల్ మండలం జానకీపురం, నారాయణపురం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలను కుటుంబ సభ్యుల్లా భావిస్తూ అందరికీ సంక్షేమ పథకాలను వర్తింప చేస్తున్నామన్నారు. రాజకీయ ఉనికి కోసమే కొందరు యాత్రలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని కార్యక్రమాలున్నా మధిర నియోజకవర్గంలో రోజువారీ అభివృద్ధి పనుల గురించి సమీక్షిస్తుంటానన్నారు. రాజకీయాలు పక్కనబెట్టి అభివృద్ధి విషయంలో ప్రతిపక్ష పార్టీలు కలిసి రావాలని కోరారు.

పాములు, బల్లుల అక్రమ రవాణా

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టివేత


విమానంలో అక్రమంగా తరలిస్తున్న బల్లులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విదేశీ సరీసృపాల అక్రమ రవాణాను ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నారు. నగరానికి చెందిన ఓ వ్యక్తి బ్యాంకాక్ నుంచి ఆదివారం తెల్లవారుజామున శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. అతడి కదలికలపై అనుమానం వచ్చిన అధికారులు బ్యాగులను తనిఖీ చేశారు. ఆ తనిఖీల్లో విదేశీ సరీసృపాల జాతికి చెందిన అరుదైన పాములు, బల్లులు బయటపడ్డాయి. నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

బాంబు బెదిరింపు మెయిల్

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి గుర్తు తెలియని వ్యక్తి నుంచి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. ఈ సమాచారంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ ప్రత్యేక బలగాలు, బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో విమానాశ్రయంలోని అరైవల్స్, డిపార్చర్, పార్కింగ్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. చివరకు ఎలాంటి బాంబు లేదని భద్రతా బలగాలు నిర్ధారించాయి. కొంతకాలంగా విమానాశ్రయానికి ఇలాంటి వరుస బెదిరింపు మెయిల్స్ వస్తున్నాయని, వీటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీరియస్‌గా ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

బస్‌స్టేషన్ల నిర్మాణానికి 108 కోట్లు

» పండగ రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలి: పొన్నం

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్‌ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త డిపోల నిర్మాణం, బస్‌స్టేషన్ల ఆధునికీకరణ కోసం రూ.108.02 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన అనుమతులు జారీ చేసింది. అందులో భాగంగా 30 బస్‌స్టేషన్ల ఆధునికీకరణతో పాటు వాటిలో షాపింగ్ కాంప్లెక్సులను కూడా అధికారులు నిర్మించనున్నారు. సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల భద్రత, ఉద్యోగుల సంక్షేమం అనే మూడు విధానాలతో ఆర్టీసీ ముందుకు వెళుతోందని రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఆర్టీసీ ఉన్నతాధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆయా రూట్లలో ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేయాలని సూచించారు. దసరా సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 7,754 స్పెషల్ బస్సులను నడిపేందుకు టీజీఎస్‌ఆర్టీసీ కార్యాచరణ రూపొందించిందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుని ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆదేశించారు.

సౌరవిద్యుత్‌లో కొండారెడ్డిపల్లి ఫస్ట్: దామోదర

కల్వకుర్తి/వంగూరు సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగంలో సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లి దక్షిణ భారత దేశంలో మొదటి, దేశంలో రెండో గ్రామమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని రేవంత్ స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో ఆదివారం రూ.134 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి రాజనర్సింహ మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో 8 మెడికల్ కళాశాలలు, 74 ట్రామా కేర్ సెంటర్లు, 102 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించేందుకు పరీక్షలు ఎంతో అవసరమని చెప్పారు. విద్యార్థులకు జీవనోపాధి కల్పించేందుకు, నైపుణ్యం పెంచడానికి రాష్ట్రంలో 65 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ)ను ప్రారంభించినట్లు రాజనర్సింహ తెలిపారు.

అనర్హత పిటిషన్లపై నేటి నుంచి వాదనలు!

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై వ్యక్తిగత విచారణ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చాంబర్‌లో ఆయన సమక్షంలో పిటిషన్‌దారులు, విచారణను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల తరఫు అడ్వొకేట్లు.. వాదనలు వినిపించనున్నారు. పది మంది ఎమ్మెల్యేల్లో వివరణ ఇచ్చిన 8 మంది కేసులను స్పీకర్ విచారించనున్నారు. సోమవారం ప్రకాశ్ గౌడ్, కాలె యాదయ్య, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌లపై దాఖలైన పిటిషన్లకు సంబంధించి విచారణ జరగనుంది. అలాగే బుధవారం కూడా కొనసాగనుంది. మిగిలిన నలుగురు ఎమ్మెల్యేల విచారణ దసరా తర్వాత జరగనుంది. అయితే అనర్హత పిటిషన్లపై వాదనలు అక్టోబరు 6వ తేదీ వరకూ కొనసాగనుండడంతో అప్పటివరకు అసెంబ్లీ ఆవరణలో స్పీకర్ కార్యాలయం ఆంక్షలు విధించింది. సరైన అనుమతులు లేకుంటే విజిటర్లకు అసెంబ్లీ ఆవరణలోకి ప్రవేశం ఉండబోదని అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు స్పష్టం చేశారు. అలాగే మీడియా ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకూ ప్రవేశం లేదని పేర్కొన్నారు.

47 మంది ఏఈవోలకు పదోన్నతులు

హైదరాబాద్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 47 మంది వ్యవసాయ విస్తరణాధికారులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. మల్టీ జోన్-1 పరిధిలో 29 మంది ఏఈవోలు, మల్టీ జోన్-2 పరిధిలో 18 మంది ఏఈవోలకు ఏవోలుగా పదోన్నతి కల్పించారు. ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ గోపి ప్రత్యేక చొరవ తీసుకొని పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఏఈవోల సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆ బిల్లు ఆమోదించకపోతే రాజ్‌భవన్ ముట్టడి

» బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

హైదరాబాద్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్ ఆమోదించని పక్షంలో రెండు రోజుల్లో రాజ్‌భవన్ ముట్టడి చేపడతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. బీసీలపై బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే హైకోర్టు కేసు దరిమిలా తక్షణం కిషన్ రెడ్డి, రామచంద్రరావు గవర్నర్‌తో భేటీ కావాలన్నారు. బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్ ఎందుకు ఆమోదించడం లేదని జాజుల ప్రశ్నించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లను గవర్నర్ తక్షణమే ఆమోదించాలని కోరారు. గవర్నర్‌పై ఒత్తిడి పెంచడానికి తమ ప్రతినిధి బృందం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును కలుస్తుందన్నారు. బీసీలపై అగ్రకులాల కుట్రలను ఎండగట్టడానికి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని జాజుల చెప్పారు.

రైతులకు శ్రీరామరక్షగా మనీ లెండింగ్ చట్టం

» వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి రైతులను కాపాడటానికి ప్రభుత్వం మనీ లెండింగ్ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి తెలిపారు. పంటల పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రైతులు అప్పులు తెచ్చి నష్టపోతున్నారని.. అవి కట్టలేక చివరికి కొందరు ఆత్మహత్య చేసుకుంటున్నారని వివరించారు. రాష్ట్రంలో మనీ లెండింగ్ చట్టం-1349 అమలు కావటం లేదన్న విషయాన్ని సర్కారు దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. రైతు కమిషన్ సూచన మేరకు.. ఆ చట్టం అమలుకు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

ఆ విషయాన్ని సీఎంతో చర్చిస్తా: చామల

అమెరికాలోని తెలుగు వారు తమ సొంతూళ్లలోని సమస్యలను తీర్చేందుకు ఒక వ్యవస్థను నెలకొల్పాల్సిన అవసరముందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని చెప్పారు. అమెరికాలోని పెన్సిల్వేనియా హారిస్‌బర్గ్ తెలుగు అసోసియేషన్ ఆహ్వానం మేరకు మెకానిక్స్‌బర్గ్ వెళ్లిన చామల.. సోమవారం అక్కడ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.

గోళ్లు పీకి.. వేళ్లు నరికి.. కొట్టి.. ముగ్గురు యువతుల దారుణ హత్య

» అర్జెంటీనాలో డ్రగ్స్ గ్యాంగ్ ఘాతుకం..సోషల్ మీడియాలో లైవ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: అర్జెంటీనాలో ఓ డ్రగ్స్ గ్యాంగ్ ముగ్గురు యువతులను అత్యంత పాశవికంగా హత్య చేయడమే కాక, ఈ దారుణాన్ని ఇన్‌స్టాగ్రాం లైవ్ స్ట్రీం ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయడం ఆ దేశాన్ని కుదిపేసింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన మోరెనా(20), బ్రెండా(20), లారా(15)అనే ముగ్గురు యువతులు ఈ నెల 19న అదృశ్యమయ్యారు. ఐదు రోజుల తర్వాత నగర శివార్లలోని ఓ ఇంటి పెరట్లో పాతిపెట్టి ఉన్న యువతుల మృతదేహాలను పోలీసులు కనుగొన్నారు. ప్రాథమిక విచారణలో ఈ హత్యకు డ్రగ్స్ మాఫియాతో విభేదాలే కారణమని గుర్తించారు. "నా దగ్గర డ్రగ్స్ దొంగిలించిన వారికి ఇదే గతి పడుతుంది" అంటూ ముఠా నాయకుడు హెచ్చరించడం ఆ వీడియోలో వినపడిందని వారు ధ్రువీకరించారు. లైవ్ స్ట్రీమింగ్ ఆరోపణలపై ఇన్‌స్టాగ్రాం మాతృసంస్థ మెటా స్పందించింది. తమ ప్లాట్‌ఫాంలో ఈ వీడియోకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని, దర్యాప్తు అధికారులకు సహకరిస్తున్నామని సంస్థ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు.

హైదరాబాద్-విజయవాడ 8 వరసల రహదారి..

ఫిబ్రవరిలో పనులు ప్రారంభం!

» రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65)ని 8 వరసలుగా విస్తరించే పనులు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. ఈ పనులకు టెండర్ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్-తెలంగాణను కలిపే ఈ ప్రధాన రహదారిలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే రోడ్లలో ఇది కూడా ఒకటని తెలిపారు. ఎన్‌హెచ్-65పై ఇప్పటికే 17 బ్లాక్ స్పాట్లు గుర్తించి ఫ్లై ఓవర్లు నిర్మిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. ఇటీవల కేంద్ర మంత్రి గడ్కరీని కలిసినప్పుడు ఈ అంశాన్ని గుర్తుచేశానని, తెలుగు రాష్ట్రాల ప్రజలకు ప్రమాదరహిత రహదారిని అందుబాటులోకి తెస్తామని చెప్పినట్లు తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యతతో హైదరాబాద్-విజయవాడ రహదారిని నిర్మిస్తామని గడ్కరీ చెప్పారన్నారు. ఈ 8 వరసల రహదారి పనులు పూర్తయితే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 2గంటల్లో చేరుకోవచ్చని మంత్రి చెప్పారు. అదేక్రమంలో భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి 230కి.మీ. గ్రీన్ ఫీల్డ్ హైవే పట్ల కూడా కేంద్రమంత్రి గడ్కరీ సానుకూలంగా ఉన్నారన్నారు. డీపీఆర్, అంచనాల రూపకల్పన త్వరలో పూర్తవుతాయని, గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయని చెప్పారు.

నేడే 'స్థానిక' షెడ్యూల్?

(మొదటిపేజీ తరువాయి)

షెడ్యూల్‌ను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రక్రియను వేగంగా ముగించాలని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో.. ఎస్ఈసీ కూడా ఇందుకనుగుణంగానే చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ మేరకు గతంలో మాదిరిగా మూడు దశల్లో లేదంటే రెండు దశల్లో ఎన్నికలు ముగిసేలా షెడ్యూల్ సిద్ధంచేయనున్నట్లు తెలుస్తోంది. అన్ని స్థాయిల్లో ఎన్నికలకు సంసిద్ధత ఉన్న కారణంగా.. రెండు, మూడు వారాల్లో ఎన్నికల ప్రక్రియ ముగిసే అవకాశం ఉందంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఓటరు జాబితాను సిద్ధం చేయడమే కాకుండా.. ఎన్నికల విధుల కోసం సిబ్బంది నియామకం, శిక్షణ వంటివి ఇప్పటికే పూర్తిచేశారు. అంతేకుండా పోలింగ్ స్టేషన్ల సంఖ్యకు అనుగుణంగా బ్యాలెట్ బాక్సులను, ఎన్నికల సామగ్రిని కూడా ఇప్పటికే సిద్ధం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సోమవారం జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తే.. రెండు, మూడు వారాల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తిచేసే అవకాశం ఉంటుందని.. ఎస్ఈసీ విభాగాలు తెలిపాయి. ఎక్కువ మంది ఓటింగ్‌లో పాల్గొనేలా ఎన్నికల తేదీలను ఖరారు చేయాలని ఎస్ఈసీ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

న్యూయార్క్‌ను మరిపించేలా

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ, "ఫ్యూచర్ సిటీని గొప్ప నగరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది. ఇందుకు ప్రజలందరి సహకారం కావాలి. చిన్న చిన్న సమస్యలేవైనా ఉంటే పరిష్కరించుకుందాం. ప్రభుత్వం ఉదారంగా మిమ్మల్ని ఆదుకునేందుకు సిద్ధంగా ఉంది. నేను కూర్చుని మీ సమస్యలను పరిష్కరిస్తాను. రాజకీయ పార్టీల ఉచ్చులో పడి కోర్టులకు వెళ్లి నష్టపోవద్దు. తక్షణమే మీ సమస్యలను పరిష్కరించాలని మా అధికారులను ఆదేశిస్తున్నాను. అందరికీ న్యాయం చేయాలనేదే మా ప్రయత్నం" అని అన్నారు. వచ్చే డిసెంబరులో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ భవనాన్ని, స్కిల్ యూనివర్సిటీని పూర్తి చేస్తామని సీఎం రేవంత్ తెలిపారు. అప్పుడు నెలకు మూడుసార్లు ఇక్కడికే వచ్చి ఇక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తామన్నారు. ప్రపంచంలో ఎవరు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వచ్చినా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలోనే కూర్చుని మాట్లాడతానని, ప్రపంచాన్ని ఇక్కడికే రప్పిస్తానని అన్నారు. ఫ్యూచర్ సిటీపై కొందరు కావాలనే రాజకీయం చేస్తున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ కోసమే ఫ్యూచర్ సిటీ అంటున్నారని, తనకు ఇక్కడ భూములున్నాయంటూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. భూములుంటే వాటిని ఎవరైనా లాకర్‌లో పెట్టుకుని తిరుగుతారా? వాటిని దాచిపెడితే దాగేవా? అని ప్రశ్నించారు. అర్థంలేని విమర్శలు చేస్తున్నారని తప్పుబట్టారు. "ఆనాడు కులీ కుతుబ్‌షా హైదరాబాద్ నగరానికి అంకురార్పణ చేశారు. నిజాం కాలంలో సికింద్రాబాద్‌ను అభివృద్ధి చేశారు. ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన ముందుచూపు ఆలోచన వల్లే నేడు హైటెక్ సిటీ, శంషాబాద్ ఎయిర్‌పోర్టు, సైబరాబాద్, సిలికాన్ వ్యాలీ, ఔటర్ రింగ్‌రోడ్డు సదుపాయాలు వచ్చాయి" అని సీఎం అన్నారు. ఒక గొప్ప నగరాన్ని నిర్మించడానికి ఉండాల్సిన అర్హతలన్నీ భారత్ ఫ్యూచర్ సిటీకి ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దక్షిణ భారతదేశంలో పోర్టు లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని, ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ హైవేలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేసుకోబోతున్నామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి వరకు బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని చెప్పారు. సింగరేణి కార్పొరేట్ కార్యాలయ నిర్మాణానికి ఫ్యూచర్ సిటీలో పది ఎకరాలు కేటాయించాలని డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబుకు సూచించారు. 2026 డిసెంబరులోగా ఆ కార్యాలయ నిర్మాణం పూర్తిచేసుకునేలా చూడాలన్నారు. మంచి ఆలోచనతో ఈ అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, రాజకీయం చేయొద్దని కోరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భవిష్యత్తు అంతా ఫ్యూచర్ సిటీదేనని, ఏఐ టెక్నాలజీతో రూపుదిద్దుకోనున్న ఈ సిటీ ప్రపంచానికే తలమానికం కాబోతోందని అన్నారు.



సీఎం రేవంత్‌కు అంబర్‌పేట ఎస్టీఎఫ్ పనితీరును వివరిస్తున్న అధికారులు

మురుగునీటి శుద్ధి కేంద్రాల ప్రారంభం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరంలో వంద శాతం మురుగు నీటిని శుద్ధి చేసే లక్ష్యంతో నిర్మించిన ఆరు ఎస్టీపీలను సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం అంబర్‌పేట్‌లో ప్రారంభించారు. వీటితోపాటు ఔటర్‌రింగ్ రోడ్డు పరిధిలోని 39 ప్రాంతాల్లో ఉన్న స్థానిక సంస్థలు, గ్రామాల్లో ఎస్టీపీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం వాటర్ బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు. ముఖ్యంగా మూసీ నదిపై వచ్చే బ్రిడ్జిల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం కొత్తగా ప్రారంభించిన ఎస్టీపీలో కలియ తిరిగారు. ఆ తర్వాత మూసీ నదిని పరిశీలించారు. సీఎంతోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, లక్ష్మారెడ్డి, మున్సిపల్ శాఖ కార్యదర్శి ఇలంబర్తి, వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్టీల నుంచి లంబాడాలను తొలగించాల్సిందే

» ధర్మయుద్ధం సభలో ఆదివాసీ నేతల డిమాండ్

» సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్తా: పొదెం

భద్రాచలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఎస్టీ జాబితాలో చేర్చిన లాంబాడీలను తొలగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదివాసీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా గాంధేయ మార్గంలో 9 తెగల ఆదివాసీలు ఐక్యంగా పోరాడాలని, తమ పోరాటానికి అన్ని పార్టీలూ సహకరించాల్సిన సమయం ఆసన్నమైందని భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఆదివారం జరిగిన 'ధర్మయుద్ధం' సభలో పాల్గొన్న నేతలు చెప్పారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆదివాసీల ధర్మపోరాటానికి కాంగ్రెస్ పార్టీ సహకారం ఉంటుందన్నారు. మాజీ ఎంపీ సీతారాం నాయక్ చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించిన సోయం బాపూరావు.. 'సీతారాం నాయక్ గారూ.. మీరు సీఎం, ప్రధానిని భయపెట్టొచ్చు. కానీ సోయం బాపురావును భయపెట్టలేరు. ఆదివాసీల గురించి జాగ్రత్తగా మాట్లాడాలి. ఖబడ్దార్' అని హెచ్చరించారు. ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికెట్ల జారీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిస్తామన్నారు. డిసెంబర్ 9న 6లక్షల మందితో హైదరాబాద్‌లో బహిరంగసభలో తమ సత్తా చాటుతామని చెప్పారు.

గిన్నిస్‌బుక్ వరల్డ్

రికార్డే లక్ష్యంగా..

» నేడు 'మన బతుకమ్మ' వేడుకలు

» సరూర్‌నగర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి

హైదరాబాద్/ఎల్‌బీనగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గిన్నిస్ వరల్డ్ రికార్డే లక్ష్యంగా.. 'మన బతుకమ్మ' పేరిట రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సరూర్‌నగర్ స్టేడియంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించనుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగ కీర్తిని నలుమూలలు చాటేలా పర్యాటక శాఖ, జీహెచ్ఎంసీ, జిల్లా రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. పదివేల మంది మహిళల సమక్షంలో సోమవారం సాయంత్రం నుంచి బతుకమ్మ వేడుకలు ప్రారంభమవనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై ఆదివారం సాయంత్రం మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులతో సమీక్ష నిర్వహించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ కోసం నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క తదితర ప్రముఖులు పాల్గొంటారని అధికారులు తెలియజేశారు.

ఎల్బీ స్టేడియం నుంచి మహిళల సైకిల్ ర్యాలీ

బతుకమ్మ సంబరాల్లో భాగంగా ఎల్‌బీ స్టేడియం నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు ఏర్పాటు చేసిన బైక్, సైకిల్ ర్యాలీని మంత్రి జూపల్లి జెండా ఊపి ప్రారంభించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి స్వయంగా సైక్లిస్టులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన విమెన్ బైకర్స్ సంప్రదాయ వస్త్రధారణతో బుల్లెట్ బైకులతో నిర్వహించిన ర్యాలీ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

స్వదేశీ నినాదంతో

విప్లవాత్మక మార్పులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఇటీవల ఇచ్చిన స్వదేశీ నినాదం దేశంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా ఆయా రంగాల వారు ఆర్థికంగా మరింత నిలదొక్కుకుంటారని తెలిపారు. ఆదివారం, ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రాంచందర్‌రావుతో పాటు పలువురు నాయకులు వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశ అభివృద్ధిలో ప్రధాని మోదీ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. స్వదేశీ నినాదం, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని చెప్పారు. మంగళవారం హైటెక్స్‌లోని ఎగ్జిబిషన్ హాలులో 'మేరా దేశ్ పహలే-ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ నరేంద్ర మోదీ' మ్యూజికల్ కాన్సెప్ట్‌ను మనోజ్ ముంతసిర్ అనే ఆర్టిస్టు ప్రదర్శిస్తున్నారని తెలిపారు.

మూసీ పునరుజ్జీవానికి సహకరించాలి

నిర్వాసితులకు శాశ్వత నివాసం కల్పిస్తాం.. పేదలకు అన్యాయం జరిగే పని చేయను : సీఎం రేవంత్‌రెడ్డి





బతుకమ్మ కుంటను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/రాంనగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మూసీ నది పునరుజ్జీవం కోసం నగరవాసులు సహకరించాలని, మూసీ పరివాహక ప్రాంతంలో నివాసం కోల్పోతున్న వారందరికీ శాశ్వత నివాసం ఏర్పాటు చేసే బాధ్యత ప్రభుత్వానిదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. "ఎవరినీ నష్టపోనివ్వం.. కష్టపెట్టం. ఇది ప్రజా ప్రభుత్వం.. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం. పేదలకు అండగా నిలబడుతుంది" అని హామీ ఇచ్చారు. నగరంలోని అంబర్‌పేటలో హైడ్రా పునరుద్ధరించిన 'బతుకమ్మ కుంట'ను ఆదివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి నగర ప్రజలకు అంకితం చేశారు. బతుకమ్మకుంటను ప్రారంభించడంతోపాటు పూజలు చేసి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఆడబిడ్డలను మన సంతోషంలో భాగస్వామ్యం చేస్తేనే దసరా, బతుకమ్మ పండుగలకు నిండుదనం ఉంటుందని, ఈ బతుకమ్మ కుంట ప్రారంభోత్సవంలో మహిళలను భాగస్వామ్యం చేయడం సంతోషం కలిగిస్తోందని అన్నారు. తాము హైడ్రాను ఏర్పాటు చేస్తే కొంత మందికి అర్థం కాలేదని, కొందరికి అర్థమై.. వారి కబ్జాలు భవిష్యత్తులో సాగవని బురద జల్లే ప్రయత్నం చేశారన్నారు. ఒకప్పుడు నీటి ప్రవాహంతో కళకళలాడుతూ జీవధారగా ఉన్న మూసీ నది.. ఇప్పుడు మురికి కూపంగా మారిందన్నారు. అందుకే నగరంలోని చెరువులను విడిపించడం, నాలాలను విస్తరించడం, మూసీ పునరుజ్జీవనం చేయడాన్ని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని కోరారు. భారీ వర్షం కురిస్తే తట్టుకునే స్థితిలో నగరంలో మౌలిక సదుపాయాలు లేవని అన్నారు. భవిష్యత్తులో తట్టుకునే ఏర్పాట్లు చేసుకోవాలని, లేకపోతే జీవితాంతం సంపాదించుకున్నదంతా రాత్రికి రాత్రే నీళ్లలో మునిగిపోతాయని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలో నివసించే వారి పట్ల తనకు ప్రేమ, అభిమానం ఉన్నాయని, వారిని ఇబ్బంది పెట్టి చేసేదేముందని అన్నారు. "మూసీని చుట్ట చుట్టి సూట్‌కేసులో పెట్టుకుంటానా? మా ఇంటికి తీసుకెళ్తానా? విదేశాలకు తీసుకెళ్లి దాచుకుంటానా? ఈ ప్రాంతంలో అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉంది.. అనర్థాలు తగ్గించాల్సిన పరిస్థితి ఉంది" అని రేవంత్ వ్యాఖ్యానించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో ఐదు కిలోమీటర్ల మేర మూసీనది పరివాకవాక ప్రాంతం ఉందని, బఫర్‌జోన్‌లో ఇల్లు కట్టుకున్న పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించాలన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రతిపాదనను స్వాగతిస్తున్నాని సీఎం తెలిపారు. వెంటనే సర్వే చేసి అంచనా వేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్, మునిసిపల్ కమిషనర్‌కు ఆదేశాలిచ్చారు. అంబర్‌పేటలో అన్ని ప్రభుత్వ ఆఫీసులు ఒకేచోట ఉండేలా మినీ సెక్రటేరియట్ లాంటి భవనాన్ని కట్టిస్తామని హామీ ఇచ్చారు. బతుకమ్మ కుంట ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. బతుకమ్మ కుంటకు మాజీ ఎంపీ వి.హనుమంతరావు పేరు పెట్టాలన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సూచన మేరకు ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వీహెచ్ మాట్లాడుతూ బతుకమ్మ కుంటను పునరుద్ధరించాలని 3 దశాబ్దాలుగా పోరాడుతున్నానని చెప్పారు. సీఎం మద్దతు, హైడ్రా కృషితో తన కల సాకారమైందన్నారు.

నాగార్జునకు అధికారులు ముందే చెప్పారు


సినీ నటుడు నాగార్జునకు సంబంధించిన ఎన్ కన్వెన్షన్ విషయంలో తొలుత అధికారులు వెళ్లి ఆయనకు చెప్పారని, కానీ.. ఆయన స్పందించకపోవడంతో హైడ్రా వెళ్లి కూలగొట్టిందని సీఎం తెలిపారు. అయితే, "ఆ తర్వాత నాగార్జున స్వయంగా ముందు కొచ్చి ప్రజలకు ఆదర్శంగా ఉండదలుచుకున్నానని, ఇలాంటి వివాదాలు వద్దంటూ.. చెరువు పునరుద్ధరణకు రెండు ఎకరాల చెరువు స్థలాన్ని అప్పగించారు" అని అన్నారు. కాగా, 50 వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను హైడ్రా కాపాడిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. కాగా, హైడ్రా కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన పాటను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు.

సందేహాస్పదంగా న్యాయవ్యవస్థ స్వతంత్రత

» నియామకాల్లో పారదర్శకత అవసరం

» సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): న్యాయ వ్యవస్థ, ఎన్నికల సంఘం తదితర రాజ్యాంగ వ్యవస్థలను మోదీ ప్రభుత్వం ప్రభావితం చేస్తోందని సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ విమర్శించారు. తద్వారా దేశ సంస్కృతి, ఆత్మను నాశనం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెలంగాణ స్టేట్ డెమోక్రటిక్ ఫోరం ఆధ్వర్యంలో మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రశాంత్ భూషణ్ కీలకోపన్యాసం చేశారు. కొంతమంది న్యాయమూర్తులు పదవీ విరమణ చేసిన వెంటనే ప్రభుత్వ పదవులను పొందడం చూస్తుంటే న్యాయవ్యవస్థ స్వతంత్రత పైనే అనుమానాలు రేకెత్తుతున్నాయని వ్యాఖ్యానించారు. బిహార్‌లో జరిగిన ఓట్ల గల్లంతుకు సమాధానం ఇవ్వకుండా ప్రతిపక్షాలపై ఎన్నికల సంఘం ఎదురు దాడికి దిగడం ద్వారా బీజేపీకి బీ-టీమ్‌గా మారిందన్న విమర్శలను మూటగట్టుకుందని అన్నారు. కేంద్రం జారీ చేసిన ఆధార్, ఓటరు కార్డులను పరిగణలోకి తీసుకోకుండా ప్రజల దగ్గర లేని 11 రకాల పత్రాలు ఉంటేనే ఓటు హక్కు పొందడానికి అర్హులని అనడం హాస్యాస్పదమని అన్నారు. ఈడీ, ఐటీ, సీబీఐ వంటి సంస్థలను తమ జేబు సంస్థలుగా బీజేపీ వాడుతోందని దుయ్యబట్టారు. స్వాతంత్ర్య సమరయోధుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఈవీఎంలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపట్టాలని ప్రశాంత్ భూషణ్‌ను కోరారు. శాంతి చర్చలకు సానుకూలమని ప్రకటించిన తర్వాత కూడా కొన్ని వందల మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో చంపడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు.



ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

» పవన్ కల్యాణ్‌కు చంద్రబాబు సూచన

అమరావతి/హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తీవ్ర జ్వరంతో కొద్దిరోజులుగా బాధపడుతున్న ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. జ్వరం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆదివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో జనసేనాని నివాసానికి సీఎం వెళ్లారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జ్వర తీవ్రత తగ్గిందని, దగ్గు ఎడతెరిపి లేకుండా వస్తోందని పవన్ చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.


MARUTI SUZUKI
NEXA
THIS NAVRATRI, FIND INSPIRATION IN EVERY MILE.
AVAIL GST BENEFITS OF UP TO ₹1 07 000*
NOW STARTING AT ₹10 76 500 FOR GRAND VITARA AND ₹11 52 300 FOR XL6.
GRAND VITARA
XL6
NEXA SAFETY SHIELD
*OFFER VALID TILL 30TH SEPTEMBER 2025 ONLY
CONSUMER OFFERS OF UP TO ₹1 63 000^
EXCHANGE BONUS OF UP TO ₹1 00 000^
UP TO 100% WAIVER ON CAR LOAN PROCESSING FEE**
SCAN TO CONNECT TO A SHOWROOM NEAR YOU
E-BOOK TODAY @ WWW.NEXAEXPERIENCE.COM
Contact us at 1800-200-6392 1800-102-6392
For detailed T&C kindly visit nearest dealership. Maruti Suzuki India Limited reserves the rights to discontinue offers without notice and offers may vary across variants. ^Offers include consumer offer, exchange bonus and institutional or rural offers (wherever applicable) on select models/variants. Finance is at the sole discretion of the financer. 3 years or 100 000 km, whichever is earlier. Above offers are valid until stocks last. Black glass shade on the vehicle is due to the lighting effect. Images used are for illustration purposes only. Car colour may vary due to printing on paper. Revised prices effective from September 22, 2025. #Prices subject to applicable GST rates as notified by the Government. **By selected finance partners.